# క్రాంతి


**లోపలి పేజీల్లో...**

నేపాల్‌లో రాజకీయ సంక్షోభం ........ 5
'సత్యం' కుంభకోణం ........ 7
ఆహార సంక్షోభం ........11
పి.ఎల్.జి.ఎ. ప్రతిఘటన ........ 21
సిద్ధాంత వ్యాసం ........ మధ్య పేజీలో
మేడే స్ఫూర్తి... ........ 29
బుష్‌పై బూట్లు ........ 31
పోరాటాలు-సభలు ........ 33



**సి.పి.ఐ. (మావోయిస్టు) ఎ.పి., ఎస్.టి., ఎ.ఒ.బి. కమిటీల అధికార పత్రిక**

**సంపుటి: 33 సంచిక: 3 మే - జూన్ 2009 వెల: ఐదు రూపాయలు**


# 15వ లోక్‌సభ, మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ప్రతిపక్షాల నిర్లక్ష్యాన్ని వేలెత్తి చూపిస్తూ, పాత ప్రభుత్వాలకే మరల కొనసాగే అవకాశమిచ్చారు

# విప్లవోద్యమమే ప్రజలకు నిజమైన ప్రత్యామ్నాయాన్ని అందించాలి

15వ భారత పార్లమెంటుకు, ఆంధ్రా, ఒడిస్సా, సిక్కిం మూడు రాష్ట్రాలకు జరిగిన ఎన్నికల్లో పాత ప్రభుత్వాలే తిరిగి అధికారాన్ని చేజిక్కించుకున్నాయి. కాకుంటే స్వల్ప మార్పులున్నాయి. కేంద్రంలో కాంగ్రెస్‌కు కొన్ని సీట్లు పెరిగాయి. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు కొన్ని సీట్లు తగ్గాయి. ఒడిస్సాలో బి.జె.డి. ఒంటరిగానే ప్రభుత్వాన్ని ఏర్పరచింది. సిక్కింలో ఎస్.డి.ఎఫ్. ఒక్కటే మొత్తం 33 అసెంబ్లీ సీట్లను గెలుచుకుని ప్రతిపక్షమే లేని రాష్ట్రంగా చరిత్ర సృష్టించింది. కేంద్రంలోనూ, రాష్ట్రాలలోను ప్రతిపక్షాలన్నీ ఘోరంగా దెబ్బతిన్నాయి. అలా అని గెలిచిన వాళ్లు చెబుతున్నట్లు అభివృద్ధికో, సుస్థిరతకో వచ్చిన గెలుపుకాదిది.

2009, మార్చి 3న లోక్‌సభ, మూడు రాష్ట్ర శాసన సభల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడం, ఐదు దశల్లో ఎన్నికలు నిర్వహించడం, మే 16న పోలైన ఓట్లను లెక్కించి, ఫలితాలను ప్రకటించడం జరిగిపోయాయి. 71 కోట్ల 40 లక్షల మంది ఓటర్లున్న భారతదేశంలో పోలైన ఓట్లు 60 శాతం కన్నా తక్కువే. గతంకన్నా 5 శాతం తక్కువగానే పోలయినట్లు మీడియా చెబుతున్నది. ఈసారి ఎన్నికలలో గతంకన్నా డబ్బు, మద్యం అధికంగా ఖర్చు చేశారు. తనిఖీల్లో దొరికిన వందల కోట్ల రూపాయలు, వేల సంఖ్యలో దొరికిన మద్యం సీసాలు ఈ విషయాన్ని చెపుతున్నాయి. రిగ్గింగ్ భారీ స్థాయిలో జరిగింది. 70-80 శాతం పోలింగ్ జరిగిన అన్ని కేంద్రాలలో

## నివాళి

మన ప్రియతమ నేత, కేంద్ర కమిటీ సభ్యుడూ, కేంద్ర మిలటరీ కమీషన్ సభ్యుడు కామ్రేడ్ పటేల్ సుధాకర్ రెడ్డి, మరొక సీనియర్ నేత కామ్రేడ్ కోమటి వెంకటయ్యలను ఆంధ్రా ఎస్.ఐ.బి. పోలీసులు పట్టుకొని, 2009, మే 24న వరంగల్ జిల్లా తాడ్వాయి మండలం లావెల్ల అడవుల్లో పరమ క్రూరంగా కాల్చి చంపారు. ఈ దారుణ హత్యలను 'క్రాంతి' తీవ్రంగా ఖండిస్తోంది. వీరి అమరత్వానికి వినమ్రంగా జోహార్లర్పిస్తూ ఈ అమరుల ఆశయ సాధనలో మరింత దృఢంగా ముందుకు నడవాలనీ పార్టీ శ్రేణులకూ, ప్రజలకూ పిలుపునిస్తోంది.

కామ్రేడ్ పటేల్ సుధాకర్ రెడ్డి అమర్ రహే!

కామ్రేడ్ కోమటి వెంకటయ్య అమర్ రహే!

రిగ్గింగ్ జరిగినట్లు ఎలక్షన్ కమీషన్ గుర్తించింది. కడప జిల్లాలో, అనేక చోట్ల అటువంటి రిగ్గింగ్ సరైనది కాదని తిరిగి పోలింగ్ జరిపి రిగ్గింగ్ శాతాన్ని తగ్గించి జాగ్రత్తపడ్డారు. కులం, మతంలతోపాటు రహస్య ప్రలోభాలు పెట్టడం అనేకం జరిగాయి. బహిరంగంగా ఆచరణ సాధ్యంకాని వాగ్దానాలతో ఓటర్లను మోసం చేయడం పతాక శీర్షికల్లో కనబడింది. పోలయిన ఓటింగ్ శాతంలో ఎంతమంది స్వతంత్రంగా వేశారు. గెలిచిన వాళ్ల ఎంత శాతం ఓట్లతో ప్రతినిధులుగా ఎన్నిక అయ్యారు. 10 శాతం కన్నా తక్కువ మంది చేత ఎన్నుకోబడి 100 శాతం ప్రజలకు ప్రతినిధులుగా పరిపాలిస్తున్నారు. ఇదే ఇక్కడి ప్రజాస్వామ్యం. కుల, మత, లింగ వివక్షలు ఉన్న సామాజిక పరిస్థితులు, ఆర్థిక వ్యత్యాసాలున్న వర్గ సమాజంలో ప్రజాస్వామికంగా ఎన్నికలు జరగడం సాధ్యంకాదు. అందుకే ఈ ఎన్నికలు బూటకం. ఇక్కడి ప్రజాస్వామ్యం బూటకం.

1958 నుండి మణిపూర్‌లో సైనిక బలగాల ప్రత్యేక అధికారాల చట్టం వుంది. కేవలం అనుమానంతో కాల్చి చంపవచ్చు. దానిపై ఎఫ్.ఐ.ఆర్. నమోదు కూడా వుండదు. ఈ చట్టం అండతో సైన్యం అక్కడ చేసే అరాచకాలకు అంతేలేదు. అక్కడ ప్రజాస్వామ్యం వున్నట్లా? అక్కడే కాదు భారతదేశంలో విప్లవోద్యమం నడుస్తున్న అన్నిచోట్ల బూటకపు ఎదురుకాల్పుల్లో వందలాది యువతను గత 40 సంవత్సరాలుగా కాల్చి చంపుతున్నారు. కనీసం ఎఫ్.ఐ.ఆర్. నమోదు కావడంలేదు. ఇక్కడ మణిపూర్ లాంటి ప్రత్యేక చట్టాలులేవు కానీ ప్రజాస్వామ్యం కూడాలేదు. ఇక్కడున్న కోర్టులు, చట్టాలు పాలకవర్గాల చుట్టాలు. ప్రజలపాలిట నిరంకుశమైనవితప్ప మరొకటి కాదు. 40 సంవత్సరాల తర్వాత ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఎన్‌కౌంటర్లకు ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేయమంటే ఆ కేసుపై సుప్రీం కోర్టు స్టే ఇచ్చి, పాలకవర్గ సేవలో పునీతమయింది. ఈ వ్యవస్థను ఇలానే కాపాడి బడా భూస్వాముల, దళారీ పెట్టుబడిదారుల ప్రభుత్వాలను మారుస్తూ జరిగే ఎన్నికలు ప్రజాస్వామ్య ముసుగులో జరిగే బూటకపు ఎన్నికలే.

జమ్మూ-కాశ్మీర్ ప్రజల జాతి పోరాటాన్ని 60 సంవత్సరాలుగా భారత పాలకులు అణచివేస్తున్నా అది నిరంతరం రగులుతూనే వుంది. అక్కడి ప్రజలు అధిక శాతం ఎన్నికలను బహిష్కరిస్తున్నారు. దేశంలో అనేక రాష్ట్రాలలో విప్లవోద్యమం బలంగా వున్నచోట్ల సి.పి.ఐ.(మావోయిస్టు) నాయకత్వంలో ప్రజలు ఎన్నికలను బహిష్కరిస్తున్నారు. ప్రజా సమస్యలు తీవ్రంగా వున్నచోట ప్రజలు స్వచ్ఛందంగానే ఓట్లు బహిష్కరించారు. అటువంటి చోట జీరో పోలింగ్ జరిగినట్లు, వందల పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ జరపలేకపోయినట్లు ఎన్నికల కమీషన్ స్వయంగా ప్రకటించింది. గత ఎన్నికలకన్నా ఈసారి ఎన్నికల్లో బహిష్కరణ శాతం పెరిగింది. మిలిటెంట్ చర్యలు పెరిగాయి. పోలీసు బలగాలపై ఆంబుష్‌ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. 35 మంది వరకు పోలీసులు పి.ఎల్.జి.ఎ. ప్రతిఘటనలో చచ్చారు. విస్తృత స్థాయిలో విప్లవ రాజకీయాలు, ఎన్నికల బహిష్కరణ సందేశాలు ప్రచారం అయ్యాయి. అలాగే కోందమాల్‌లో మతతత్వ శక్తులను ప్రతిఘటించడం, బి.జె.పి. దూకుడును నిలువరించి ఓటమిపాలు చేయగలిగింది. పశ్చిమ బెంగాల్‌లో నందిగ్రాం, సింగూర్, లాల్‌గఢ్‌లలో ప్రజా ఉద్యమాలను నిర్మించి, సి.పి.ఎం. రాజకీయాలను, కార్పోరేట్ అనుకూల వైఖరిని బహిర్గతం చేయడమనేది దేశవ్యాప్తంగా సి.పి.ఎం. ఓటమికి తోడ్పడింది. ఒడిస్సాలో దామన్‌జోడి సి.ఐ.ఎస్.ఎఫ్. క్యాంపుపై దాడి, ఛత్తీస్‌గఢ్‌లో చింతగుప్పతో పాటు అనేక ఆంబుష్ సంఘటనలు, బీహార్‌లో సాసారాం, ఔరంగాబాద్ ఘటనలు, ఝార్ఖండ్‌లో లాతేహార్ ఘటన, మహారాష్ట్రలో మర్కగావ్‌లలో జరిగిన ప్రతిఘటన ప్రజల్లో వుత్సాహాన్ని పెంచి, ఎన్నికల బహిష్కరణ క్యాంపెయిన్‌కు ఊపునిచ్చాయి. ఎన్నికలు జరిగినచోట పార్టీ పిలుపు మేరకు బంద్‌లు కూడా విజయవంతం అయ్యాయి. విప్లవోద్యమ ప్రాంతమంతటా ఎన్నికలను సాయంత్రం 3 గంటలకే ముగించారు. హెలికాప్టర్లను వినియోగించారు. ఈసారి ఎన్నికల సందర్భంగా నక్సలైట్ ఉద్యమ ప్రచారం విస్తృతంగా జరిగింది.

గత ఎన్నికలకన్నా భిన్నంగా ఈసారి ఒక అంశం స్పష్టంగా కనబడింది. ప్రజలు దైనందిన సమస్యల సుడిగుండంలో పడి కొట్టుమిట్టాడుతూ పరిష్కారాల కోసం వెతుకులాడుతున్నారు. పాలక ప్రభుత్వం, ప్రతిపక్ష పార్టీలు ప్రజల సమస్యల పట్ల నిర్లక్ష్యాన్ని ప్రదర్శించాయి. సమస్యలకు కారణమైన ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడి అణచివేతను అనుభవించారు. ప్రతిపక్షాలు ఆ సమస్యలతో రాజకీయం చేసి, ఓట్లు సంపాదించుకునే కుయుక్తులు పన్నడమేతప్ప చిత్తశుద్ధితో పట్టించుకోలేదు. అందుకే ప్రజలకు విశ్వాసం సన్నగిల్లింది. ఎన్నికలు ఒక తంతని గుర్తించారు ప్రజలు. యధాలాపకత, ప్రేక్షక పాత్ర రోజు రోజుకూ పెరిగి ఏ పార్టీ పిలిచినా, సభ జరిపినా కూలి గిట్టుబాటవుతుందని వెళ్లడంతో అన్ని పార్టీలు సంఖ్యలు చూపించి బలం పెరిగిందని గొప్పలు చెప్పుకున్నాయి. ప్రజలు మాత్రం నిరాసక్తంగానే ఓట్లు వేసి తాము ఎవరి పక్షం కాదనీ, ఎవరు గెలిచినా ఒకటేనని, అందుకే ఎవరికీ మెజారిటీ ఓటు ఇవ్వకుండా తమ గొప్పదనాన్ని చాటుకున్నారు.

కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమెరికా అనుకూలత, ప్రపంచ బ్యాంకు ఆదేశిత విధానాల కారణంగా ప్రపంచ ఆర్థిక సంక్షోభ భారాన్ని మనం మోస్తున్నాం. ఆ సంక్షోభం భారతదేశాన్ని అన్ని రంగాలలో చుట్టుముట్టింది. అమెరికా భారత్ అణు ఒప్పందం

మనల్ని అమెరికా యుద్ధ వ్యూహంతో బంధించివేసింది. అవినీతి కుంభకోణాలు, ప్రజా వ్యతిరేక విధానాలు అనేకం గుర్తించి ప్రజలు పోరాడుతున్నా, కార్మికుల తొలగింపు, ప్రయివేటీకరణ, భూ ఆక్రమణలను వ్యతిరేకిస్తున్నా, బి.జె.పి.గానీ మరో ప్రతిపక్షంగాని ప్రజల పక్షాన నిలిచిందిలేదు. అలా నందిగ్రాం, సింగూర్‌లలో నిలిచిన మమతా బెనర్జీనీ, తృణముల్ కాంగ్రెస్‌ను ప్రజలు గుర్తించి ఆమెనూ, పార్టీని గెలిపించారు. అలా మరెక్కడా జరగలేదు. ఎన్.డి.ఎ., తృతీయ ఫ్రంట్, నాలుగో ఫ్రంట్ నాయకులు, మాయావతి, శరత్‌పవార్, లాలుప్రసాద్, కర్నాటక దేవేగౌడలతో పాటు అందరూ ప్రధాన మంత్రులు కావాలనే ఆశతో వున్నారు. ప్రజల్లో తమ స్థానాన్ని మరచి కలల్లో తేలియాడిన అందరినీ భూమి మీదకు తెచ్చిపడేసారు ఓటర్లు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఆ నాయకులు ఎవరూ ఆత్మవిశ్వాసంతో మాట్లాడటంలేదు. ఆ పార్టీలు కొన్ని చోట్ల డిపాజిట్లు కూడా సంపాదించుకోలేదు. ప్రతిపక్షాలకు ఎందుకు ఈ పరిస్థితి దాపురించింది? బి.జె.పి. ఓట్ల కోసం హిందూ సెంటిమెంటును రెచ్చగొట్టడంపై, టెర్రరిస్టు వ్యతిరేక ప్రచారంపై ఆధారపడింది. అద్వానీని ప్రధాని అభ్యర్థిగా ప్రకటించడం తనకు అనుకూలిస్తుందని అతిగా భ్రమిపడింది. ప్రధానిగా అద్వానీని ప్రజలు స్వీకరించడం అనుమానమేనని సర్వత్రా వినబడుతున్నా అది పట్టించుకోలేదు. ప్రపంచ బ్యాంకు, అమెరికన్ సామ్రాజ్యవాదం, ప్రపంచ ఆర్థిక సంక్షోభంల గురించిగాని ధరలు, నిరుద్యోగం, దారిద్ర్యం, ద్రవ్యోల్బణం, ఎస్.ఇ.జడ్.లు లాంటి ప్రజల సమస్యల మీద నిర్మాణాత్మక కార్యక్రమం ఐదు సంవత్సరాలలో ఎక్కడా లేదు. అందుకే బి.జె.పి.కి పార్లమెంట్ సీట్లు ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లలో వచ్చినా మిగిలిన చోట్ల రాలేదు. దేశ నాయకులు, రాష్ట్ర నాయకులే గెలువలేదు. ఆంధ్రప్రదేశ్‌లో దత్తాత్రేయ కూడా ఓడిపోయాడు. ఇప్పుడు ఆ పార్టీకి వున్న బలహీనతలరీత్యా సరైన ప్రతిపక్షంగా వ్యవహరించగలదన్న విశ్వాసం ప్రజలకు లేదు.

మూడవ ఫ్రంట్‌లో ప్రధాన శక్తులు వామపక్ష పార్టీలు. ప్రజల్ని రాజకీయంగా చైతన్యవరుస్తున్నామని అనుకుంటున్న భారతదేశంలోని కమ్యూనిస్టులు నాలుగు సంవత్సరాలు కాంగ్రెస్ పంచన చేరి ప్రజల్ని వంచించారు. ముందుగానీ ఇప్పుడు గానీ వారి ఎజెండా బూర్జువా పార్టీల లాగానే ఎన్నికల ఎజెండాతప్పా అది ఎప్పుడూ ప్రజల ఎజెండాగా లేదు. కార్మికుల హక్కులు, ప్రజల భద్రత పట్టని మార్క్సిస్టులు పెట్టుబడిదారీ అనుకూల (బెంగాల్) విధానాలతో, టాటా, జిందాల్ కార్పోరేట్ సంస్థల సేవలో ప్రజావ్యతిరేక పాలకులుగా నిరూపించబడ్డారు. అందుకే దేశవ్యాప్తంగా ప్రజలు అసహ్యించుకున్నారు. సి.పి.ఎం.ను ఓడించి తృతీయ ఫ్రంట్ పేకమేడలు కూల్చివేశారు.

ఎన్.డి.ఎ., తృతీయ ఫ్రంట్, మరో ఫ్రంట్, బి.ఎస్.పి. పార్టీలతో సహా అన్ని పార్టీలు ప్రజల సమస్యలను పట్టించుకోలేదు. ప్రజల్లో అన్ని సెక్షన్లు అన్ని సమస్యలపై కొన్ని వందలసార్లు ఆందోళనలు చేపట్టారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్నీ, అప్రజాస్వామిక విధానాలను, నిర్బంధకాండలను నిరసించారు. ఈ పోరాటాలలో పార్టీల పాత్రలేదు. ఉన్నా నామమాత్రమే. ప్రజల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోలేదు, ప్రతిపక్షాలు పట్టించుకోలేదు. ఐదు సంవత్సరాల తర్వాత ఓట్లు అడిగితే ప్రజలు ప్రతిపక్షాలకు ఎలా ఓటు వేస్తారు. పాలకుల లాభాల వేటలో, లాబీల ఆటలో ఆస్తులు కూడగట్టుకోవడంలో భాగంగా కాంట్రాక్టులు పంచుకోవడంలో మునిగితేలే ప్రతిపక్షాలు కూడా అందినకాడికి వాటాలు, కోటాలు సంపాదించుకున్నారు. అందుకే వీళ్ల పార్టీలు, జెండాలు, రంగులు వేరయినా విధానాలన్నీ ఒక్కటే. ప్రజలను పీల్చి పిప్పిచేసే ప్రపంచ బ్యాంకు, విదేశీ పెట్టుబడులు, అణుఒప్పందం, కార్పోరేట్ వ్యాపారాలు, ఎస్.ఇ.జడ్.లు, గనుల తవ్వకాలు ఏవీ వీరికి ఆటంకం కాదు. వాటాలు ఇచ్చే వనరులయ్యాయి. సంపద మార్గాలయ్యాయి. తమ దళారీ పనికి ఎన్నికల వేళ సీట్లు సంపాదించి, లైసెన్స్ పొందడం ఆనవాయితీ అయింది. ప్రజలు ఈ వాస్తవం గుర్తించారు. అందుకే 'ఏ రాయైతేనేం పళ్లూడగొట్టుకోవడానికి' అని ఉన్నదాంట్లోనే ఒకదాన్ని ఎంచుకున్నారు.

ఈ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన విషయం కావలసిన తెలంగాణా సమస్యను అందరూ కలిసి బొంద పెట్టారు. తెలంగాణకు సానుకూలం అని చెప్పి, పార్లమెంట్ పార్టీలన్నీ కూడబలుక్కొని పచ్చి దగా చేసాయి. టి.ఆర్.ఎస్. చంద్రశేఖర్ రావు అసలు రంగు బహిరంగం కావడంతో ప్రజలు భ్రమలు వీడి వుద్యమ పరిష్కారాన్ని ఆలోచిస్తున్నారు. ప్రజలకు ఆ సమస్య ఉన్నంత వరకు అక్కడ ఉద్యమాల ఊట వుంటూనే వుంటుంది.

ఆంధ్రప్రదేశ్‌లో కూడా టి.డి.పి. దుష్టపాలనతో విసిగిపోయిన ప్రజలు ప్రభుత్వ వ్యతిరేక ఓటు వై.ఎస్.ఆర్.కు లాభించినంతగా అయిదు సంవత్సరాల కాంగ్రెస్ పాలన తెచ్చిన అభివృద్ధి పథకాలు కాంగ్రెస్‌కు లాభించలేదు. సీట్లు బాగా తగ్గిపోయి బొటా బొటిగానే మెజారిటీ అనిపించుకుంది. ఎక్కడో అధఃపాతాళంలో ఉన్న టి.డి.పి. మాత్రం వై.ఎస్.ఆర్. అవినీతి పాలన ఇచ్చిన వ్యతిరేక ఓట్లతో సీట్లు పెంచుకుని లాభపడింది. కానీ దాని దుష్టపాలన గుర్తులు ఇంకా మిగలడం, వామపక్షాలకు నైతికత లేకపోవడం, టి.ఆర్.ఎస్. చంద్రశేఖర్ అహంకారపూరిత, స్వార్థ రాజకీయాలు, అన్నీ కలిసి అది మాయా కూటమిగా విశ్వసించలేనిదిగా ప్రజలు సరిగానే గుర్తించి దూరం పెట్టారు. ఇక చిరంజీవి సినీ గ్లామర్ యువకుల్ని

ఆకర్షించి వెంట తిప్పుకోవడానికి తోడ్పడినా ప్రజలకు రాజకీయ భవితవ్యాన్ని అందిస్తాడన్న విశ్వాసం కలిగించలేకపోవడంతో చిరంజీవి ఎన్ని'కల'ల చిత్రం సూపర్ ఫ్లాప్ అయ్యింది. రాష్ట్రంలో అభివృద్ధిని చూసి ఓట్లు వేస్తే గతంకన్నా ఓట్ల శాతం, సీట్ల శాతం పెరగాలి. అలా జరగలేదు. ఓట్లు సీట్లు తగ్గడమేకాదు, తెలంగాణలో ఘోర పరాభవమే జరిగింది. తెలంగాణా విషయంలో కాంగ్రెస్ అనుసరించిన ప్రజావ్యతిరేక వైఖరికి ప్రజలు మంచిగానే బుద్ధి చెప్పారు. డి. శ్రీనివాస్ (కాంగ్రెస్ అధ్యక్షుడు)తో పాటు రాష్ట్రంలో 14 మంది మంత్రులు ఓడిపోయారు. ఆ భయంతోనే రోశయ్య దొడ్డిదారిన మంత్రి అయ్యాడు. కడప లాంటి చోట్ల భారీ రిగ్గింగ్ బహిరంగంగా జరిగింది.

దేశ రాజకీయాల్లో నెహ్రూ కుటుంబ వారసత్వ పాలన, అదుపు యధేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఇప్పుడు సోనియాగాంధీ తిరుగులేని నాయకురాలయ్యింది. అమెరికా అండదండలు పుష్కలంగా కొనసాగుతున్నాయి. మన్మోహన్‌సింగ్ (ఐ.ఎం.ఎఫ్. అనుభవంతో) సామ్రాజ్యవాద అనుకూల కార్యక్రమాన్ని ప్రపంచ బ్యాంకు కనుసన్నల్లో సజావుగా నిర్వహిస్తున్నాడు. ఐదు సంవత్సరాల పాలనలో కాంగ్రెస్ ప్రజలకు చేసింది శూన్యం. ప్రజల పేరుతో కార్పోరేట్ ప్రపంచానికి దోచిపెట్టిన దానికి లెక్కలే లేవు. ఇక్కడ సంపన్నులు మరింతగా సంపన్నులైతే ప్రజలు అధిక శాతం దారిద్ర్యంలోకి కూరుకుపోయారు. ఈ లెక్కలు చూస్తే పాలకవర్గాల అభివృద్ధి అందరికీ సులభంగా అర్థమవుతుంది. మన దేశపు దొంగ డబ్బు 1లక్షా 50 వేల కోట్ల డాలర్లు (72 లక్షల కోట్ల రూపాయలు) స్విస్ బ్యాంకుల్లో వుంది. ఇది భారతదేశ బడ్జెట్‌కు అనేక రెట్లు అధికం. దానితో మన దేశ అప్పులు తీర్చివేయవచ్చు. ప్రజల మీద పన్నులు వేయకుండా ఆ డబ్బు తెచ్చే వడ్డీతోనే బడ్జెట్‌ను నడపవచ్చు. ప్రజల సంక్షేమానికి, దేశ అభివృద్ధికి ఎంతో చేయవచ్చు. భారతీయులందరికీ పంచితే కూడా ప్రతీ ఒక్కరికీ ఒక లక్ష రూపాయలు వస్తుంది. ఇదంతా ప్రజల శ్రమ సంపద, దాన్ని దోచుకున్నారు. కూడబెట్టారు. విదేశాలకు తరలించారు. ఇది ఒక దేశంలోని (స్విస్ బ్యాంకు) లెక్క మాత్రమే. ఇటువంటివి 70 దేశాలున్నాయి. అక్కడకు ఇంకెంత సంపద తరలిపోయిందోమరి. ఇప్పుడు భారతీయులు సహజంగానే దరిద్రంలో వున్నారు. కొన్ని గణాంకాల ప్రకారం స్థూల జాతీయోత్పత్తి వృద్ధిరేటు 5 శాతానికి తగ్గింది. పారిశ్రామిక రంగం, సరుకుల తయారీ రంగం వృద్ధి రేటు 50 శాతం పడిపోయింది. శ్రామిక శక్తిలో 94 శాతం అసంఘటిత రంగంలో వున్నారు. కనీస వేతన చట్టం అమలుకావడంలేదు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు వేల సంఖ్యలో మూతపడుతున్నాయి. మన ప్రయాణం ఎటువైపుకు వెడుతుంది? పాలకులు చెప్పే అభివృద్ధికి అర్థం ఏమిటి? టాటా, బిర్లా, మిట్టల్, అంబానీ సోదరుల లాంటి వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, ప్రభుత్వాధికారులు, సినీ స్టార్‌లు మున్నగువారు అభివృద్ధి చెందడమే కదా.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటికి పెట్టుబడిదారుల ఆస్తుల వివరాలను, నేడున్న ఆస్తుల వివరాలను పోల్చి చూస్తే కొన్ని వందల రెట్లు అవి పెరిగినట్లు అర్థమవుతుంది. కాంగ్రెస్‌గాని, మరే పార్టీగాని అభివృద్ధి అంటే ఎవరికి చేసారో స్పష్టమే.

ఐదేళ్ల పదవీ కాలంలో నోరు మెదపని పార్లమెంటు సభ్యులు 15 మంది ఉన్నారని, వారిలో కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ, బి.జె.పి. నేత అద్వానీ కూడా ఉన్నారని స్పీకర్ సోమనాథ్ ఛటర్జీ చెప్పాడు. అధికారపక్ష నాయకురాలు, ప్రతిపక్ష నాయకుడు కూడా మాట్లాడని పార్లమెంటు బహుశా భారతదేశమే కావచ్చు. భారత ప్రజాస్వామ్యం ప్రపంచంలోనే పెద్ద ప్రజాస్వామ్యం అంటున్నారు మరి. భారీ ఖర్చుతో జరిగే ఎన్నికలు పార్లమెంటులో జరిగే అవినీతి, అనైతిక విషయాలు ఈ రాజకీయ పార్టీలకు గొప్ప కావచ్చుగాని ప్రజలకు, ప్రజల ప్రజాస్వామ్యానికి కాదు. ఈ రాజకీయ ఆర్థిక, సామాజిక వ్యవస్థను యధాతధంగా నిలబెట్టే దోపిడీ పాలకవర్గాలు వ్యవస్థ మౌలిక మార్పుకు ప్రజలు మరలిపోకుండా ఈ ఎన్నికలను ఒక తంతులాగా నడుపుతున్నారు. దానిలోనే ప్రజాస్వామ్యం, స్వర్గం ఉన్నాయని భ్రమింపజేస్తున్నారు.

ఎన్నికల సందర్భంగా ప్రజల్ని కలిసి మాట్లాడితే నూటికి తొంభై మంది తాము ఆకలి, దరిద్రం, అనారోగ్యాలతోను, నిర్లక్ష్యం, వివక్ష, అభద్రతలతోను బతుకు వెళ్లమారుస్తున్నామన్నారు. తమ భూములు పోయిన వాళ్లు, గ్రామాలను ఖాళీ చేసిన వాళ్లు, బతకుదెరువు (వుపాధి) కోల్పోయిన వాళ్లు, గిట్టుబాటు ధరలేక, వ్యవసాయం గిట్టుబాటుకాక కొందరు, చేనేత లాంటి చేతివృత్తులకు ఆదరణ లేక మరికొందరు, పని పరిస్థితులు బాగులేక, ఉద్యోగాలూడిపోయి, సంక్షేమ హాస్టల్స్ మూసివేసి మరికొందరు, ఇలా భారతదేశంలో నూటికి 90 శాతం మంది సమస్యల్లో ఉన్నారు. వారికి ప్రత్యామ్నాయంగా కనబడుతున్నది ప్రజాఉద్యమమే. ప్రజలను చిత్తశుద్ధితో పోరాట మార్గం వైపు నడిపే శక్తుల కోసం ఎదురుచూస్తున్నారు. ఆదివాసులు, క్రిష్టియన్లపై కోందమాల్‌లో జరిగిన మతోన్మాద హింస ప్రపంచంలోనే పెద్దది. ఇటువంటివి, గుజరాత్ లాంటి ప్రభుత్వ ప్రేరేపిత దాడులు భారతదేశంలో అనేకం జరుగుతున్నాయి. వీటిని ఎదుర్కోవడానికి ప్రజలకు అండదండలను అందించే విప్లవ పార్టీ అవసరం.

*(మిగిలినది 32వ పేజీలో...)*

# ఉనికిలో ఉన్న రాజ్యాన్ని ధ్వంసం చేయకుండా నూతన నేపాల్‌ను నిర్మించాలనుకోవడం ఒట్టి భ్రమ

హిమాలయ రాజకీయాలు ఇప్పుడు మరోసారి సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. అస్థిరత, అవిశ్వాసం, గందరగోళం అక్కడి పరిస్థితుల్ని కకావికలం చేస్తున్నాయి. ప్రజాయుద్ధాన్ని నిర్వహించి దేశంలో ప్రజల చొరవనూ, చైతన్యాన్ని పెంచిన నేపాల్ మావోయిస్టు పార్టీ అన్ని రాజకీయ పార్టీలను రాచరిక వ్యతిరేక పోరాటంలోకి ఆహ్వానించి విస్తృత ప్రజానీకం మద్దతుతో రాచరికాన్ని మట్టి కరిపించింది. సహజంగానే నూతన రాజ్యాంగ సభకు జరిగిన ఎన్నికల్లో మెజారిటీ రాకపోయినా అతిపెద్ద పార్టీగా నిలిచింది. నేషనల్ కాంగ్రెస్ రెండవ స్థానంలో, సి.పి.ఎన్.(యు.ఎం.ఎల్.) మూడవ స్థానంలోను నిలిచాయి.

2006 నవంబర్‌లో ఏర్పడిన ఏడు పార్టీల కూటమి రాచరికానికి వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించి, 2008 ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికల్లో గెలిచాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే దగ్గర వచ్చిన సందిగ్ధత, సంక్లిష్టత అధ్యక్ష ఎన్నిక దగ్గర ముడిపడింది. చట్ట సభలో పెద్ద పార్టీగా వున్న మావోయిస్టులకు వ్యతిరేకంగానే మిగిలిన పార్టీలు పనిచేసి అధ్యక్ష ఎన్నికల్లో మావోయిస్టు అభ్యర్థిని ఓడించారు. ఈ పరిణామం ఆశ్చర్యపరిచినా ఆ పార్టీలన్నీ ఒక్కటి కావడం, మావోయిస్టులను ఒంటరి చేయడం సహజమే అని సర్దుకున్నారు. అధ్యక్ష ఎన్నిక తర్వాత ప్రభుత్వాన్ని ఏర్పరచడానికి నాలుగు నెలల కాలం పట్టింది. అనేక తర్జన భర్జనలు, సర్దుబాట్ల తర్వాత కామ్రేడ్ ప్రచండ ప్రధానిగా ఎన్నికయ్యాడు. యు.ఎం.ఎల్. పార్టీ, మధేసీ జనాధికార ఫోరమ్‌ల భాగస్వామ్యంతో మరో 14 పార్టీల సహకారంతో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు జరిగింది. నేషనల్ కాంగ్రెస్ ప్రభుత్వంలో చేరడానికి సిద్ధపడలేదు.



2008, ఆగస్టులో ప్రభుత్వం ఏర్పడినప్పటికీ స్థిరత్వం లేని కారణంగా 2009 మేలో (8 నెలలకే) అధికారం నుండి వైదొలగింది. కారణాలు స్వల్పమైనవిగానే కనబడుతున్నాయి. నేపాల్‌లో కుదిరిన చారిత్రక ఒప్పందం ప్రకారం నేషనల్ ఆర్మీలోకి కానీ, మావోయిస్టు గెరిల్లా సైన్యంలోకి గాని తాజాగా ఎవరినీ తీసుకోరాదు. 2009 జనవరిలో నేపాల్ ఆర్మీలోకి కొత్త రిక్రూట్‌మెంట్లు జరపాలని సైనికాధికారి నిర్ణయించడంతోపాటు, ప్రధాని ప్రచండతో వివాదానికి దిగాడు. పాత ఖాళీలను భర్తీ చేసే ప్రక్రియ సాగుతుందని, తాజా నియామకాలు ఆపే ప్రసక్తే లేదని సైనిక వర్గాలు ప్రకటించాయి. ఒకేసారి రెండు వేల 500 మందిని తీసుకోవద్దనే విషయంతోపాటు, గెరిల్లా సైన్యం నుండి తీసుకోవాలని కూడా మావోయిస్టులు పట్టుబడుతున్నారు. సైనిక నియామకాలు కొనసాగిస్తూపోతే కఠిన చర్యలు తప్పవని ప్రచండ హెచ్చరిక కూడా చేశాడు. ఆ వివాదం తారా స్థాయికి చేరి సైనికాధికారిని ప్రధాని తొలగించాడు. ఈ తొలగింపును నేషనల్ కాంగ్రెస్‌తోపాటు ప్రభుత్వంలో వున్న భాగస్వామ్య పార్టీలు కూడా వ్యతిరేకించాయి. ఇది తొందరపాటు నిర్ణయమని, సైనికాధికారిని తిరిగి నియమించాలని బూర్జువా పార్టీలు, రివిజనిస్టు పార్టీలు కలిసికట్టుగానే అనుకోవడంతో అధ్యక్షుడు సైనికాధికారిని తిరిగి నియమించాడు. ఆగ్రహించిన ప్రధాని కా. ప్రచండ రాజీనామాతో మరల నేపాల్ రాజకీయాల్లో రెండు వారాలు ప్రతిష్టంభన ఏర్పడింది. తర్వాత కాంగ్రెస్ మద్దతుతో గత ప్రభుత్వంలోని పార్టీలన్నీ కలిసి మావోయిస్టుల భాగస్వామ్యం లేకుండానే యు.ఎం.ఎల్. పార్టీ నాయకుడు మాధవకుమార్ నేపాల్‌ను ప్రధానిగా ఎన్నుకున్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. మావోయిస్టులను ప్రభుత్వంలోకి ఆహ్వానించినా చేరలేదు. కాంగ్రెస్ పార్టీ మొదట ప్రభుత్వంలో చేరకుండా బయటినుండి మద్దతు ప్రకటించినా తర్వాత మనసు మార్చుకుని ప్రభుత్వంలో చేరింది. భారత పాలకవర్గాలకు, అమెరికన్ సామ్రాజ్యవాదానికి, నేపాల్ దోపిడీ వర్గాలకు అనుకూలంగా ఈ మలుపు ఇంత సులువుగా తిరగడం గొప్ప విశేషం. ప్రభుత్వం మారడానికి కారణమైన సైనికాధికారిని తిరిగి

నియమించడం విషయంలో వచ్చిన వివాద పరిష్కారానికి ముగ్గురు మంత్రులతో క్యాబినేట్ కమిటీని ఏర్పరిచారు. వారి సూచనమేరకు సైనికాధికారిని మార్చవచ్చు. మావోయిస్టులు దేశవ్యాప్తంగా ఆందోళనను విస్తృతం చేయడంతో సైనికాధికారిని మారుస్తారు అనేది వాస్తవం.

సైనిక నియామకం దగ్గర వివాదం ప్రభుత్వాన్నే మార్చింది అంటే అక్కడ పరిస్థితులను అర్థం చేసుకోవచ్చు. మావోయిస్టుల నాయకత్వంలోని ప్రభుత్వాన్ని నిలబడకుండా, అస్థిరపరిచే శక్తులు అనేకం వున్నాయన్న వాస్తవం మరింత స్పష్టమయ్యింది. అమెరికన్ సామ్రాజ్యవాదం, భారత విస్తరణవాదం బయట నుండి పని చేస్తున్న బలమైన శక్తులు. పదవీచ్యుతుడైన రాజు, రాజుకు అనుకూలమైన శక్తులు బహిరంగంగా కనబడే శక్తులు. ప్రత్యక్షంగాను, పరోక్షంగాను అధికారంలో భాగం పంచుకుంటున్న బూర్జువా రివిజనిస్టు రాజకీయ పార్టీలు మరింత ప్రమాదకరంగానూ, శత్రుపూరితంగాను మారుతున్నాయి. రాచరికానికి వ్యతిరేక పోరాట ఐక్యత ముగిసింది. ఇప్పుడు బూర్జువా ప్రజాస్వామ్యానికి, నూతన ప్రజాస్వామ్యానికి మధ్య పోరాటం మొదలయింది. నేపాల్ మావోయిస్టులు ఈ రెండు దశలకు మధ్య మరో దశగా బహుళ పార్టీ ప్రజాస్వామ్యం అనే పరివర్తన దశను చెబుతున్నప్పటికి పరిస్థితులు "ఆ నూతన దృక్పథాన్ని" ఇముడ్చుకునేలా కనబడడం లేదు. బూర్జువా, రివిజనిస్టు పార్టీలు ఏమాత్రం రాజీపడకుండానే తమ వర్గ ప్రయోజనాలకు అనుగుణంగానే ఎత్తుగడలతో అధికారాన్ని నిలబెట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. కానీ మావోయిస్టులు ప్రజా యుద్ధాన్ని మధ్యలో నిలిపివేసి '21వ శతాబ్దపు ప్రజాస్వామ్యం', 'బహుళ పార్టీ ప్రజాస్వామ్యం' పేరుతో ఎన్నికల రాజకీయాల్లోకి దిగి నూతన రాజ్యాంగ సభ ఏర్పాటుకు ప్రయత్నాలు చేశారు. మూడు దశల సిద్ధాంతంతో పరివర్తనా దశను ఆవిష్కరించడంలో మునిగిపోతున్నారు.

నేపాల్‌లో రాచరికాన్ని ఓడించి, రాజ్యాంగ సభ ఎన్నికల్లో అతి పెద్ద పార్టీగా సి.పి.ఎన్.(మావోయిస్టు)ను ప్రజలు గెలిపించినా ఆ ఘనత ప్రజాయుద్ధానిదే. నూతన ప్రజాస్వామిక విప్లవ రాజకీయాలు, విముక్తి ప్రాంతాలు, ప్రజావిముక్తి సైన్యం లేకుండా ఇది అసాధ్యం.

నేపాల్‌లో 2008, ఏప్రిల్ 10న రాజ్యాంగ సభ ఎన్నికల ఫలితాలు పురాతన రాచరికానికి, భారత విస్తరణవాదానికి, అమెరికా ఆధిపత్యానికి వ్యతిరేకంగాను, స్థానిక దళారీ-భూస్వామ్య పార్టీల ద్రోహానికి వ్యతిరేకంగాను ప్రజల తీవ్ర ఆగ్రహాన్ని తెలియజేశాయి. దశాబ్ద కాలం పాటు (1996-2006) సాగిన ప్రజాయుద్ధం నేపాల్ ప్రజల చైతన్యాన్ని పెంచి, ప్రజాస్వామిక ఆకాంక్షలను ప్రేరేపించింది. రాజ్యాంగసభ కోసం నేపాల్ వ్యాప్తంగా పెరిగిన ప్రజా వుద్యమానికి పునాదిని ఏర్పరచింది ఆ ప్రజాయుద్ధమే.

ఎన్నికలకు కొద్ది రోజుల ముందు 2008 మార్చిలో సి.పి.ఎన్.(మావోయిస్టు) తన రాజ్యాంగసభ నిబద్ధతా పత్రాన్ని విడుదల చేసింది. అందులో "మావోయిస్టు ప్రజాయుద్ధ తోడ్పాటు లేకుండా నేటి రాజకీయ పరిణామాన్ని ఊహించలేం. ఈనాడు దేశంలో పెరిగిన వర్గ, జాతి, ప్రాంతీయ, లింగపరమైన, దళిత చైతన్యం దేశాన్ని రాజ్యాంగపరంగా సమాఖ్య గణతంత్ర రాజ్యంగా ప్రకటించింది. ఈ కీర్తి పది సంవత్సరాల ప్రజాయుద్ధానిది. ప్రజాయుద్ధ క్రమంలో 20 వేల ప్రజాసైన్యం అభివృద్ధి కాకుంటే రాజరికాన్ని ఇంత తేలికగా కూలదోయడం ఊహించలేనిది" అని చెప్పింది.

ఆ ప్రజా విముక్తి సైన్యాన్ని నేషనల్ ఆర్మీలో విలీనం చేయడం, విముక్తి ప్రాంతాలను వదులుకోవడం, పార్టీ పేరు నుండి 'మావోయిస్టు' అనే పదాన్ని తొలగించడం, బహుళపార్టీ ప్రజాస్వామ్యం, 21వ శతాబ్దపు ప్రజాస్వామ్యం, ప్రచండ కొత్త పంథా 'మూడు దశల సిద్ధాంతం' చెప్పడం ఇవన్నీ మార్క్సిస్టు-లెనినిస్టు మూల సూత్రాలకు భిన్నంగాను, సంస్కరణవాదంతోను కూడుకుని ఉన్నాయని సర్వత్రా విమర్శలు వచ్చాయి. ఇప్పటికీ నేపాల్‌లోను, ప్రపంచ దేశాలలోను తీవ్రమైన చర్చలు నడుస్తూనే వున్నాయి. నేపాల్ అంతర్గత పోరాటంలో వర్గ పోరాటాన్ని ప్రధాన ఎజెండాగా చేపట్టాలంటున్నారు.

పార్టీ అధికారిక పంథాగా చెప్పబడుతున్నా 'బహుళ పార్టీ ప్రజాస్వామ్య వ్యవస్థ' నిర్మాణంపై భిన్నాభిప్రాయాలున్నాయి. బూర్జువా పార్టీలతో కలిసి అధికారాన్ని పంచుకుని ప్రభుత్వాన్ని ఏర్పరచడం, రాజ్యాంగాన్ని రచించడం బూర్జువా ప్రజాస్వామ్యానికే దారితీస్తుంది. బూర్జువా ఆస్తి రాజ్యాంగం హక్కును బలపరుస్తుంది. విప్లవాత్మక భూసంస్కరణలకు తిలోదకాలిస్తుంది. మావోయిస్టు సాయుధ బలగాలు నిర్వీర్యమైపోతాయి అని నేపాల్‌లోని విప్లవ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి. ఆక్రమించుకున్న భూములు, పోరాడి సాధించుకున్న హక్కులు అన్ని కోల్పోయాక మావోయిస్టులు అధికారంలో వుండి ఉపయోగం ఏమిటి? అని ప్రశ్నిస్తున్నారు.

"రాచరికాన్ని కూలదోసిన వెంటనే నూతన ప్రజాస్వామిక రిపబ్లిక్ ఒక్క గెంతులో సాధ్యం కాదు. బహుళపార్టీ ప్రజాస్వామిక వ్యవస్థను పటిష్టం చేసి నేపాల్‌ను ఆర్థికంగా, రాజకీయంగా పునర్నిర్మాణం చేసి పటిష్టపరచాలి. ఈ దశలో భూ సంస్కరణలను

*(మిగితాది 37వ పేజీలో...)*

# ప్రభుత్వ అండదండలతో జరిగే 'సత్యం' తరహా కుంభ కోణాల

# అసలు దొంగలను ప్రజలే శిక్షించాలి

సత్యం కంప్యూటర్స్ సంస్థ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐ.టి) రంగంలో దేశంలోనే గాక, ప్రపంచ వ్యాప్తంగా చాలా పేరుపొందిన సంస్థ. అరవై దేశాలకు సంస్థ శాఖలు విస్తరించి, 50 వేలకు పైగా వుద్యోగస్తులతో కార్యకలాపాలు కొనసాగిస్తున్నది. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక ప్రగతికి సూచికగా పేర్కొనే స్థాయికి ఎదిగింది. అటువంటిది గతంలో జరిగిన కుంభకోణాల కంటే భారీ అవినీతి కుంభకోణంతో ప్రజలను మోసం చేయటంలో కూడా అదే స్థాయిలో ఈ రోజున పేరు మోగిపోతున్నది. ఇంతటి భారీ కుంభకోణంతో లక్షలాది ప్రజలను ఘోరంగా మోసం చేయడానికి, ఇటువంటి కుంభ కోణాలు సునాయసంగా జరిగిపోతూండటానికి గల పునాదులను ఒకసారి తరచి చూద్దాం.

పశ్చిమ గోదావరి జిల్లాలోని భూస్వామ్య కుటుంబానికి చెందిన బైర్రాజు రామలింగరాజు వ్యవసాయం ద్వారా, ఇతర వ్యాపారాల ద్వారా సంపాదించిన లాభాలను ఐ.టి. రంగంలోకి తరలించి హైదరాబాద్‌లో సత్యం కంప్యూటర్స్ సంస్థను స్థాపించాడు. దాదాపు 25 సంవత్సరాల క్రితమే ఐ.టి. ప్రాముఖ్యతను గుర్తించి, కంపెనీ పెట్టి, ఆ రంగంలో అవకాశాలను వినియోగించుకుని దేశంలోనే పెద్ద ఐ.టి. కంపెనీల్లో ఒక దానిగా 'సత్యం'ను అభివృద్ధి చేశాడు. సంపన్న దేశాల పరిశ్రమలు, బ్యాంకులు, ఇన్సూరెన్స్, ఆరోగ్య సేవలు వంటి రంగాల్లో వినియోగదారులకు సేవలందించటంలో వాటికి వుండే అదనపు పనులను చేసిపెట్టే అవకాశాలను సత్యం సంస్థ విస్తృతంగా దొరకబుచ్చుకుంది. ఎప్పటికప్పుడు ఈ పనులు చేసి పెట్టడంలో నైపుణ్యం సంపాదించి ఐ.టి. రంగంలో అగ్రగామిగా ఎదిగింది. ఆంధ్రప్రదేశ్‌లో ఐ.టి. అంటే సత్యం, సత్యం అంటే ఐ.టిగా పేరు స్థిరపడిపోయింది. తొమ్మిదేళ్లపాటు చంద్రబాబు, ఆ తర్వాత రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వాలు చేసిన రామలింగరాజు భజన కూడా దీనికి ఒక కారణం.

మరోవైపు షేర్ మార్కెట్‌లో కూడా ఎటువంటి అవకాశాలున్నాయో రామలింగరాజు గుర్తించి, తెలివిగా వుపయోగించుకున్నాడు. సత్యం కంపెనీని స్టాక్ మార్కెట్‌లో నమోదు చేయించాడు. లాభాల బాటలో పయనిస్తున్న సత్యం కంపెనీ షేర్లలో వాటాదార్లు పెద్ద యెత్తున మదుపులు పెట్టారు. ఇంకోవైపు రామలింగరాజు అనుబంధ సంస్థలను తెరచి సత్యం చేతకొనిపించాడు. ఈ అనుబంధ సంస్థలన్నీ తన భార్య, కొడుకులు, తమ్ముళ్ళు, మరుదులు, వాళ్ల భార్యలు, పిల్లలు, ఇతర బంధువుల పేర్ల మీద తెరిచినవే. ఇందులో అనేక కంపెనీలు కాగితాల మీద రిజిస్టర్ కావడమేతప్ప, ఆఫీసులు కూడా లేవు. ఇటువంటి కంపెనీలను సత్యంకు వచ్చిన లాభాలతో కొనిపించి, ఆ సొమ్మును, వనరులను తమసొంత వ్యాపారాలకు, సొంత మనుషులకు మళ్లించారు.

ఈ విధంగా ఊరూ పేరూ లేని కంపెనీలను సత్యంచేత కొనిపించడాన్ని సత్యం కంపెనీలో మదుపులు పెట్టిన వాటా దారులు ప్రశ్నించినా, పెద్ద యెత్తున ఆరోపణలు వచ్చినా లెక్క చేయలేదు. 2000 నుంచి ఈ ధోరణి మరింత హద్దూ, అదుపూ లేకుండా సాగింది. 2001లో రామలింగరాజుకు, అతని కుటుంబీకులకు సత్యం కంపెనీలో 22.78 శాతం వాటా వుండేది. అది 2008 చివరకు 8.60 శాతానికి తగ్గించుకున్నారు. ఈ విధంగా తమ వాటాలను షేర్ల కింద అమ్మటం ద్వారా రాజు కుటుంబం రెండు వేల కోట్లు రూపాయలు సంపాదించింది. ఇందులో సగానికిపైగా 2006 మొదటి అర్ధ భాగంలో సంపాదించిందే.

రామలింగరాజు కుటుంబీకులు, బంధువుల పేర్ల మీద తెరిచిన కంపెనీలు చాలా వరకు రియల్ ఎస్టేట్, ఆగ్రో-ఫార్మ్ కంపెనీలు. రామలింగరాజు కొడుకులు (తేజరాజు, (జూనియర్) రామరాజు) నడుపుతున్న కంపెనీలైన మేటాస్ ప్రాపర్టీస్, మేటాస్ ఇన్‌ఫ్రా భూములు కొనిపించటం, కొనడం చేస్తాయి. రాజు కుటుంబ సభ్యుల దగ్గరున్న సత్యం షేర్లను డష్ బ్యాంక్, ఐ.ఎల్.ఎఫ్.ఎస్., డి.ఎస్.పి., మెరిల్‌లించ్ వంటి ఆర్థిక సంస్థల దగ్గర తనఖా పెట్టి, వారు తెరిచిన కంపెనీలకు పెట్టుబడులు సమకూర్చారు. షేర్ల విలువ పడిపోతుంటే, వాటిని ఆ సంస్థలు అమ్ముకుని డబ్బు జమకట్టుకుంటాయి. అంటే సత్యం కుటుంబీకులు అమ్మదలుచుకున్న షేర్లు బ్యాంకుల ద్వారా అమ్మించవచ్చు. బ్యాంకులు, కంపెనీల ప్రమోటర్లు లాలూచీపడి తమ చేతులకు మట్టి అంటకుండా ఇలా షేర్ల వ్యాపారం సాగిస్తారు. ఇదంతా చట్టప్రకారమే జరుగుతుంది.

ఇక రామలింగరాజు తన కుటుంబీకులు తెరిచిన అనేక కంపెనీలను సత్యం కంపెనీ చేత కొనిపించాడు. ఆ విధంగా సత్యం కంపెనీ లాభాలను తమ ఖాతాలకు మళ్లించారు. రాజు కొడుకులు

నడుపుతున్న మేటాస్ (సత్యం ఇంగ్లీషు పేరును తిరగేస్తే మేటాస్) కంపెనీలను కొందామని సత్యం బోర్డు నిర్ణయం తీసుకున్న తర్వాత (డిసెంబర్ 16) సత్యం షేరు విలువ పడిపోవటం ప్రారంభమైంది. మేటాస్ ఇన్‌ఫ్రా కంపెనీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి 35 వేల కోట్ల రూపాయల విలువ చేసే ప్రాజెక్టులను సంపాదించింది. ఇందులో పదకొండు వేల కోట్ల ఖరీదు చేసే మెట్రో రైలు ప్రాజెక్ట్ ముఖ్యమైనది. దీనికి సంబంధించి మేటాస్ ఇన్‌ఫ్రా సామర్థ్యం, కాంట్రాక్టులో జరిగిన అవకతవకలు, రాష్ట్ర ప్రభుత్వానికే అది డబ్బు ఎదురు చెల్లిస్తాననటం మొదలైన వాటిపై పెద్ద దుమారం చెలరేగింది. వీటన్నింటితో ఈ కంపెనీలను సత్యం చేత కొనిపించాలనే నిర్ణయంపై ప్రపంచ వ్యాప్తంగా సత్యం కంపెనీలో మదుపులు పెట్టిన ఇన్వెస్టర్లు తీవ్రంగా ఆగ్రహించి, వ్యతిరేకించారు. దీనితో రామలింగరాజు ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకున్నా, షేర్ల విలువ పతనం ఆగలేదు.

దీనికి విరుగుడుగా మార్కెట్ విలువ కంటే కొంత ఎక్కువ ధరకు షేర్లను కంపెనీ కొంటుందని ప్రకటించడంతో షేర్ విలువ పెరిగింది. లాభాలు కూడా పంచుతారని ఆశపడిన మదుపరులు మళ్లీ సత్యం షేర్లు కొనటం ప్రారంభించారు. ఇదే అదనుగా సత్యం షేర్లను తనఖా పెట్టుకున్న ఆర్థిక సంస్థలు తమదగ్గరున్న 2.5 కోట్ల షేర్లను అమ్మి సొమ్ము చేసుకున్నాయి. ఆ తర్వాత రామలింగరాజు కుంభకోణం జరిగినట్లు 'పశ్చాత్తాపం' ప్రకటించడంతో షేర్ విలువ 25 రూపాయలకు పడిపోయింది. అంటే సత్యం షేర్లు తనఖా పెట్టుకున్న ఆర్థిక సంస్థలు, బ్యాంకులు గాని, కంపెనీలోని ప్రధాన భాగస్వాములుగాని నష్టపోలేదు. కానీ లాభాలు వస్తాయని ఆశకుపోయి ఎక్కువ రేటుకు ఆ షేర్లు కొన్న చిన్న మదుపరులు షేర్లు మళ్లీ అమ్ముడుపోక వేలకోట్లలో నష్టపోయారు. ఈ ఆశ మీదనే, ఇంకా చెప్పాలంటే దురాశ మీదనే మొత్తం స్టాక్ మార్కెట్ మాయ ఆధారపడి వుంది. కంపెనీల యజమానులు, బ్యాంకులు, స్టాక్ మార్కెట్ బ్రోకర్లు కుమ్మక్కయి ఈ విధంగా చిన్న మదుపరులను ముంచుతారు.

ఈ కుంభకోణంలో మరో ముఖ్యమైన అంశమేమంటే, ఏడేళ్లుగా తాను కంపెనీ లెక్కలను 7 వేల 136 కోట్ల రూపాయల మేర తప్పుగా (వున్న అప్పును లేనట్లు, లేని లాభాలను వున్నట్లు) చూపించానని, అందుకు తీవ్రంగా 'పశ్చాత్తాపం' చెందుతున్నానని రామలింగరాజు ప్రకటించాడు. నిజానికి ఈ డబ్బంతా రాజు అకౌంట్లోకి, కుటుంబ సభ్యుల చేతుల్లోకి వెళ్లిందన్నది వాస్తవం. అసలు కొన్ని సంవత్సరాలుగా తప్పుడు లెక్కలు చూపుతుంటే, వీటిని సరిచూడవలసిన ప్రభుత్వ సంస్థలు ఏమి చేస్తున్నట్లు?

ఈ సంస్థల నిబంధనలు, చట్టాల ప్రకారం లెక్కలు సరిగా వుండాలి. ఈ లెక్కలు సరిచూడటానికి కంపెనీ స్వంత ఆడిటింగ్ వ్యవస్థ, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సి.ఎఫ్.ఒ.) కంపెనీ బోర్డులోని స్వతంత్ర డైరెక్టర్లతో కూడిన ఆడిట్ కమిటీ వుంటాయి. ఇవికాక స్వతంత్రంగా కంపెనీ ఇచ్చిన లెక్కలను సరిచూసే బయటి ఆడిటర్ సంస్థ (సత్యం కంపెనీకి సంబంధించి ప్రైస్ వాటర్ హౌస్) కూడా వుంటుంది. ఇది లెక్కలకు సంబంధించి ఖర్చులు, ఆదాయం, బ్యాంకు బ్యాలెన్స్ వంటి వన్నీ సరిచూసి, నిర్ధారించుకుని సంతకం పెట్టాలి. ఈ నియమాలు, చట్టాల ప్రకారం అన్ని సర్టిఫికేట్లను సత్యం యాజమాన్యం సృష్టించింది. రాజు 'గౌరవప్రదమైన' వ్యక్తి కాబట్టి అతడి పలుకుబడిని చూసి వీళ్లెవరూ వాటిని అనుమానించలేదు. చివరకు మదుపరుల డబ్బుతో లక్షల్లో పారితోషికాలు పొందే స్వతంత్ర డైరెక్టర్లు కూడా వీటిని పట్టించుకోలేదు. సత్యం బోర్డులోని తొమ్మిది మంది సభ్యుల్లో ఆరుగురు స్వతంత్ర డైరెక్టర్లు. ఇందులో క్రిష్ణపాలెపు అనే సభ్యుడు కార్పోరేట్ సంస్థల పరిపాలనా విషయాల్లో ప్రపంచంలోనే పెద్ద స్పెషలిస్టు. ఇతడికి ఇచ్చే పారితోషికం సంవత్సరానికి 90 లక్షలు. కంపెనీ ఇచ్చే కోట్ల రూపాయల తాయిలాలు పుచ్చుకుని రాజు తానా అంటే వీరు తందాన అన్నారు. ఇదీ వీరి స్వతంత్రత. కుంభకోణం బయటపడేసరికి వీరు డైరెక్టర్ల బోర్డుకు రాజీనామా చేశారు. ఇవన్నీ తెలియని, తెలుసుకుందామన్నా అవకాశం లేని మదుపరులు పైసా పైసా కూడబెట్టుకున్న సొమ్మును రాజు 'పశ్చాత్తాపం' ప్రకటించేదాక కంపెనీ షేర్లలో పెడుతూనే వున్నారు. చివరకు 'గౌరవ ప్రదమైన' సత్యం రామలింగరాజు మోసానికి బలయ్యారు.

వేల కోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడి లెక్కలు తారుమారుచేసి, కంపెనీలో సొమ్ము మదుపు పెట్టిన వేలాది మంది వాటాదారులను మోసం చేసిన రాజుపట్ల ప్రభుత్వం, పోలీసులు తీసుకుంటున్న చర్యలు విస్మయం కలిగిస్తాయి. తనకు తాను తప్పు ఒప్పుకున్నాక కూడా అరెస్టు చేయటంలో ఆలస్యం చేశారు. వాటాలు కొన్న చిన్న చిన్న వాటాదార్లు పెట్టిన కేసులను చెత్తబుట్టలో పడేశారు. రెండు రోజుల తర్వాత నింపాదిగా రామలింగరాజు డి.జి.పి. ఆఫీసుకు వచ్చి తనకు తాను లొంగిపోతే, తాము అరెస్టు చేసినట్లు పోలీసులు ప్రకటించుకుంటున్నారు. ఈ తప్పు ఒప్పుకోవటం, లొంగిపోవటం అంతా ఒక పథకం ప్రకారమే జరిగింది. ఈ గూడుపుఠాణీలోని రామారాజును, సి.ఎఫ్.ఒ. శ్రీనివాస్‌ను, రాజు ఇంకో తమ్ముడు సూర్యనారాయణను అరెస్టు చేయటం, రాజు కుటుంబ సభ్యుల, బంధువుల ఇళ్లను సోదా చేయటం, వారిని ప్రశ్నించటం, అరెస్టు చేసిన వారికి జైల్లో రాజ లాంఛనాలు కల్పించటం లాంటివన్నీ చూస్తుంటే పెద్ద శిక్షలేమీ లేకుండానే వీళ్లు

బయటపడతారనేది స్పష్టమవుతున్నది. ఎందుకంటే రాజుకీ, గత ముఖ్యమంత్రికీ, ప్రస్తుత ముఖ్యమంత్రికి వున్న సంబంధ బాంధవ్యాలు జగమెరిగిన సత్యం.

అదే చిన్న చిన్న నేరాలు చేసేవాళ్లను, హక్కులు, సమస్యల పరిష్కారం కోసం పోరాడే ప్రజలను, వేలాది మంది విప్లవసానుభూతిపరులను ప్రభుత్వం, పోలీసులు తప్పుడు కేసుల్లో ఇరికించి, చిత్రహింసలు పెట్టి, వెంటాడి, వేధిస్తారు. కానీ వేల కోట్ల కుంభకోణానికి పాల్పడిన రామలింగరాజు పట్ల 'ఏదో పోనీలే చిన్న తప్పు చేశాడు' అన్న ధోరణిలో వ్యవహరిస్తున్నారు. అంతా మర్యాదపూర్వకంగా విచారణ తంతు జరుగుతున్నది. రాజును బయటపడేయడానికి అధికార యంత్రాంగం, రాజకీయ నాయకులు యధాశక్తి పాటుపడుతున్నారు. ఎందుకంటే, రాజు నోరు విప్పి ఏయే పార్టీలకు ఎంతెంత డబ్బిచ్చాడో చెబితే చాలా మంది ఇరుక్కుంటారు. ఇక మూతపడే స్థితిలో వున్న సత్యం కంపెనీని నిలబెట్టడానికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించి, కొత్త బోర్డును నియమించింది. కానీ భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారైన వేలాది ఉద్యోగుల జీతాలు చెల్లించడానికి, షేర్లు కొని నష్టపోయిన మదుపరులకు ఎటువంటి సహాయం చేయటం లేదు. దేశానికి అన్నం పెట్టే రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే ఆదుకునేందుకు సిద్ధంకాని ప్రభుత్వాలు కార్పొరేట్ యజమానులను, పెట్టుబడిదారులను ఆదుకోవడానికి పరుగులు పెడుతున్నాయి.

**దొంగ చెపుతున్నదే నిజమా?**

రాజు 'పశ్చాత్తాప ప్రకటన'లో మొత్తం తను చేసిన మోసం విలువ 7 వేల 136 కోట్ల రూపాయలని చెప్పాడు. పథకం ప్రకారం కుంభకోణం చేయడమేకాదు, తను చెప్పిన సంఖ్య చుట్టూనే అందరి ఆలోచనలను తిప్పుతున్నాడు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశోధనా సంస్థలు, పోలీసులు, మదుపరులు, జర్నలిస్టులు, అందరూ ఆ 7 వేల 136 కోట్ల రూపాయల చుట్టూతానే ఆలోచిస్తున్నారు. విచారణ జరపవలసింది, నిజాలు బయటపెట్టవలసింది ప్రభుత్వం. అసలు ఇంకెంత మొత్తం కుంభకోణం జరిగిందనేది విచారణ జరపకుండా ప్రభుత్వం, రాజకీయ నాయకులు అధికారులు కావాలనీ దొంగ చెప్పిందే నిజమని ప్రపంచాన్ని నమ్మించజూస్తున్నట్లు కన్పిస్తున్నది.

అంతేగాక రాజు 'పశ్చాత్తాపం' ప్రకటించాడని, తప్పు ఒప్పుకున్నందుకు మెచ్చుకోళ్లు, తప్పుకాయాలనే వాదనలు అనేక మంది చేస్తున్నారు. ఇటువంటి అడ్డదారుల్లో ప్రజల సొమ్ము దోచుకోవడానికి అలవాటుపడ్డవాళ్లు, దాన్ని సమర్థించే వాళ్లే ఈ వాదనలు చేసేది. రాజు ఒప్పుకున్నది మాత్రమేకాదు, ఇంకా నిగ్గుతేల్చాల్సిన నిజాలు చాలానే వున్నాయి. తాము పెట్టిన కంపెనీలో నుంచే వాటాలు ఎందుకు తగ్గించుకున్నదీ, అలా తగ్గించుకుని సంపాదించిన రెండు వేల కోట్ల రూపాయలతో ఏమి చేసిందీ, లెక్కకు మించిన కంపెనీలకు ఎందుకు తెరిచినదీ, వాటిలో రాజకీయ నాయకులకు వాటాలెందుకు వున్నదీ, మేటాస్ కంపెనీల్లో, అవి చేపట్టిన ప్రాజెక్టుల్లో ఏ రాజకీయ నాయకులకు ఎంతెంత వాటాలున్నదీ, గత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డికి ఎన్ని కోట్ల ముడుపులు ముట్టజెప్పిందీ మొదలైన విషయాలన్నీ బయటికి రావలసి వుంది. మేటాస్ కంపెనీలు చేపట్టిన 35 వేల కోట్ల విలువ చేసే రాష్ట్ర ప్రభుత్వ ప్రాజెక్టుల్లో 10 శాతం అంటే 3 వేల 500 కోట్లు రాజకీయ నాయకులకు ముడుపులు అందవలసినవే. అంతా సాఫీగా జరిగి వుంటే ఎన్ని వేల కోట్ల ప్రజాధనం కైంకర్యం జరిగేదో ఊహకందని విషయం.

సత్యం కంపెనీని అడ్డం పెట్టుకుని రాజు కుటుంబం సంపాదించిన వేలాది కోట్ల రూపాలను రియల్ ఎస్టేట్ రంగానికి పెరుగుతున్న డిమాండును గుర్తించి, అందులోకి మళ్లించారు. భూ బకాసురుడు ఆకుల రాజయ్య వేలాది ఎకరాల భూములు మింగటం రామలింగరాజు కోసమేననేది తెలుస్తున్నది. నాలుగేళ్లలో ఎక్కడ చూసినా రాజు కుటుంబ పరివారం తెరిచిన కంపెనీల భూములు, ప్రాజెక్టులే దర్శనమిస్తున్నాయి. కంపెనీ పేరు మీద పాస్ పోర్టులు సృష్టించి మనుషులను విదేశాలకు తరలించే దందా కూడా నడిచిందనేది లెక్కకు మించి దొరికిన పాసుపోర్టులను బట్టి తెలుస్తున్నది. ఆర్థిక సంక్షోభంలో భాగంగా రియల్ ఎస్టేట్ బూమ్ పడిపోవటంతో భూములపై పెట్టిన డబ్బంతా అక్కడే ఇరుక్కుపోయింది. పర్యవసానంగా కుంభకోణం బయటపడే పరిస్థితులు తలెత్తాయి. బయటపడింది కాబట్టి ఇది కుంభకోణం. బయటపడకుండా ఎన్నెన్ని కార్పొరేట్ మోసాలు, కుంభకోణాలు జరుగుతున్నాయో సామాన్య ప్రజలకు తెలిసే అవకాశమేదీ?

'స్వాతంత్ర్యం' వచ్చిన ఈ అరవై ఏళ్లలో భారతదేశంలో

**పత్రికపై మీ విమర్శలూ, అభిప్రాయాలూ, సలహాలూ, సూచనలను ఎప్పటికప్పుడు తెలియజేయండి. అది పత్రిక అభివృద్ధికి దోహదపడుతుందని గుర్తించండి!**

ఇటువంటి కుంభకోణాలకు కొదవేమీ లేదు. ప్రారంభంలో కృష్ణమీనన్ జీపుల కుంభకోణం దగ్గర నుంచి ఎన్నెన్నో కుంభకోణాలు బద్దలయ్యాయి. భోఫోర్స్ కుంభకోణం సంచలనం కలిగించింది. ప్రభుత్వాలనే మార్చేసింది. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఈ రోజు వరకూ భోఫోర్స్ దొంగల్ని పట్టలేకపోయారు. అందుకే 'భోఫోర్స్ ఫార్స్'గా మిగిలిపోయింది. ఆ తర్వాత హర్షద్ మోహతా కుంభకోణం, హవాలా కుంభకోణం, ఎరువులు, టెలిఫోన్ల కుంభకోణం, దాణా కుంభకోణం, బాండు పేపర్ల కుంభకోణం, పార్లమెంటులో ప్రశ్నలు లేవనెత్తడానికి ముడుపుల కుంభకోణం, పాస్ పోర్టుల కుంభకోణం, వగైరా వగైరా. చెప్పుకుంటూ పోతే చాంతాడంత చిట్టా అవుతుంది. ఇన్నిన్ని కుంభకోణాల్లో ఏ ఒక్క దాంట్లో కూడా అసలు దోషులు బయటపడలేదు. పాలకులు బయటపడనివ్వరు. వీటన్నిటినీ మించింది నేటి సత్యం కుంభకోణం.

కార్పోరేట్ ప్రపంచం, స్టాక్ మార్కెట్లు ఎన్నెన్ని అక్రమాలు చెయ్యగలవో, ఎన్నెన్ని తప్పుడు మార్గాల్లో ప్రజల ధనాన్ని ఎలా తినెయ్యగలవో రామలింగరాజు చేసి చూపించాడు. అభివృద్ధికి సంబంధించిన గణాంకాలు కేవలం ఊహాజనితమైనవేనని, అవి కార్పోరేట్ సంస్థల కల్పనా శక్తికి తార్కాణమని రుజువు చేశాడు. చట్టాలలోని లొసుగులను, కాసుకు లొంగే అధికారాన్ని ఆసరా చేసుకుని ఒకచోట వున్న సంపదను లేదని నమ్మించి, అంకెల గారడీ మాత్రమేనని చెప్పి, మొత్తం సంపదను ఎలా మింగేయవచ్చో కూడా చేసి చూపించాడు. స్టాక్ మార్కెట్ వెలుగులు ఆర్థిక ప్రగతికి చిహ్నమని భ్రమించే వాళ్ల ఇప్పటికైనా కళ్లు తెరిస్తే మంచిది.

ఈ అక్రమాలన్నీ సత్యం రామలింగరాజు ఒక్కడే చేశాడనటం కూడా పూర్తిగా నిజంకాదు. అతనికి ఎక్కువ బాధ్యత వుండవచ్చుగానీ, పెట్టుబడిదారీ ఆర్థిక విధానంలోనే ఇటువంటి అక్రమాలకు, మోసాలకు పునాదులున్నాయి. పెట్టుబడిదారీ ఆస్తి పోగుపడటమే ఇటువంటి మోసాలతో జరుగుతుంది. లక్షల కోట్లకు పడగలెత్తిన టాటా, బిర్లాల నుంచి ఇటీవల అంబానీల మీదుగా, ఎల్.పి.జి. విధానాల పుణ్యమా అని పాలకుల మితిమీరిన ప్రోత్సాహంతో పరుగులు తీస్తున్న నేటి ఐ.టి., రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థల కార్పోరేట్ నిర్వాహకుల దాకా మోసం చేయకుండా బడా పెట్టుబడిదారులుగా ఎదిగిన వారెవరూ లేరు. ఈ వ్యవస్థ, పాలక విధానాలు ఇందుకు అనుకూలమైనవే. మోసాలకు పాల్పడకపోయినా, ఈ అనుకూలతల వల్లనే పెద్ద మొత్తంలో ప్రజా ధనం కాజేసే అవకాశం వుంది. ప్రయివేట్ రంగానికి ప్రోత్సాహం, దశాబ్దాల తరబడి పన్ను రాయితీలు, వందల వేల ఎకరాల భూములు దారాదత్తం చేయడం, ప్రత్యేక ఆర్థిక మండళ్ల పేరుతో ప్రజలను నిర్వాసితులను చేసి లక్షల ఎకరాల వ్యవసాయ భూములను కార్పోరేట్ సంస్థలకు అప్పగించటం ఇవన్నీ వీరికి అనుకూలతలే. ఇక కార్పోరేట్, బడా వ్యాపార సంస్థల నిర్వాహకులు చట్టనిబంధనలను ఉల్లంఘించ దలుచుకుంటే, చట్టబద్ధ నిఘా, పర్యవేక్షక సంస్థల కళ్లు కప్పదలుచుకుంటే, లంచాలు పెట్టి తమ ఇష్టారాజ్యంగా పనులు నడిపించుకునే రాజమార్గాలు వుండనే వున్నాయి. సత్యం కంప్యూటర్స్ ఇవన్నీ చేసింది. వందల వేల కోట్ల రూపాయల లాభాలు సంపాదిస్తూ పన్నుల మినహాయింపుల వల్ల ప్రభుత్వ ఖజానాకు ఒక్క పైసా చెల్లించకుండానే, ప్రజల వనరులను దుర్వినియోగం చేసే అవకాశం సత్యం కంప్యూటర్స్ వంటి అనేకానేక సంస్థలకు అందజేసి, అందుకు ప్రతిగా వందల కోట్ల రూపాయలు ముడుపులుగా మింగిన ఘన చరిత్ర ప్రభుత్వాధినేతలది. అంటే ఇవ్వాళ సత్యం కుంభకోణంగా బయటపడింది ఈ వ్యవస్థ కుంభకోణమే. దాని పాలనా విధానాల, రాజకీయార్థిక విధానాల కుంభకోణమే.

లాభాల వేటనే పరమావధిగా కొనసాగే దోపిడి వ్యవస్థలోని రుగ్మతలివి. ఎటువంటి రుగ్మతలు లేని నిజమైన ప్రజారాజ్యాధికార వ్యవస్థ స్థాపన జరిగే వరకు సత్యం కుంభకోణాల వంటివి ప్రతి రోజూ, ప్రతిక్షణమూ జరుగుతూనే వుంటాయి. అటువంటి వందలాది కుంభకోణాలలోంచి ఎప్పుడో ఒకసారి సత్యం కుంభకోణం వంటి ఉదంతాలు బయటపడుతుంటాయి. ఈ రోజు దర్పం వెలగబెడుతున్న ఇన్ఫోసిస్, విప్రో, ఇంకా అనేక బడా బడా కార్పోరేట్ సంస్థల బండారం కూడా ఇలాగే బట్టబయలైనా ఆశ్చర్యం లేదు. లేక అటువంటి స్థితిలో వున్న అనేక సంస్థలు సత్యంను చూసి, బయటపడకుండా మరింత పకడ్బందీ మార్గాలు వెతుక్కోనూవచ్చు. అలా బయటపడినప్పుడు మాత్రం హాహాకారాలు చేసి, ఏవో పైపై ఉపశమన చర్యలు మాత్రం తీసుకుని నిరంతరం జరిగే, జరుగుతున్న కుంభకోణాలను, అసలైన అక్రమాలను కొనసాగనివ్వటం దోపిడి పాలకవర్గాల సహజ లక్షణం. అంతేకాదు, వీటివైపు దృష్టి మరల్చకుండ ప్రజలను జోకొట్టడానికి పాలకులు ప్రయత్నిస్తున్నారు. పాలకవర్గాల ఈ ప్రయత్నాలను వమ్ముచేసి, ప్రజాధనాన్ని మింగేస్తున్న దొంగలను శిక్షించేందుకు ప్రజలు నడుం బిగించాలి. కుంభకోణాలు, దోపిడీ, పీడనలు లేని ఉన్నతమైన సోషలిస్టు వ్యవస్థ స్థాపన కోసం జరుగుతున్న భారత నూతన ప్రజాస్వామిక విప్లవ యుద్ధంలో ప్రజలు సంఘటితం కావాలి.

★

**అవినీతికి మూలమైన దోపిడీ వ్యవస్థను కూలగొట్టడం ద్వారానే అవినీతిని రూపుమాపగలం**

# భారతదేశంలోను, ప్రపంచవ్యాప్తంగాను తీవ్రమవుతున్న ఆహార సంక్షోభం

పెద్ద ఎత్తున పెరుగుతున్న ఆహార సంక్షోభం వల్ల కరువు వ్యాపిస్తోంది. ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాల్లో (వెనకబడిన దేశాల్లో) 100 కోట్ల ప్రజానీకం కరువు పీడితులవుతున్నారు. గత మూడు సంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా ఆహార ధరలు 80 శాతానికి పైగా పెరిగాయి. ఆసియా దేశాల్లో బియ్యం ధరల పెరుగుదల ప్రమాద ఘంటికలు మోగిస్తున్నది. ఆహార సంక్షోభాన్ని అర్థం చేసుకొనేందుకు దీర్ఘకాలిక, స్వల్పకాలిక ఆహార సంక్షోభాలను గురించి పరిశీలిద్దాం. ప్రపంచం మీద ఇంతకాలం ప్రజలందరూ ఏ ఆహార సంక్షోభానికి గురికాకుండా ఉన్నారనీ, ఇప్పటి ఆహార సంక్షోభం అకస్మాత్తుగా, తాత్కాలికంగా తలెత్తిందనేది వాస్తవం కాదు. ఆకలితో అలమటిస్తున్న పదులకోట్ల ప్రజలు పాక్షికంగా, నిర్దిష్టంగా నిరంతరం ఆహార కొరతకు గురవుతుండటానికీ, ఈ మధ్య కాలంలో ఇంతకు ముందెన్నడూ లేనంతగా ప్రపంచ వ్యాప్తంగా ఆహారం కొరత ఏర్పడటానికి మధ్య గల సంబంధాన్ని ఈ దృష్టితో సరిగా అర్థం చేసుకోవాలి. ప్రపంచంలో ముఖ్యంగా వెనబడిన దేశాల్లో బతకడానికి అవసరమైన ఆహార కొరత తీవ్రం కావటం అనేదే ముఖ్యమైన సమస్యగా వుంది. ఇది అంతర్జాతీయ పెట్టుబడిదారీ వ్యవస్థకు సంబంధించిన సామాజిక, ఆర్థిక సమస్య. ఐక్యరాజ్య సమితి అధ్యయనం ప్రకారం 600 కోట్ల ప్రపంచ జనాభాలో 300 కోట్ల మంది ఆకలితో అలమటిస్తున్నారు. అంతేగాక, కోట్లాది ప్రజలు పోషకాహార లోపంతో వ్యాధుల బారినపడుతున్నారు. తీవ్ర అసమానతలు, దోపిడి కొనసాగుతున్న ప్రపంచంలో ప్రతిరోజు వేలాది మంది పిల్లలు (ఐక్యరాజ్యసమితి అంచనా ప్రకారం 18,000) పోషకాహార లోపంతో చనిపోతున్నారు.

ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలోని అవలక్షణాలు, సామ్రాజ్యవాద దోపిడి, అర్ధ భూస్వామ్య సంబంధాలు, వెనకబడిన ఉత్పత్తి విధానం కొనసాగింపు వల్ల ప్రపంచ జనాభాలో సగానికి పైగా ఆహార అభద్రతతో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రస్తుత ప్రపంచ ఆహారోత్పత్తి ప్రజల వినియోగానికి సరిపోక ప్రజలు సాధారణంగా ఆహార కొరతకు గురవుతున్నారనేది వాస్తవం కాదు. అమెరికా వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం, 2006 నుండి 3 కోట్ల 50 లక్షల మంది అమెరికా ప్రజలు ఆహార అభద్రతతో కొట్టుమిట్టాడుతున్నారు. అమెరికాలో ఒక కోటి 20 లక్షల మంది పౌరులు సమతులాహార కొరతను ఎదుర్కొంటున్నారు. 70 లక్షల మందికి రోజుకు రెండు పూటల భోజనం లభించటంలేదు. ఇది ఆహార సరఫరా తగ్గుదల వల్ల వచ్చిన సమస్య కాదనేది, ప్రజలకు ఆహారం కొనగలిగిన ఆర్థిక స్థోమత లేనందువల్ల, వేలాది టన్నుల పంట వృధా చేయటంతో పడుతున్న భారం వల్ల వచ్చిన సమస్య అనేది కాదనలేని వాస్తవం. ప్రపంచ ఆహార నిల్వలు తరిగిపోవటం, ఆహార ధాన్యాలు పండే భూములను జీవ ఇంధనాల ఉత్పత్తికి వినియోగించటం, వెనకబడిన దేశాల్లో మౌలిక వసతులు, పారిశ్రామిక వినియోగం కోసం వ్యవసాయ భూముల్ని పెద్దఎత్తున విధ్వంసం చేయటం, ఆహార ధాన్యాలపై పెద్ద ఎత్తున సట్టా వ్యాపారం సాగించటం మొదలైన వాటి ఫలితంగా ప్రపంచ ఆహార ధాన్యాల ధరలు పెరిగిపోవటం అనేది ఈ రోజు ప్రధాన సమస్యగా ముందుకొచ్చింది. కనీస ఆర్థిక దృష్టితో చూసినా కూడా ధరలు స్థిరంగా వుండాలంటే డిమాండ్, సప్లైల మధ్య సమతుల్యత వుండాలి. ప్రపంచ ఆహార సంక్షోభం భీతిగొలిపే స్థాయిలో ఉన్నప్పటికీ, ఇటీవలి కాలంలో ఈ పరిస్థితిలో పెద్ద మార్పేమీ లేదు.

గత 50 సంవత్సరాలలో ప్రపంచ మార్కెట్‌లోని గోధుమ ధరలను పరిశీలించినట్లయితే, 1960లలో ప్రపంచ గోధుమ ధరలు కొంత వరకు స్థిరంగా వున్నప్పటికీ, 1972-74లలో ధరలు పెద్ద ఎత్తున పెరిగి సంక్షోభానికి దారితీసింది. 1998-2005 మధ్య ధరల పెరుగుదల కొంత తక్కువగా వుండి, ఆ తర్వాత ధరల పెరుగుదల స్థిరంగా కొనసాగింది. ప్రపంచంలోని ప్రధాన దేశాల్లో గోధుమ నిల్వలు పడిపోవటంతోపాటు ధరల పెరుగుదల తారా స్థాయికి చేరింది. ఇటీవలి కాలంలో అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాల్లో తృణ ధాన్యాల ఉత్పత్తి 16 శాతం వరకు, ఆస్ట్రేలియాలో 33 శాతం వరకు తగ్గింది. ఐక్యరాజ్య సమితికి చెందిన ఎఫ్.ఎ.ఒ. (ఆహార వ్యవసాయ సంస్థ) లెక్కల ప్రకారం 2007లో ఆస్ట్రేలియాలో గోధుమ ఉత్పత్తి తీవ్రస్థాయిలో అంటే 52 శాతం తగ్గింది.

దీర్ఘకాలిక ఆహార అభద్రతకుగల మౌలికమైన కారణాలను పరిశీలిద్దాం. అవి: 1. ఆహార ధాన్యాల వ్యాపారం లాభదాయకమైన వ్యాపారంగా మారింది 2. అసమాన ఆహార పంపిణీ వ్యవస్థ 3. వ్యవసాయరంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురికావటం 4. వ్యవసాయ వ్యాపారం కొరకు కార్పోరేట్ సంస్థల వ్యవసాయ రంగ ప్రవేశం 5. ప్రపంచీకరణ నేపథ్యంలో కొద్దిపాటి ధనిక, నూతన ధనిక సెక్షన్‌కు మార్కెట్లు అనుకూలంగా మారటం 6. వ్యవసాయంలో పెరిగిన జీవయాంత్రిక సాంకేతిక పరిజ్ఞానం, పారిశ్రామికీకరణలు పేదలకు

అన్నం పెట్టే రైతాంగాన్ని ఒక పద్ధతి ప్రకారం వ్యవసాయనికి దూరం చేయటం 7. మూడవ ప్రపంచ దేశాల ప్రభుత్వాల వ్యవసాయ ఎగుమతి విధానాలు 8. మూడవ ప్రపంచ దేశాల్లో భూసంస్కరణలు అమలు చేయకపోవటం, వ్యవసాయంలో భూస్వామ్య, పెట్టుబడిదారీ 'అభివృద్ధి' కార్యక్రమం పెరిగిపోవటం 9. అమెరికా ఆధిపత్యాన్ని నిలబెట్టడానికి ప్రకృతి వనరులను అమెరికా గుప్పిట్లో వుంచేవిధంగా ఐ.ఎం.ఎఫ్., ప్రపంచ బ్యాంకులు మూడవ ప్రపంచ దేశాల ప్రభుత్వాలతో సామ్రాజ్యవాద ప్రాజెక్టులను అమలుచేయించటం, ప్రపంచ వ్యాప్తంగా మైనారిటీ తరగతులను లూటీ చేయటం. ఈ కారణాల వల్ల దీర్ఘకాలిక ఆహార అభద్రత వెనుకబడిన దేశాల ప్రజానీకాన్ని పట్టి పీడిస్తున్నది.

రెండవ ప్రపంచ యుద్ధానంతర కాలంలో మొట్ట మొదటిసారిగా 1972-73లో ఆహార ధరల స్థిరత్వం దెబ్బతిని, 1974 నాటి ప్రపంచ ఆహార సంక్షోభంలో ఆహార ధాన్యాల, నూనె గింజల ధరలు మూడురెట్లు పెరిగాయి. వ్యవసాయంలోని యాంత్రీకరణ (పెట్రో ఫార్మింగ్) వల్ల ఏర్పడిన దేశీయ ఆహార నిల్వలను అమ్ముకోవటంలో అమెరికా, యూరోపియన్ యూనియన్‌ల మధ్య పెరిగిన మార్కెట్ పోటీని తీవ్రం కాకుండా చేయడానికి ఉరుగ్వేలో జరిగిన గాట్ (జి.ఎ.టి.టి.) సమావేశాల ద్వారా తగ్గింపు ధరల అమ్మకాలు, సంస్థాగత అసమాన ఆహార వాణిజ్య సంబంధాలకు బదులు 'మానవతా' ఆహార 'సహాయం' అనే ద్వంద్వ విధానంతో అమెరికా తన వ్యాపారాత్మక, సామ్రాజ్యవాద పద్ధతులను మార్చేసింది. ఆవిధంగా ఆహార భద్రత పిలుపు ఆహార మార్కెట్ల వ్యాపార కార్యక్రమంతో సమానమైపోయింది. ఈ ఆహార మార్కెట్ల వ్యాపార వ్యవహారాన్ని ప్రపంచ మార్కెట్‌లో పాల్గొనటం అంటూ పెద్దయెత్తున ప్రచారం కల్పించి ప్రోత్సహించారు. మరొక మాటలో చెప్పాలంటే ఇది సామ్రాజ్యవాద ప్రపంచీకరణ కార్యక్రమమే. 1980 'అభివృద్ధి' కార్యక్రమంలో ఇది ఉచ్ఛ దశకు చేరింది.

ఐ.ఎం.ఎఫ్/ప్రపంచబ్యాంకు ముందుకు తెచ్చిన నిర్మాణాత్మక సర్దుబాటు కార్యక్రమం మూడవ ప్రపంచ దేశాల ప్రభుత్వాలు తమ వనరులను, మార్కెట్లను సామ్రాజ్యవాదులకు ధారాదత్తం చేసేందుకు దారి తీసింది. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ ఎగుమతులు, పండ్ల ఎగుమతి పెరిగింది. కూరగాయలు పండించటం, సముద్ర ఆహారోత్పత్తులలో జీవయాంత్రిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించటం ద్వారా వాటిపై భారం పెరిగింది. వుత్పాదకాల సరఫరా, వరిపండే భూములను ఇతర వాణిజ్య పంటలకు ఉపయోగించటంలో పెద్దయెత్తున బహుళజాతి సంస్థల ప్రవేశం పెరిగి, ఆ భూములు విధ్వంసానికి గురయ్యాయి. ఆహార సమస్యకు కార్పోరేట్ సంస్థలు చూపించిన పరిష్కారం ఇటువంటి వినాశనానికి దారితీసి, ఐ.ఎం.ఎఫ్, ప్రపంచబ్యాంకుల నిర్మాణాత్మక సర్దుబాటు కార్యక్రమ పర్యవసానంగా ప్రస్తుత ఆహార సంక్షోభం దాపురించింది. 1995 డబ్ల్యు.టి.ఒ. ఒప్పందం 'ఒడిదుడుకులు లేని ప్రపంచ మార్కెట్ నిర్వహణ ద్వారా' ఉత్పత్తిదారులకు సబ్సిడీలులేని, పన్నుల రక్షణలేని ఎగుమతి ప్రధాన వ్యవసాయాన్ని నిర్దేశించింది. దీని ఫలితంగా వ్యవసాయ నిత్యావసర సరుకుల ధరలు 30 శాతం పడిపోయాయి. వ్యవసాయం బలవంతంగా కార్పోరేటీకరించబడింది. ధనిక దేశాలు ఎగుమతుల ద్వారా ఆహార నిల్వల్ని వెనకబడిన దేశాల్లో గుమ్మరించటం పెరిగింది. రైతులు భూమిలేని వారుగా, నిర్వాసితులుగా మారటం పెరిగింది. రోమ్‌లో 2008 జూన్ 3 నుండి 5 వరకు ఎఫ్.ఎ.ఒ. ఆధ్వర్యంలో జరిగిన మూడు రోజుల శిఖరాగ్ర మహాసభ అభివృద్ధి చెందిన దేశాల్లో జన్యు మార్పిడి విత్తన బ్యాంకులను ఏర్పాటు చేయటం, బహుళజాతి సంస్థలకు, భూస్వాములకు లాభాలు చేకూర్చి, చిన్న, మధ్యతరగతి రైతుల్ని నాశనం చేసే విధానాల ద్వారా రెండవ హరిత విప్లవం తీసుకురావాలని వాగ్దానం చేసింది. ఆ విధంగా ఆహార హక్కు మీద లాభాల హక్కు బలవంతంగా పై చేయి సాధించింది.

ఒక విషయాన్ని దృష్టిలో వుంచుకోవలసిందేమంటే, భారతదేశంలో కాంగ్రెస్ నాయకత్వంలోని ప్రభుత్వంగాని, బి.జె.పి. నాయకత్వంలోని ప్రభుత్వంగాని లేదా సి.పి.ఐ.(ఎం) మద్దతు కలిగిన కాంగ్రెస్ ప్రభుత్వంగాని, అన్నీ కూడా నిర్మాణాత్మక సర్దుబాటు కార్యక్రమానికి కట్టుబడినవే. పశ్చిమ బెంగాల్ సి.పి.ఐ.(ఎం) నాయకత్వంలోని వామపక్ష కూటమి ప్రభుత్వం రైతుల్ని నాశనం చేసి, కార్పోరేట్ సంస్థలకు దోచిపెట్టే నూతన భూ విధానాన్ని ఇప్పటికే ముందుకు తీసుకొచ్చింది.

ప్రయివేట్ కార్పోరేట్ సంస్థలు ఆహార ధాన్యాల సేకరణ, నిల్వ, మార్కెటింగ్, కాంట్రాక్ట్ వ్యవసాయాలను చాలా వరకు గుప్పిట్లో పెట్టుకున్నాయి. అమెరికా-భారత వ్యవసాయ పరిజ్ఞాన ప్రోత్సాహక కార్యక్రమంలో మోన్‌శాంటో, వాల్‌మార్ట్ సంస్థల ప్రతినిధులు బోర్డు సభ్యులుగా వున్నారు. ఇది వ్యవసాయ పరిశోధనా వ్యవస్థ, వ్యవసాయ మార్కెట్‌లో ఉత్పాదకాలపై బహుళజాతి సంస్థలకు విస్తృతమైన ఆధిపత్యాన్ని కట్టబెట్టడం అనే ప్రత్యామ్నాయం ద్వారా భారత వ్యవసాయాన్ని విదేశీ, స్వదేశీ కార్పోరేట్ సంస్థల వ్యవసాయ వాణిజ్య రంగంగా మార్చటానికి దూకుడుగా ప్రయత్నిస్తోంది.

ఆహార ధరల పెరుగుదల అనేక ఆఫ్రికా, కరీబియన్ దేశాల్లో ఆహార ఘర్షణలకు దారితీస్తోంది. ఇటువంటి ఆహార ఘర్షణలు ప్రధానంగా సోమాలియా, హైతీ దేశాల్లో జరుగుతున్నాయి. ఆహార ధరలు పెరుగుదలకు వ్యతిరేకంగా మే 31న కెన్యాలో పెద్దఎత్తున జరిగిన ప్రజా ప్రదర్శనపై పోలీసులు విరుచుకుపడి ప్రదర్శనకారులపై

లాఠీ ఛార్జీ చేశారు. ఆఫ్రికాలో కెన్యా ఆర్థిక వ్యవస్థ చాలా బలహీనమైనది. 2008 మార్చి నుండి మే వరకు ద్రవ్యోల్బణం 21.8 శాతం నుండి 26.6 శాతానికి పెరిగింది. ప్రపంచ జనాభాలో సగం తీవ్ర ఆహార కొరత, ద్రవోల్బణాన్ని ఎదుర్కొంటుండగా, బహుళజాతి సంస్థలు వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారంలో పెద్ద ఎత్తున సట్టా వ్యాపారానికి పాల్పడి ఆకస్మిక లాభాలు దండుకునేందుకు తయారయ్యాయి. ప్రపంచ సోషలిస్టు వెబ్‌సైట్ కథనం ప్రకారం ఆర్గర్ డేనియల్స్ మిడ్‌ల్యాండ్స్ అనే బహుళజాతి సంస్థ వ్యవసాయ వ్యాపారంలో అపరిమితమైన లాభాలు సంపాదించింది. దాని ప్రధాన నిర్వహణాధికారి అంతర్జాతీయ మార్కెట్‌లోని అస్థిరత వల్ల ఇంత పెద్ద ఎత్తున లాభాలు సంపాదించగలిగామని చెప్పాడు. వ్యవసాయ వ్యాపారంలోని బహుళజాతి సంస్థలన్నీ ఇటువంటి అపరిమిత లాభాలు దండుకునే అవకాశంపై కన్నేసి వుంచుతున్నాయి. ఐక్యరాజ్యసమితి ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఒ.) అధిపతి అయిన సెనెగల్‌కు చెందిన జాక్వెస్ డియోఫ్ 2008 జూన్ 3న జరిగిన దాని శిఖరాగ్ర సమావేశంలో మాట్లాడుతూ ధనిక దేశాలు సబ్సిడీలకు, మితిమీరిన వృధా తిండికి, ఆయుధాలకు వందల కోట్ల డాలర్ల సొమ్ము వెచ్చిస్తున్నాయని అన్నాడు. ఆకాశన్నంటే ఆహార ధరలు కోట్లాది ప్రజానీకాన్ని ఘోరమైన ఆకలి మంటల్లోకి నెడుతున్నాయని ప్రపంచబ్యాంకు, ఇంకా అలాంటి సంస్థలు అంచనా వేశాయి. 85 కోట్ల ప్రజలు బతకడానికి కావలసిన తిండి కూడా లేని స్థితిలో ఆకలికి అలమటిస్తున్నారు. గత రెండు సంవత్సరాలుగా ప్రధాన నిత్యావసర సరుకుల ధరలు రెండింతలయ్యాయి. బియ్యం, మొక్కజొన్న, గోధుమ ధరలు రికార్డు స్థాయికి పెరిగాయి. సగటు ప్రపంచ ఆహార ధరలు ప్రస్తుత గరిష్ట స్థాయి నుండి కిందికి దిగుతాయని, కాని రానున్న దశాబ్దంలో అంతకు ముందటి 10 సంవత్సరాలకంటే ధరలు 50 శాతం ఎక్కువవుతాయని 2008 జూన్ 3న ఒ.ఇ.సి.డి. పారిస్‌లో ప్రకటించింది. అమెరికా, బ్రెజిల్ దేశాలు చెరకు నుండి ఇథనాల్ ఉత్పత్తి చేయటంలో ప్రపంచంలోనే పెద్ద ఉత్పత్తిదారులు. అమెరికా 2022 నాటికి తన మొక్కజొన్న పంటలో నాలుగో వంతును ఇథనాల్ ఉత్పత్తికి ఉపయోగించనుంది. యూరోపియన్ యూనియన్ 2020 నాటికి తన వాహన ఇంధనంలో 10 శాతాన్ని జీవశక్తి నుంచి పొందటానికి పథకాలు తయారు చేస్తున్నది. ఆహారోత్పత్తికి బదులు జీవ-ఇంధనోత్పత్తి పెరగటం వల్ల ప్రపంచంలోని కోట్లాది పేద ప్రజానీకం ఆహారం దొరకని ప్రమాద స్థితిలో పడతారు. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా, కరీబియన్ దేశాలకు చెందిన ఆకలితో అలమటించే 37 దేశాలలో పెరుగుతున్న ఆహార ధరలు ఇప్పటికే ఆహార ఘర్షణలను రేపుతున్నాయి.

2008 ప్రపంచ అభివృద్ధి రిపోర్టు ప్రకారం, అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రతి నలుగురిలో ముగ్గురు గ్రామీణ ప్రాంతాల్లో జీవిస్తున్నారు. 210 కోట్ల మంది రోజుకు 2 డాలర్ల కంటే తక్కువ సంపాదన మీద బతుకుతున్నారు. 88 కోట్ల మంది రోజుకు ఒక డాలరు కంటే తక్కువ సంపాదన మీద బతుకులు వెళ్లదీస్తున్నారు. వీరిలో ఎక్కువ మందికి వ్యవసాయమే జీవనాధారం. వ్యవసాయమే జీవనాధారమైన ఈ ప్రజానీకం మారుతున్న వాతావరణ పరిస్థితుల వల్ల తీవ్రంగా నష్టపోతున్నారు. ఆఫ్రికాలో సహారా ఎడారికి చెందిన అనేక ప్రాంతాల్లో తరచూ పంటల వైఫల్యం, పంటలు ఎండిపోవడం లాంటి విపత్తుల ఫలితంగా తీవ్రమైన ఆర్థిక నష్టాలకు గురై, ఆహార భద్రత కొరవడుతున్నది. భూ వాతావరణం వేడెక్కుతుండటం, గ్రీన్‌హౌస్ వాయువులు ఎక్కువగా వదులుతుండటం, పట్టణీకరణ కోసం అడవుల విధ్వంసం, ప్రకృతి వనరుల విచ్చలవిడి వినియోగం ఫలితంగా వాతావరణం పెను మార్పులకు గురై, దాని వినాశకర ప్రభావం వ్యవసాయంపై పడుతున్నది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 1990ల నుండి ఆహారోత్పత్తి జనాభా పెరుగుదలకంటే మూడు రెట్లు ఎక్కువగా వున్న విషయం మరిచిపోరాదు.

ఆహారం, భూమి, పేదలు, ధనికుల మధ్య తీవ్ర అంతరాలు, బహుళజాతి సంస్థల పాత్ర మొదలైన కీలక సమస్యలను ఆ దేశాలు ఏ మాత్రం పట్టించుకోలేదు. ఆసియా అభివృద్ధి బ్యాంకు డైరెక్టర్ జనరల్ రజత్ ఎం.నాగ్ 'చౌకగా దొరికే చమురు యుగం ముగిసిందని ఒప్పుకుంటున్నాం' అని 2008, ఏప్రిల్ 2న సింగపూర్‌లో చెప్పాడు. ఆస్ట్రేలియా మొదలైన దేశాల్లో ప్రకృతి విలయాలు ఆహార సంక్షోభం ఏర్పడటంలో చెప్పుకోదగ్గ ప్రభావాన్ని చూపించగా, మూడవ ప్రపంచ దేశాల్లో భూసంబంధాలు, వ్యవసాయంలో తగ్గిన పెట్టుబడి, సాగునీటి సౌకర్యాల కొరత, రైతాంగం ఆధారపడిన రసాయనిక ఎరువులు, అధిక దిగుబడి వంగడాల విత్తనాలు, పురుగు మందులు ప్రధానంగా బహుళజాతి సంస్థల చేతుల్లో వుండి, వాటి ధరలను ఆ సంస్థలు విపరీతంగా పెంచుతుండటం, నేల ఉత్పాదకత తీవ్రంగా తగ్గిపోవటం, స్వదేశీ ప్రజల అవసరాలమేరకు పంటలసాగు కాకుండా, ఎగుమతి ప్రాధాన్యమైన పంటలు ఎక్కువగా పండించటం, పట్టణీకరణ, పారిశ్రామీకరణ కోసం వ్యవసాయ భూముల విధ్వంసం మొదలైనవి ఆహార సంక్షోభానికి కారణమయ్యాయి. భారతదేశంలో ఆహార సంక్షోభం అకస్మాత్తుగా తలెత్తినదికాక, గత దశాబ్దానికి పైగా అనుసరిస్తున్న ప్రపంచీకరణలో భాగంగా ప్రపంచబ్యాంకు, డబ్ల్యు.టి.ఒ. మొదలైన సంస్థల ఆదేశిత విధానాలను అమలు చేయటంవల్ల ఏర్పడింది. భారతదేశం లాంటి దేశంలో పెరిగే ద్రవ్యోల్బణంతోపాటు కోట్లాది పేదల, శ్రామిక ప్రజల ఆదాయం పెరగకపోవటం వల్ల ఆహార ధరలు పెరిగినప్పుడల్లా వారి జీవితాలు

మరింత దుర్భరమవుతాయి. భారతదేశంలో 80 శాతం ప్రజల ఆహార వినియోగం కనీస జీవితావసరానికంటే తక్కువగా వుండి, ద్రవ్యోల్బణంతో అది మరింత తగ్గి, ప్రజలు వ్యాధులకు, తీవ్రమైన ఆకలి బాధలకు గురవుతున్నారు. పశ్చిమ దేశాల్లో వ్యవసాయ రంగంలో పెద్ద ఎత్తున సబ్సిడీలు పొంది, భారత మార్కెట్‌ను ముంచెత్తుతున్న వ్యవసాయోత్పత్తులకు దేశంలో పెద్ద ఎత్తున దిగుమతి రాయితీలు కల్పించటం, జన్యు మార్పిడి విత్తనాల ప్రవేశం, కాంట్రాక్టు వ్యవసాయం, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు మొదలైన ఉత్పాదకాలకు దేశీయ రక్షణ తొలగించటం, వ్యవసాయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయటం, వ్యవసాయానికి సంస్థాగత రుణాల కొరత, అర్ధ భూస్వామ్య భూసంబంధాలు వంటివన్నీ కలిసి భారత రైతాంగం యొక్క జీవితాలను నాశనం చేస్తున్నాయి.

## ప్రస్తుత ఆహార సంక్షోభ కారణాలు, పరిణామాలు

ప్రస్తుత ఆహార సంక్షోభం అకస్మాత్తుగా సంభవించిందికాదని మనం గుర్తుంచుకోవాలి. అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలు 2006-07లో కూడా తమ వాహనాల ఇంధన ట్యాంకులను నింపుకునే సమస్యకు కోట్లాది టన్నుల ఆహార ధాన్యాలను ఉపయోగిస్తుండగా, మూడవ ప్రపంచ దేశాల సామాన్య ప్రజానీకం ఆహార ధరలు ఆకాశాన్నంటుతుంటే, తమ కడుపులు నింపుకోవడానికి పోరాడుతున్నారు. 'అనుచితమైన విధానాల వల్ల గత 20 సంవత్సరాలుగా ఆహార సంక్షోభం పెరుగుతూ వచ్చింది' అని ఎఫ్.ఎ.ఒ. డైరెక్టర్ జాక్వెస్ డియోఫ్ అన్నాడు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆదేశిత నయా ఉదారవాద సంస్కరణల అమలు ఫలితంగా భారతదేశం లాంటి మూడవ ప్రపంచ దేశాల్లోని పేద దేశాలన్నింటా గత రెండు దశాబ్దాలకు పైగా జనాభా పెరుగుదలకంటే వ్యవసాయోత్పత్తుల పెరుగుదల, ముఖ్యంగా ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరుగుదల పడిపోయింది. ఎఫ్.ఎ.ఒ. గణాంకాల ప్రకారం ప్రపంచ తలసరి తృణ ధాన్యాల వినియోగం 1980లో 355 కిలోలుండగా, 2000 సంవత్సరం నాటికి అది 343 కిలోలకు పడిపోయింది. ప్రపంచీకరణ యజమానులు ప్రభుత్వాలతో వ్యవసాయానికి వెచ్చించే నిధుల్లో కోతలు పెట్టించటం వల్ల పేద దేశాల్లో వ్యవసాయంలో పెట్టుబడులు క్షీణించి, ఉత్పత్తి మందగించింది. భారతదేశంలో మూడవరంగం (చేతివృత్తులు) కుదించుకు పోవటంతో, జనాభాలోని 70 శాతానికి ఆధారభూతమైన వ్యవసాయరంగం వేగంగా క్షీణించింది. జనాభాలోని కొద్ది మంది ధనికుల జీవన ప్రమాణాలను పెంచే అభివృద్ధిని సమర్థించేవారు పట్టణీకరణ, జాతీయ రహదారుల నిర్మాణం, మౌలిక వసతుల అభివృద్ధి, ఎస్.ఇ.జడ్.లు మొదలైన పిడికెడు మంది అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలు భూమి, వ్యవసాయాలకు నేరుగా నష్టం కలిగించటం గురించి ఏమాత్రం చింతించటం లేదు.

అమెరికా ఆదేశాలకు తలొగ్గిన భారత్ హరిత విప్లవం పట్ల అత్యుత్సాహం ప్రదర్శిస్తూ, భూసంస్కరణలు చేపట్టకుండ సాంకేతిక పరిజ్ఞాన పెంపు ద్వారా 'అభివృద్ధి' మార్గంలో ప్రమాదకరమైన ప్రయాణం సాగించింది. దాని పరిణామాలు కోలుకోలేనంత పతనానికి దారితీశాయి. రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్, ప్రపంచబ్యాంకు, పాశ్చాత్య సామ్రాజ్యవాద ప్రభుత్వాల ప్రోత్సాహంతో భారత్ హరిత విప్లవంలో మొదటి దశను అమలుచేసింది. అది విప్లవ పరివర్తన ద్వారా సోషలిస్టు వ్యవస్థలోకి పరివర్తన చెందటంలో సోవియట్ యూనియన్ వేసిన ప్రభావానికి, చైనీయులు సాధించిన విజయానికీ, మూడవ ప్రపంచ దేశాల్లో ఎర్ర విప్లవం పట్ల పెరుగుతున్న అనుకూల ధోరణలకూ వ్యతిరేకంగా పై చేయి సాధించిన ప్రాజెక్టుగా చూపించడానికి, వ్యూహాత్మక అవసరం దృష్ట్యా సామ్రాజ్యవాదులు భారత వ్యవసాయానికి మద్దతునిచ్చిన కాలం. ఇప్పుడు ఇరాక్ ప్రతిఘటన, ఉత్తర కొరియా, ఇరాన్‌ల అవిధేయత మొదలైన వాటిని అణచివేయాల్సిన అవసరంతోపాటు పెద్ద పెట్టుబడిదారీ శక్తులుగా పెరుగుతున్న రష్యా, చైనాల పలుకుబడికి అడ్డుకట్ట వేసే అమెరికా విధానానికి సంబంధించిన భౌగోళిక రాజకీయ ప్రయోజనం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పుడు హరిత విప్లవం నాటి అపరిమిత దిగుబడులు లేవు, పర్యావరణం, నేల సారం నాశనమైపోయాయి. ఎరువులు, అధిక దిగుబడి వంగడాల విత్తనాల కొరకు బహుళజాతి సంస్థలపై మితిమీరి ఆధారపడటం వల్ల భూమిలోని నీటి మట్టం, పంటలకు ఉపయోగకరమైన సూక్ష్మ జీవులపై తీవ్రంగా దుష్ప్రభావం పడింది. ఇటువంటి దుస్థితి గురించి అమెరికా సెనెట్ విదేశీ సంబంధాల కమిటీకి చెందిన జోసెఫ్ ఆర్.బైడెన్ 'అమెరికా సహాయంతో భారత్‌లో హరిత విప్లవం వచ్చింది. అది భారత్‌కు, అమెరికా వ్యాపారానికి కూడా మేలు చేసింది' అని 2006 మే 29న గర్వంగా ప్రకటించాడు. హరిత విప్లవం ద్వారా విపరీతమైన లాభాలు దండుకున్న అమెరికా వ్యాపారం భారత వ్యవసాయ రంగానికి చేసిన మేలు ఏమీ లేదనేది మనం గమనించాలి. ఆహార ధాన్యాల ఉత్పత్తి తగినంత పెంచటంలో హరిత విప్లవం విఫలమైంది. అంతేగాక, ప్రభుత్వ లెక్కల ప్రకారం 1990-2007 మధ్య కాలంలో వార్షిక జనాభా పెరుగుదల 1.9 శాతం కాగా ఆహార ధాన్యాల ఉత్పత్తి 1.2 శాతంగానే వుంది. హరిత విప్లవానికి గుండెకాయగా పైకెత్తిపట్టిన హర్యానా, పంజాబ్, పశ్చిమ ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు ఇప్పుడు పర్యావరణం నాశనమైన స్థితిలో వున్నాయి. ఆర్థికంగా రైతులు తీవ్రమైన రుణగ్రస్త స్థితిలో వున్నారు. పర్యావరణ పరంగా నేల, భూగర్భ జలవనరులు తీవ్ర నష్టానికి గురయ్యాయి. పర్యావరణం ధ్వంసమైన పరిణామాల ఫలితంగా

వరి, గోధుమ పండించే ప్రాంతాల్లో నీటి మట్టం సంవత్సరానికి 2-2.5 అడుగులు తగ్గిపోతున్నది. ఆవిధంగా హరిత విప్లవం దేశ ఆర్థిక వ్యవస్థకు, పర్యావరణానికి శాపంగా తయారైంది. అంతేగాక, 1960లలో ప్రధానంగా అమెరికా ఆదేశిత సాంకేతిక పరిజ్ఞానం-ప్రోత్సాహం-మార్పు అనే విధానాలను అమలుచేసిన దాని ఫలితాలు ప్రమాదకరమైన హెచ్చరికలు చేస్తున్నప్పటికీ, మరొకసారి రెండవ హరిత విప్లవాన్ని గుడ్డిగా సమర్ధిస్తూ, 1960ల నాటి విధానాన్నే దేశం మీద రుద్దడానికి అత్యుత్సాహం ప్రదర్శిస్తూ 'సాంకేతిక పరిజ్ఞాన కొరతను అధిగమించడానికి' అంటూ 2007 మే 29న జాతీయ అభివృద్ధి కౌన్సిల్ సమావేశంలో మన్మోహన్‌సింగ్ మాట్లాడాడు.

దేశీయ ఆహార ధాన్యాల ఉత్పత్తి 2003-04, 2007-08 మధ్య దాదాపుగా స్తంభించిపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత ఆహార ధాన్యాల ఉత్పత్తి లక్ష్యం 220 మిలియన్ టన్నులుకాగా, అది 20 మిలియన్ టన్నులకు పడిపోయిందని అంచనా. రెండవది, 2003-04, 2006-07 మధ్య కాలంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి మొత్తం 4.1 మిలియన్ టన్నులు మాత్రమే పెరగ్గా అదే కాలంలో పప్పు ధాన్యాల ఉత్పత్తి 0.7 మిలియన్ టన్నులకు పడిపోయింది. తలసరి తృణధాన్యాల లభ్యత 2002-03లో రోజుకు 458.7 గ్రాములుకాగా, 2005-06లో అది 390.9 గ్రాములకు పడిపోయింది. అదే విధంగా రోజుకు తలసరి పప్పుల లభ్యత 35.4 గ్రాముల నుండి 31.5 గ్రాములకు తగ్గింది. అదే కాలంలో రోజుకు మొత్తం ఆహార ధాన్యల తలసరి లభ్యత 491.1 గ్రాముల నుండి 422.4 గ్రాములకు తగ్గింది (భారత ప్రభుత్వ ఆర్థిక సర్వే 2007-08). అదే సర్వే తలసరి పప్పు ధాన్యాల నికర లభ్యత 1962లో రోజుకు 62.2 గ్రాములుండగా, 2005 నాటికి అది 31.5 గ్రాములకు పడిపోయిందని చెప్పింది. అయితే, నిజానికి, సమాజంలోని తీవ్ర అసమానతలు కోట్లాది ప్రజానీకానికి ఆహార ధాన్యాలు లభించకుండా అడ్డుకుంటున్న వాస్తవాన్ని ఈ సర్వేలోని తలసరి ఆహార ధాన్యాల గణాంకాలు ప్రతిబింబించటం లేదు. భారత వార్షిక వ్యవసాయోత్పత్తి పెరుగుదల రేటు 2006-07లో 3.8 శాతంకాగా, 2007-08లో 2.6 శాతానికి తగ్గింది. ఇది నయా ఉదారవాద నమూనా విధానాలను అమలు చేసి, వ్యవసాయాన్ని ఘోరంగా నిర్లక్ష్యం చేయటాన్ని స్పష్టంగా కళ్లకు కడుతున్నది. 1990-91 నుంచి 2006-07 మధ్య కాలంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి వార్షిక పెరుగుదల రేటు 1.2 శాతంగా నమోదైంది. ఇది భవిష్యత్‌కు సంబంధించిన తీవ్ర ధోరణిని చూపించిందిగాని, ఆహార లభ్యతను, ఉత్పత్తిని, భారతదేశం ప్రజలందరికీ తగినంత ఆహారం అందించలేదనే వాస్తవాన్ని చూపించలేదు.

తగినంత ఆహార ధాన్యాల నిల్వలు, ఆహారోత్పత్తి (తగ్గినప్పటికీ) వున్నప్పటికీ, ఆదివాసులకు తగినంత ఆహారం, పోషణ అందటంలేదు. సంప్రదాయ ధాన్యం (చిరుధాన్యాలు, తృణ ధాన్యాలు), కాయధాన్యం, నూనె గింజల పంటలే వీరి ప్రధాన ఆహారం. ఆహార సమస్య ముందుకొచ్చేటప్పటికి వీరి దారిద్ర్యం, పోషకాహారం, తిండి సమస్యలు మరుగున పడిపోతున్నాయి. ఇటీవల పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్న గనుల ప్రాజెక్టులు, నిరంతరం అడవుల నరికివేత, తీవ్ర నిర్లక్ష్యం వారి ఉనికినే దుర్భరం చేసింది.

భారత ప్రజలు ఆకాశాన్నంటే ఆహార ధరల పెరుగుదలను ఎదుర్కొంటుండగా, అమెరికా సామ్రాజ్యవాదం భారత రైతాంగాన్ని, నేలను మరోసారి లూటీ చేయడానికి భారతదేశాన్ని 'అమెరికా భారత వ్యవసాయ పరిజ్ఞాన ప్రోత్సాహం' (2005, జూలై 18న ఎ.కె.ఐ.పై సంతకాలు జరిగాయి) ద్వారా తన అదుపులో పెట్టుకుంది. అమెరికా అధ్యక్షుడు బుష్ భారత పర్యటన సందర్భంగా ప్రధాన మంత్రి 2006 మార్చిలో 'దేశంలో రెండవ హరిత విప్లవానికి వ్యవసాయ పరిజ్ఞాన ప్రోత్సాహం తలమానికమవుతుందని ఆశిస్తున్నాము' అంటూ పార్లమెంట్‌లో మాట్లాడాడు. వ్యవసాయ విశ్వవిద్యాలయాల ప్రస్తుత పాఠ్య ప్రణాళికను తిరగదోడి (సవరణలు చేసి), మార్కెట్ ప్రాధాన్యతతో వ్యవసాయ శాస్త్రజ్ఞులను అభివృద్ధి చేయటం ద్వారా జన్యు మార్పిడి పంటలు, ఆహార తయారీ ప్రక్రియ (ఫుడ్ ప్రాసెసింగ్) క్రయవిక్రయాలు (మార్కెటింగ్) మొదలైన వాటిని భారతదేశంపై రుద్దటం (మోన్‌శాంటో, వాల్‌మార్ట్ తదితర బహుళజాతి సంస్థల హద్దూ అదుపులేని చొరబాటుకోసం) ఈ ఒప్పందపు లక్ష్యం. రెండవ హరిత విప్లవం కోసం అని చెపుతున్న అమెరికా-భారత వ్యవసాయ ఒప్పందం భారత వ్యవసాయ భూములను, రైతాంగాన్ని మరింత నాశనం చేసి, మోన్‌శాంటో, సింజెంటా, బేయర్ క్రాప్‌సైన్స్, డ్యూపాంట్, డోవ్, బి.ఎ.ఎస్.ఎఫ్. ప్లాంట్ సైన్స్ తదితర అమెరికా కార్పోరేట్ సంస్థల దోపిడిని సానుకూలం చేస్తుంది. పంటల వైవిధ్యాన్ని దెబ్బతీస్తూ, ఎగుమతి ప్రాధాన్యంతో నిర్దేశించిన లక్ష్యాలమేరకు ఆహార పంటల ఉత్పత్తి జరుగుతుంది. ఈ నయా ఉదారవాద ఎజెండా ఏప్రిల్ 2004న భారత్‌లో అమెరికా రాయబారి డేవిడ్ సి.మల్‌ఫోర్డ్ మాట్లాడినట్లు కొద్ది మంది అధికాదాయ వర్గాల ఆహార అవసరాలను తీర్చేందుకు 'మంచి పండ్లు, ఫలాలు, కూరగాయలు, పాల ఉత్పత్తులు, కోళ్ల వుత్పత్తులు, శుద్ధి చేసిన ఆహార, మాంస ఉత్పత్తుల పెంపుదల'కు ఉద్దేశించినది. ఆ విధంగా భారత వ్యవసాయం పైన అమెరికా పట్టు బిగిసిన ఫలితంగా ఏర్పడిన ఆహార సంక్షోభం మరింత తీవ్రమై, ప్రకృతి తీవ్ర విధ్వంసానికి గురవుతుంది.

ఆహార భద్రత అంటే కేవలం ఆహార ధాన్యాల నిల్వ లేక ఆహారోత్పత్తి పెంచటమేకాదు. వర్గ దృష్టితో చూసినప్పుడు ఆహార

భద్రత అంటే ప్రతి కుటుంబానికి ఆహారం, పోషక విలువలు సులభంగా అందటం. ఆహార భద్రత అంటే లింగ వివక్ష లేకుండా ప్రతి వ్యక్తికి తగినంత ఆహారం లభించడానికి ఎటువంటి పరిమితులు లేకుండా చేయటం. అంతేకాదు, ఆహార భద్రతంటే సామాన్య ప్రజలకు తగినంత కొనుగోలు శక్తి, ఉపాధి కల్పించి, బహుళజాతి సంస్థల, సట్టా వ్యాపారుల, అవినీతి రాజకీయ నాయకుల, నల్ల బజారు వ్యాపారుల, వడ్డీ వ్యాపారుల, ప్రత్యేకించి ధనిక భూస్వాముల మధ్యనున్న దోపిడి పొత్తును ఖచ్చితంగా పటాపంచలు చేయటం.

1994 గాట్ ఒప్పందాలపై సంతకాలు చేయటంతో అత్యంత వినాశకరమైన రెండవ హరిత విప్లవం ఆర్భాటంగా ముందుకు వచ్చింది. ఇప్పుడు బహుళజాతి సంస్థలు, భారత బడా వ్యాపార సంస్థలు విత్తన సంస్థలను అదుపు చేస్తున్నాయి. జాతీయ విత్తన సంస్థలను కూడా కార్పొరేట్ వ్యవసాయ వ్యాపార సంస్థలతో విత్తనాల కొనుగోళ్లు, అమ్మకాలు సాగించే విధంగా, ప్రధానంగా విత్తనాల త్వరితగతి వ్యాపారాన్ని తమ గుప్పిట్లో పెట్టుకుంటున్నాయి. ప్రధానంగా కార్గిల్, మోన్‌శాంటో మొదలైన బహుళజాతి సంస్థలు ఇప్పుడు భారత విత్తన మార్కెట్‌లో 75 శాతం వ్యాపారాన్ని చేజిక్కించుకున్నాయి. రైతులకు సంబంధించిన జాతీయ కమీషన్ (ఎన్.సి.ఎఫ్) కూడా భూమి, నీరు, రుణాలు, బీమా, సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్‌కు సంబంధించి ఐ.ఎం.ఎఫ్., ప్రపంచ బ్యాంకు ఆదేశాలమేరకు సిఫారసులు చేస్తున్నది. "ప్రపంచీకరణ, పోటీతత్వం జీవిత వాస్తవాలు'' అవటం వల్ల రైతులు సంప్రదాయ, అధిక దిగుబడి వంగడాల విత్తనాల స్థానంలో జన్యు మార్పిడి విత్తనాలను ఉపయోగించటం ప్రారంభించాలని అత్యుత్సాహంతో పుపదేశిస్తున్నది. మోన్‌శాంటో జన్యు మార్పిడి విత్తనాలు మార్కెట్‌లోకి తెచ్చి అమ్మకాలు సాగించిన తర్వాత వేలాది రైతుల ఆత్మహత్యలు సంభవించాయని ఇప్పుడు అందరికీ బాగా తెలిసివచ్చింది.

## ప్రపంచ ఆహార సంక్షోభ కోణాలు

రెండవ ప్రపంచ యుద్ధానంతర కాలంలో గతంలో ఎన్నడూ లేనంతగా ఆహార ధరలు పెరిగాయి. ఈ సంక్షోభ కారణాలు, నివారణా మార్గాలను అర్థం చేసుకోవడానికి సంక్షోభ లక్షణాలను కొన్నింటిని పరిశీలిద్దాం.

## అమెరికాలో ఆహార ధరల పెరుగుదల

ప్రస్తుత సంక్షోభానికి ముందు ప్రతి దేశంలో కూడా పేద ప్రజలు ఆకలి బాధలకు గురయ్యారు. ప్రస్తుత ప్రపంచ ఆహారోత్పత్తి, నిల్వలు ప్రజలందరికి ఆహారం అందించగల స్థాయిలో వున్నాయనేది స్పష్టం. ఆహారోత్పత్తిలో తగ్గుదల వున్నప్పటికీ, ఆహార అభద్రత పూర్తిగా ఆహార కొరతకు సంబంధించిన అంశం కాదు. ఐక్యరాజ్య సమితి అంచనాల ప్రకారం, ప్రపంచంలో వంద కోట్ల ప్రజలు నిరంతరం ఆకలితో అలమటిస్తున్నారు. దాదాపు 300 కోట్ల మంది ఆహార అభద్రతను ఎదుర్కొంటున్నారు. అమెరికాలో కూడా ఆహార అభద్రత సమస్యగానే వుంది. అమెరికా వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం 2006లో అమెరికాలో 35 మిలియన్లకు పైగా ప్రజలు ఆహార అభద్రతలో జీవిస్తున్నారు. సంవత్సరంలో కొంత కాలం తగినంత ఆహారం లభించక 5 మిలియన్ల కుటుంబాల్లోని పిల్లలు చనిపోతున్నారు. వాస్తవానికి భాతతదేశంలో వలె (ఇక్కడ సమస్య మరింత తీవ్రంగా వుందనేది స్పష్టం) అమెరికాలో కూడా ఆహార అభద్రతకు కారణాలు ఆహార సరఫరాకాక 'ఎక్కువ డిమాండే' కారణంగా వుంది.

ఈ తీవ్ర ఆహార సంక్షోభంలో ఆహార ధరలు ఈ సంవత్సరం 5 శాతం పెరుగుతాయని, 2012 నాటికి సంవత్సరానికి సగటున 5.25 డాలర్లు పెరుగుతాయని అమెరికా వ్యవసాయ శాఖ చెపుతున్నది. 2008 జనవరి 9 నాటి న్యూయార్క్ పత్రిక కథనం ప్రకారం ప్రపంచ మార్కెట్‌లో 60 వ్యవసాయ సరుకుల ధరలు 2006లో 14 శాతం, 2007 సంవత్సరంలో 37 శాతం పెరిగాయి. రేషన్ ప్రకారం బియ్యం అమ్మకాలు జరుగుతున్నాయి. వాల్‌మార్ట్ వంటి పెద్ద రిటైల్ మార్కెట్ వ్యాపార సంస్థలు కూడా ఒక్కొక్క వినియోగదారుకు నాలుగు సంచులకంటే ఎక్కువ బియ్యం అమ్మటం లేదు. 2008 ప్రారంభంలో బియ్యం ధర 68 శాతం పెరిగింది. అమెరికాలోని కొన్ని దుకాణాల్లో అది రెండు రెట్లయింది. ఇది దీర్ఘకాలిక ఆహార అభద్రత. ప్రపంచీకరణ అవసరమైన ప్రస్తుత పెట్టుబడిదారీ వ్యవస్థ ఈ సమస్యను ఇప్పుడప్పుడే పరిష్కరించదు.

## పేదలకు అవకాశం లేదు

అమెరికాకు చెందిన ఆర్థిక సహకారం, అభివృద్ధి సంస్థ (ఒ.ఇ.సి.డి), ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహారం, వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఒ)లు సంయుక్తంగా నిర్వహించిన వ్యవసాయ దృక్పథం 2008 మే 29న పారిస్‌లో రూపొందించి, ప్రవేశపెట్టిన విస్తృత నిర్ణయం ఆహారాన్ని దిగుమతి చేసుకునే మూడవ ప్రపంచ దేశాల్లో ఆహార ధరలు సమీప భవిష్యత్తులో కూడా తగ్గేటట్లు లేవని చెప్పింది. వ్యవసాయ మార్కెట్లలో తృణధాన్యాలు, నూనె గింజలు, చక్కెర, మాంసం, పాల ఉత్పత్తులు 2008 నుండి 2017 వరకు పెరుగుతూనే వుంటాయని, గొడ్డు మాంసం, పందిమాంసం ధరలు 20 శాతం పెరుగుతాయని, ముడి చక్కెర, తెల్ల చక్కెర ధరలు 30 శాతం, గోధుమ, మొక్కజొన్న, మీగడ తీసిన పాలపొడి ధరలు 40 నుండి 60 శాతం, వెన్న, నూనె గింజల ధరలు 60 శాతంపైగాను,

కూరగాయల, నూనెల ధరలు 80 శాతం పైగాను పెరుగుతాయని ఆ డాక్యుమెంట్ చెప్పింది. 2007-08లో ముతక బియ్యం, గోధుమ ఉత్పత్తి రికార్డు స్థాయిలో, మధ్యరకం బియ్యం ఉత్పత్తి తగినంత ఉన్నప్పటికీ, తర్వాత 2017 వరకు ధాన్యం మార్కెట్‌లో పరిస్థితి గడ్డుగానే వుంటుందని ఒ.ఇ.సి.డి. (ఆర్థిక సహకార అభివృద్ధి సంస్థ) చెప్పింది. 2017 నాటికి అమెరికాలో పండే మొక్కజొన్న పంటలో 40 శాతం వరకు ఇంధనోత్పత్తికి ఉపయోగించాలని నిర్ణయించినప్పటి నుండి ఇథనాల్ తయారీ పెరగటంతో అమెరికాలో మొక్కజొన్నకు పెద్దయెత్తున డిమాండ్ పెరిగి, దానివల్ల ముతక ధాన్యం మార్కెట్‌పై తీవ్రమైన దెబ్బపడిందని డాక్యుమెంట్ నివేదించింది. (బిజినెస్ లైన్, మే 30, 2008)

## ఆహార సంక్షోభంపై బుష్ గగ్గోలు, వాస్తవాలు

ప్రస్తుత ఆహార సంక్షోభం గురించి మొదట కొండాలిజారైస్, ఆ తర్వాత అమెరికా అధ్యక్షుడు బుష్‌లు భారత, చైనా ప్రజల మీద అక్కసు వెళ్లగక్కారు. అమెరికా సామ్రాజ్యవాదం, యూరోపియన్ యూనియన్, అమర్త్యసేన్ వంటి కొంత మంది ఆర్థికవేత్తలు కూడా భారత, చైనా ప్రజల ఆహార వినియోగం పెరగడాన్ని లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యానాలు చేశారు. జీవ ఇంధన తయారీకి పశ్చిమ దేశాలు ఆహార ధాన్యాలను పెద్ద ఎత్తున మళ్లించటం, పశ్చిమ దేశాల సట్టా వ్యాపార పెట్టుబడి ఆహార ధాన్యాల సట్టా వ్యాపారాన్ని పెద్దఎత్తున సాగించటం, భూసారాన్ని ధ్వంసం చేయటం, పంట భూముల్ని కొల్లగొట్టడం మొదలైనవి ప్రపంచ ఆహార సంక్షోభానికి ప్రధాన కారణాలు కాగా, వీటిపై వారెవరూ నోరు మెదపటంలేదు. మూడవ ప్రపంచ దేశాలు దారిద్ర్యం, పోషకాహార లోపం, తీరని ఆకలి మంటలతో నాశనమైనా అమెరికా సామ్రాజ్యవాదం, పశ్చిమ దేశాలు తమ సౌభాగ్యం పెంచుకోవటమే పరమావధిగా భావిస్తున్నాయి. బుష్, రైస్ తదితరుల వ్యాఖ్యల వెనుక వున్న వాస్తవాలు ఇవి. అమెరికా వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం అమెరికాలో తలసరి ఆహార ధాన్యాల వినియోగం 1046 కిలోలుకాగా, భారతదేశంలో అది 174 కిలోలు మాత్రమే. కోడి మాంసం తలసరి వినియోగం అమెరికాలో 45.4కిలోలు, యురోపియన్ యూనియన్‌లో 16.2 కిలోలు కాగా, భారతదేశంలో అది 1.9 కిలోలే.

భారతదేశంలో, అత్యవసర ఆహార సరుకుల ధరలు పెరిగి కోట్లాది పేద ప్రజలు మరింత దారిద్ర్యంలో కూరుకుపోయారు. అమెరికా ప్రోత్సహించి, నాయకత్వం వహిస్తున్న ప్రపంచీకరణ కార్యక్రమం కింద అమెరికా సామ్రాజ్యవాద ఆదేశిత విధానాలను అమలు చేయటంలో భారత్ అత్యుత్సాహంతో ముందుకు వురుకుతున్నది. దీనితో విస్తృత ప్రజానీకానికి ప్రాతినిధ్యం వహిస్తున్న దారిద్ర్య పీడిత భారత్, కొద్ది శాతం ప్రజలకు ప్రాతినిధ్యం వహించే 'వెలిగిపోతున్న భారత్'కు మధ్య తీవ్ర అంతరాలు పెరిగాయి. కేంద్ర ప్రభుత్వం నియమించిన అర్జున్ సేన్ గుప్త కమిటీ దేశంలోని 78 శాతం మంది ప్రజలు రోజుకు 20 రూపాయలకంటే తక్కువ భృతి మీద జీవనం వెళ్ల దీస్తున్నారని దేశ ఆర్థిక వ్యవస్థలోని చీకటి కోణాన్ని బహిర్గతం చేసింది. అధికారిక గణాంకాల ప్రకారం 1997-2005 మధ్య కాలంలో 1,36,324 మంది రైతుల ఆత్మహత్యలు సంభవించాయి. అప్పటి నుండి ఈ సంఖ్య పెరుగుతూనే వుంది. తలసరి తృణ ధాన్యాల వినియోగం 1990-91లో 468 గ్రాములుండగా, 2005-06కు అది 412 గ్రాములకు పడిపోయింది. ఈ కాలంలో విశాల ప్రజానీకానికి పోషకాహారం లభించే వనరులన్నీ తగ్గిపోయాయి. ప్రస్తుత ప్రపంచ ఆహార సంక్షోభంలో భారతదేశం లాంటి దేశాల ఆహార వినియోగం పెరిగిందనేవి సిగ్గులేని వ్యాఖ్యలు, పచ్చి అబద్ధాలుతప్ప మూడవ ప్రపంచ దేశాల ఆహార వినియోగం పెరిగిందేమీ లేదు.

## ఆహార సంక్షోభంలో బహుళజాతి కంపెనీల అపరిమిత లాభాలు

ప్రపంచ ఆహార సంక్షోభంతో కోట్లాది ప్రజలు ఆకలితో నకనకలాడుతుంటే బహుళజాతి కంపెనీలు అపరిమిత లాభాలు దండుకుంటున్నాయి. వ్యవసాయ వ్యాపార తిమింగలాలు, ప్రపంచ ఆహార ధాన్యాల వ్యాపారులు, విత్తన సరఫరాదారులు, ఎరువులు, పురుగు మందుల తయారీదారులు ఇటువంటి ఆహార సంక్షోభాన్ని అపరిమిత లాభాలు దండుకునే మంచి అవకాశంగా చూస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా మూడవ ప్రపంచదేశాల్లో రాబోయే కాలంలో బహుళజాతి కంపెనీలు తమ లాభాలను మరింత పెంచుకోవడానికి వ్యవసాయ రంగంలో తమ కార్యకాలాపాలను తీవ్రం చేశాయి. గోధుమ, మొక్కజొన్న, బియ్యం ధరలు గత సంవత్సరంకంటే పెరిగి ప్రపంచంలోని కోట్లాది ప్రజలు ఆకలి పీడితులయ్యారు. పేదలు తమ ఆదాయంలో 80 శాతాన్ని ఆహారానికే వెచ్చిస్తున్నారు. ఈ ఆకలి సంక్షోభంలో ఆహార ధాన్యాల వ్యాపారులు పెద్ద ఎత్తున సంపాదిస్తున్నారు. ప్రస్తుత సంక్షోభంలో 100 మిలియన్ల ప్రజలు తీవ్ర ఆహార సంక్షోభానికి గురవుతున్నారని ప్రపంచబ్యాంకు చెపుతున్నది. కాని, ప్రపంచబ్యాంకు, ఐ.ఎం.ఎఫ్., బహుళజాతి కంపెనీలు ఈ సంక్షోభంలో ప్రధాన దోషులు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ వల్ల ప్రపంచ ఆహార వ్యాపార కంపెనీలు రికార్డు స్థాయిలో లాభాలు దండుకుంటున్నది పచ్చినిజం. అమెరికాకు చెందిన కార్గిల్ అనే బహుళజాతి కంపెనీ ప్రపంచ వ్యాప్తంగా ఆహార ధాన్యాల ఉత్పత్తి, నిల్వ, సరఫరా చేయటమేగాక, పాల ఉత్పత్తులు, మాంసం ఉత్పత్తులు, తయారు చేసిన ఆహారం

ఉత్పత్తులు, ఉప్పు, జీవ సంబంధ ఉత్పత్తుల అమ్మకాలు సాగిస్తుంది. 2007లో 88 బిలియన్ డాలర్ల అమ్మకాలు జరిపి, 2.34 బిలియన్ డాలర్ల లాభాలు సంపాదించింది. ఇది అంతకు ముందు సంవత్సరంకంటే 52 శాతం ఎక్కువ. నిత్యావసర సరుకుల వ్యాపారంలో 2008 మొదటి త్రైమాసికంలో వచ్చిన లాభాలు, 2007లో అదే కాలంలో వచ్చిన లాభాల కంటే 86 శాతం ఎక్కువని 2008 ఏప్రిల్‌లో కార్గిల్ ప్రకటించింది. మరొక పెద్ద అమెరికా ధాన్య వ్యాపార కంపెనీ ఆర్చర్ డేనియల్స్ మిడ్‌లాండ్స్ 2007లో 2.1 బిలియన్ డాలర్ల లాభాలు సంపాదించింది. ఇది 2006లో సంపాదించిన లాభాల కంటే 65 శాతం ఎక్కువ. దాని విస్తృతమైన వ్యాపార నెట్‌వర్క్ ద్వారా నూనె గింజలు, తృణ ధాన్యం, గోధుమ, ఓట్లు, బార్లీ కొనడం, అమ్మడం, నిల్వ, శుద్ధి, రవాణా, మళ్లీ అమ్మడం చేస్తుంది. అది కోకో, మాల్ట్‌తో సహా తయారు చేసిన ఆహార పదార్థాలను కూడా ఉత్పత్తి చేస్తుంది. ధాన్య క్రయవిక్రయాల వ్యాపారం 21 మిలియన్ డాలర్ల నుండి 341 మిలియన్ డాలర్లకు అంటే 16 రెట్లు పెరిగి విపరీతమైన లాభాలు సంపాదించింది. అతిపెద్ద బహుళజాతి కంపెనీ మోన్‌శాంటో 2008 ఫిబ్రవరి చివరి నాటికి ముగిసిన త్రైమాసికంలో, 2006-07లో అదేకాలంలో సంపాదించిన లాభాలకు రెట్టింపుకంటే  ఎక్కువగా లాభాలు సంపాదించినట్లు 2008 ఏప్రిల్‌లో చెప్పింది. ఆ విధంగా దాని నికర లాభం 543 మిలియన్ డాలర్ల (2.75 మిలియన్ పౌండ్లు) నుండి 1.12 బిలియన్ డాలర్లకు పెరిగింది. దాని లాభం 1.44 బిలియన్ డాలర్ల నుండి 2.22 బిలియన్ డాలర్లకు పెరిగింది. బంజ్ లిమిటెడ్ అనే బహుళజాతి కంపెనీ ధాన్యం, నూనె గింజల కొనుగోలు, నిల్వ, అమ్మకంతోపాటు ఎరువులు, జంతువుల దాణా, తయారు చేసిన ఆహారాన్ని కూడా అమ్ముతుంది. ప్రపంచ వ్యాప్తంగా 37 బిలియన్ డాలర్లకుపైగా వ్యాపారం సాగించిన దాని లాభం 2007లో 50 శాతం వరకు పెరిగింది. హాంగ్‌కాంగ్‌కు చెందిన నోబుల్ గ్రూప్ ప్రతి సంవత్సరం లాభాలు పెంచుకుంటూ, 2007లో 97 శాతం వరకు లాభాలనాక్రమించింది. ప్రపంచంలోని అతిపెద్ద ఎరువుల కంపెనీల్లో ఒకటైన మొజాయిక్ కంపెనీ ఎరువుల కొరతలో కూడా 2008 ఫిబ్రవరి 28తో ముగిసిన త్రైమాసికంలో 12 రెట్లకుపైగా, అంటే 42.2 మిలియన్ డాలర్ల నుండి 520.8 మిలియన్ డాలర్ల వరకు లాభాలు పెంచుకుంది. కొన్ని రకాల ఎరువుల ధరలు గత సంవత్సరం మూడు రెట్లు పెరిగాయి. సింజెంటా అనే యూరోపియన్ యూనియన్‌కు చెందిన వ్యవసాయ వ్యాపారం చేసే కంపెనీ 2007లో 1.1 బిలియన్ డాలర్లకుపైగా నికరలాభం సంపాదించానని, అది అంతకుముందు సంవత్సరం కంటే 75 శాతం ఎక్కువని ప్రకటించింది. ఎఫ్.ఎ.ఒ. చెప్పినదాని ప్రకారం 2005లో, ప్రపంచంలోని 216 దేశాలలో 117 దేశాలు గోధుమను, 170 దేశాలు ఎరువులు, వివిధ రకాల తృణ ధాన్యలతోపాటు బియ్యాన్ని అంతర్జాతీయ మార్కెట్ నుండి దిగుమతి చేసుకున్నాయి. ఇక ప్రస్తుత ఆహార సంక్షోభం బహుళజాతి కంపెనీల వ్యవసాయ వ్యాపారానికి వరమే అవుతుంది.

## బయోడీజిల్ ఉత్పత్తి

బయోడీజిల్ ఉత్పత్తి పెరుగుదల ఇండోనేషియా, మలేషియాల్లో పామాయిల్ వినియోగాన్ని, బ్రెజిల్‌లో సోయాబీన్ వినియోగాన్ని పెంచింది. వృక్ష సంబంధ నూనెలు, నూనె గింజలకు పుట్టినిల్లు లాంటి ఆదేశాల్లో ఇవి దేశీయ వినియోగానికి గాక, ముఖ్యంగా ఎగుమతులకు పరిమితం కావటం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. ప్రపంచ ఇథనాల్ ఉత్పత్తి 2017 నాటికి 125 బిలియన్ లీటర్లకు పెరగనుంది. ఇది 2007లో జరిగిన ఉత్పత్తికంటే రెట్టింపు. ముడి చమురు ధరలు పెరిగి, 2009లో ఇథనాల్ ధర హెక్టా లీటరుకు 55 డాలర్లయింది. జీవ-ఇంధన ఉత్పత్తి ప్రపంచంలో 200 కోట్ల ప్రజానీకాన్ని ఆకలి రక్కసి కోరలకు బలిచేయనుంది. ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార, వ్యవసాయ సంస్థ జీవ ఇంధనం ఆకలి, దారిద్రాన్ని తగ్గిస్తుందని, వేలాది రైతులు జీవ ఇంధనోత్పత్తి పట్ల ఆసక్తి చూపుతున్నారని 2006లో చెప్పింది. పరిసరాల పరిశుభ్రత పేరుమీద గత రెండు సంవత్సరాల్లో అమెరికా 25 కోట్ల మంది ప్రజలకు సరిపడే 6 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలను జీవ-ఇంధన తయారీకి వినియోగించింది. జీవ ఇంధనం పరిసరాల పరిశుభ్రతకు అనుకూలమైనదనే రుజువులేమీ లేవు. జీవ ఇంధనోత్పత్తి భూసారాన్ని ఎక్కువగా వినియోగించుకుని క్షీణింపజేస్తుంది. జీవ ఇంధనోత్పత్తికి ప్రత్యేకంగా కేటాయించిన భూములుండగా, అమెరికా మొండి వైఖరితో పెద్ద ఎత్తున సబ్సిడీలు ఇస్తున్నది. అమెరికా ప్రతినిధుల సభ 2008 మేలో 200 బిలియన్ డాలర్ల పెద్ద మొత్తం నిధులను వ్యవసాయానికి కేటాయించింది. ఇందులో రైతులకు పెద్ద ఎత్తున సబ్సిడీలు కూడా వున్నాయి. అమెరికా జీవ ఇంధనోత్పత్తికి ఇస్తున్న సబ్సిడీలపై, జీవ ఇంధనాల నిల్వలను పెద్ద ఎత్తున పెంచుతుండటంపై ఆరోపణలున్నాయి. ప్రపంచ ఆహార ధరలు పెరిగిపోతుండటానికి ఇదొక కారణం కావటంతో ఈ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2008 జూన్ మధ్యలో యూరోపియన్ యూనియన్ కూడా విమర్శించింది. ప్రభుత్వ స్థాయిలో పెద్ద ఎత్తున వున్న సబ్సిడీల కార్యక్రమంతోపాటు అమెరికా ఇస్తున్న సబ్సిడీలలో ఫెడరల్ పన్ను, ఆదాయ పన్నుల రాయితీలు, ఉత్పత్తి సామర్థ్యం పెంచేందుకు ఆర్థిక సహాయం పెంచడానికి ఇచ్చే ఫెడరల్ నిధుల మంజూరు కార్యక్రమం కూడా వుంది. యూరోపియన్ యూనియన్ మార్కెట్‌లలో అమెరికా జీవ ఇంధనాలను నింపేస్తుండటంపై అనేక విమర్శలున్నాయి.

యూరోపియన్ యూనియన్ 2005లో అమెరికా నుండి దిగుమతి చేసుకున్న జీవ ఇంధనాలు 7 వేల టన్నులుకాగా, 2007 నాటికి ఆ దిగుమతులు ఒక మిలియన్ టన్నులకు పెరిగాయి. ప్రపంచ మాతా, శిశు సంరక్షణా సంస్థ లెక్కల ప్రకారం భారతదేశంలో 60 శాతం మంది పేద కుటుంబాల పిల్లలు కనీస ఆహారం, ఇతర అత్యవసరాలను పొందలేకపోతున్నారు. 5 సంవత్సరాల లోపు పిల్లల మరణాల రేటు అంతర్జాతీయ సగటు మరణాలకంటే మూడురెట్లు ఎక్కువగా వుంది. ప్రస్తుత పెట్టుబడిదారీ దశలో సంకీర్ణ పారిశ్రామిక సాంకేతిక సంస్థల సముదాయం ఎడతెరిపి లేకుండా ఉత్పత్తి చేస్తున్న కార్లు, విమానాలు తదితర వాహనాలకు జీవ-ఇంధన డిమాండ్ పెద్ద ఎత్తున పెరిగింది. ఈ జీవ-ఇంధనోత్పత్తి పరిసరాలను, వ్యవసాయ భూములను, అడవులు మొదలైన వాటిని ధ్వంసం చేయడమేగాక, నాగరికతను కూడా ధ్వంసం చేస్తున్నది.

## నిత్యావసర సరుకుల ముందస్తు వ్యాపారం

వ్యాపారులు ధరలు పెంచి కోట్లు గడించే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. నిత్యావసర ఆహార సరుకుల ధరలు పెరుగుతున్నప్పటి నుంచి ఆగ్ ఫ్లేషన్ (వ్యవసాయ సరుకుల ధరలు పెరగటం వల్ల ద్రవ్యోల్బణం ఏర్పడటం) ప్రపంచంలో ఇప్పుడు పెద్ద సమస్య అయింది. జి.ఆర్.ఎ.ఐ.ఎన్. అనే స్వచ్ఛంధ సంస్థ చెపుతున్నదాని ప్రకారం నిత్యావసరాల సట్టా వ్యాపారంలో పెడుతున్న పెట్టుబడి 2000 సంవత్సరంలో 5 బిలియన్ డాలర్లు వుండగా, అది 2007 నాటికి 175 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఇప్పుడు ప్రపంచ నిత్యావసరాల మార్కెట్‌లో మొత్తం పెట్టుబడి 513 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. 22 బిలియన్ డాలర్లకుపైగా వార్షిక అమ్మకాలు జరిపే లూయిస్ డ్రేఫస్ అనే ఫ్రాన్స్‌కు చెందిన వ్యవసాయ నిత్యావసర సరుకుల ప్రయివేటు వ్యాపార సంస్థ లాంటివి కూడా అంతర్జాతీయ నిత్యావసర సరుకుల సట్టా వ్యాపారంలో పాల్గొంటున్నాయి. ఈ సంస్థ తన లాభాలను ప్రకటించదు. చికాగో వ్యాపార బోర్డ్ అనే పెద్ద ప్రపంచ నిత్యావసర సరుకుల మార్కెట్ సంస్థ, వ్యాపార సంస్థలు సట్టా వ్యాపార ముందస్తు మార్కెట్‌ను ఏ స్థాయిలో నడిపిస్తున్నాయనే సూచికను అందించింది. ఈ సంస్థ 2008 ఏప్రిల్ నాటికి ఇచ్చిన సమాచారం ప్రకారం 2008 జనవరి నుంచి ఏప్రిల్ మధ్య కాలంలో రోజుకు సగటున 644, 741 కాంట్రాక్టులు కుదిరాయని, ఇది గత సంవత్సరం కంటే 17 శాతం ఎక్కువని తెలియజేసింది. రోజువారీ వ్యాపార సగటు అంకన విలువ (నోషనల్ వాల్యు) గోధుమ వ్యాపారంలో 2.8 బిలియన్ డాలర్లు, మొక్కజొన్నలో 8.9 బిలియన్ డాలర్లు, సోయాచిక్కుడులో 11.2 బిలియన్ డాలర్లుగా వుంది. అమెరికా ఇతర పశ్చిమ దేశాల్లో గృహ రుణాల సంక్షోభం (సబ్ ప్రైమ్ సంక్షోభం) వల్ల స్టాక్ మార్కెట్లలో, స్థిరాస్తుల మార్కెట్లలో పెట్టిన పెట్టుబడి, ఉత్పాదకేతర పెట్టుబడులు పెద్ద ఎత్తున నిత్యావసర మార్కెట్లలోకి, ఆహార పదార్థాల సట్టా వ్యాపారంలోకి తరలిపోయాయి. నిత్యావసరాల మార్కెట్లలో ఇంతపెద్ద మొత్తంలో జరిగిన సట్టా వ్యాపార కార్యకలాపాలు చమురు, ఆహార ధరలను కూడా పెంచివేశాయి.

స్వేచ్ఛా మార్కెట్ల ఛాంపియన్ అయిన అమెరికాకు కూడా పెరిగిపోతున్న వ్యవసాయోత్పత్తుల ధరలు చూసి కళ్లు తిరుగుతున్నాయి. అమెరికాలో సబ్సిడీలు కల్పించిన ఆహార ధాన్యాలను అమెరికా సట్టా వ్యాపారులు పెద్ద ఎత్తున తమ అదుపులో పెట్టుకుంటారు. ఇది అంతర్జాతీయంగా ప్రభావం చూపుతుంది. అమెరికాలోని 70 శాతం ప్రధాన పంటలు విదేశీ మార్కెట్లకు ఎగుమతులు అయ్యేవే. ప్రతిరక్షణ నిధుల (హెడ్జ్‌ఫండ్స్) వంటి వివిధ సట్టా వ్యాపార సాధనాలు పెద్ద మొత్తంలో మార్కెట్లలో చోటు చేసుకుంటుండటంతో అమెరికా నిత్యావసరాల ముందస్తు వ్యాపార కమిటీ ధరల అదుపుకు ఈ అస్థిర మార్కెట్‌లో జోక్యం చేసుకుంది. ముందస్తు వ్యాపార కార్యకలాపాలకు, నగదు మార్కెట్ ధరలకు మధ్య సమన్వయం లేకపోవడంవల్ల వ్యవసాయ నిత్యావసర ధరలు పెరుగుతున్నాయని అమెరికా వ్యవసాయ శాఖ సమాఖ్య అధ్యక్షుడు ఆరోపించాడు. పెద్ద సట్టా వ్యాపారులకు నిత్యావసర సరుకుల అమ్మకాలు కొనుగోళ్లకంటే ధరల పెరుగుదలతో వచ్చే లాభాల మీదనే శ్రద్ధ ఎక్కువ. భారతదేశంలో టోకు, రిటైల్ అమ్మకాలపై ముందస్తు వ్యాపార ప్రభావాన్ని అధ్యయనం చేయడానికి అభిజిత్‌సేన్ కమిటీ ఏర్పాటైంది. భౌతిక, తక్షణ మార్కెట్లు ముందస్తు మార్కెట్లతో చెట్టాపట్టాలేసుకుని వ్యాపార లావాదేవీలు సాగిస్తున్నాయని సూచనలున్నప్పటికీ, ఈ కమిటీ ప్రశ్నల్ని దాటవేసింది.

ఆహార పదార్థాల మీద సట్టా వ్యాపారం ప్రభావం పెద్ద ఎత్తున వుంటున్నప్పటికీ నిత్యావసర సరుకుల ముందస్తు వ్యాపారాన్ని భారత ప్రభుత్వం అనుమతిస్తున్నది. ఎటువంటి పరిమితులు లేకుండా రైతుల నుంచి నేరుగా ఆహార ధాన్యాలను కొనుగోలు చేయటం, నిల్వ చేయటానికి పెద్ద పెద్ద విదేశీ, స్వదేశీ కార్పోరేట్ సంస్థలకు అనుమతినివ్వటం, వ్యవసాయ సరుకుల ముందస్తు వ్యాపారం వల్ల ఆహార ధాన్యాలను ముందస్తుగా తక్కువ ధరలకు కొనివేసి, పెద్ద ఎత్తున నిల్వ చేసుకోవడానికి అనుకూలత కల్పిస్తున్నది. ఈ ముందస్తు వ్యాపారం ఆహార ధాన్యాలను పెద్ద ఎత్తున అక్రమ నిల్వలు చేయడంలో కార్పోరేట్ సంస్థల్ని ప్రోత్సహిస్తున్నది. నిత్యావసర సరుకుల ముందస్తు వ్యాపారాన్ని తక్షణం నిషేధించాల్సిన అవసరముంది. ఆహార ధాన్యాల లభ్యత, ఉత్పత్తి కొరత వల్లనే ఆహార సంక్షోభం ఏర్పడుతున్నదని వివిధ ప్రభుత్వాలు, కార్పోరేట్ సంస్థలు పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయి.

భారతదేశంలో ద్రవ్యోల్బణం ఇప్పటికే రెండంకెలకు చేరింది.

రిటైల్ మార్కెట్లల్లో పెరిగిన ధరలతో చూస్తే ఇది అనేకరెట్లు ఎక్కువ. రిజర్వ్ బ్యాంక్ ద్రవ్యోల్బణాన్ని నిరోధించటంలో విఫలమైంది. బహుళజాతి సంస్థలు, దేశీయ కార్పోరేట్ సంస్థలు పెద్ద ఎత్తున ఆహార ధాన్యాలను అక్రమంగా నిల్వచేయడానికి వ్యతిరేకంగా ప్రజలు పోరాటాలు చేసి, వాటిని బయటికి తీసుకొచ్చేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాల్సిన అవసరముంది. కనీసం 14 నిత్యావసర సరుకులను దేశమంతటా ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారానే పంపిణీ చేయడాన్ని సర్వసాధారణం చేయాలి. బలహీనమైన ప్రజాపంపిణీ వ్యవస్థ ఇప్పటికే పతనావస్థకు చేరి, పేదల బతుకులు ఆపదలో చిక్కుకున్నాయి. పేద ప్రజానీకం ఆకలితో నకనకలాడుతుండగానే 2001-04 సంవత్సరాల మధ్య కాలంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ధరకంటే తక్కువకే పెద్ద ఎత్తున ఆహార ధాన్యాల ఎగుమతి జరిగింది. ప్రజాపంపిణీ వ్యవస్థ పెద్ద ఎత్తున అవినీతికి ఆలవాలమైంది. దీనికి వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్ ప్రజలు పెద్ద ఎత్తున తిరగబడ్డారు. 24 శాతానికి పైగా చౌక దుకాణాలు పెట్టుబడి మీద 12 శాతం ఆదాయం సంపాదిస్తున్నాయి. ఇది ఆహార ధాన్యాలను దారి మళ్లించటాన్ని పెంచుతుంది. స్వదేశీ, విదేశీ కార్పోరేట్ సంస్థలు గ్రామీణ ప్రాంతాల్లో సరఫరా, రిటైల్ వ్యాపారంలోకి చొరబడటంతో రైతులు, చిన్నవ్యాపారులపై తీవ్రమైన దెబ్బపడింది. ధరల పెరుగుదలతో పేద ప్రజలు తీవ్రమైన ఆకలి బాధ నెదుర్కొంటుంటే ఈ కంపెనీలు యాభైవేల టన్నుల ఆహార ధాన్యాలు నిల్వ చేయటానికి అనుమతులు, బ్యాంకులు నుండి అప్పులు పొంది పేద ప్రజల్ని పీల్చి పిప్పి చేస్తున్నాయి. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని యు.పి.ఎ. ప్రభుత్వం గోధుమకు కనీస మద్దతు ధర (ఎం.ఎస్.పి)ను పెంచి, 15 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాల సేకరణకు గాను, 21 మిలియన్ టన్నులు సేకరించింది. అయితే లక్షలాది ప్రజలు తిండిలేక ఎండుతుంటే, హర్యానాలో సేకరించిన ధాన్యం సరైన నిల్వ సౌకర్యం లేక, ఆరుబయట నిల్వచేయగా వర్షానికి నాశనమైపోయే స్థితిలో వుంది. భారత ప్రభుత్వం ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేందుకు కంటితుడుపు చర్యలు చేపడుతున్నదిగాని, ప్రజల కొనుగోలు శక్తిని పెంచడానికి, ఉద్యోగ భద్రత కల్పించడానికి, ఆహార ధాన్యాల సట్టా వ్యాపారుల్ని పూర్తిగా నిషేధించి, ఎగుమతులు ఆపేందుకు ప్రయత్నాలేమీ చేయటం లేదు. 600 ఎస్.ఇ.జడ్.లు ఇప్పటికే అనుమతి పొంది, వేలాది ఎకరాల వ్యవసాయ భూముల్ని కబళించనున్నాయి. ప్రస్తుత పరిస్థితి ఆహార పదార్థాలను మింగేసే జీవ -ఇంధనోత్పత్తిని నిలిపివేసి, భూ సంస్కరణలు చేపట్టి, వ్యవసాయంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ప్రవేశాన్ని ఆపవలసిన అవసరాన్ని డిమాండు చేస్తున్నది. నేల సారాన్ని కోలుకోలేనంతగా దెబ్బతీసే రసాయనిక ఎరువులు, పురుగు మందులు మొదలైన వాటి వినియోగానికి వ్యతిరేకంగా మనం బలమైన ఉద్యమాన్ని అభివృద్ధి చేయవలసిన సమయమిది. ఆహారోత్పత్తి కొరతతోపాటు ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోవటమనేది ప్రజల ఆకలి బాధలకు కారణమన్నది మరొకసారి గుర్తు చేసుకోవలసి వుంది.

## పరిష్కారం

ఆర్థిక వ్యవస్థకు మార్కెట్ ముఖ్య సాధనమైతే, పెరిగే ధరలు ముఖ్యంగా రైతుల బతుకుదెరువును బాగుపరుస్తాయని (మంచి గిట్టుబాటు ధరలు లభిస్తాయని) బూర్జువా ఆర్థిక వేత్తలు ఆరోపిస్తారు. భూస్వాముల్ని రైతులుగా పరిగణించి చేసే ఇటువంటి మార్కెట్ ఆధారిత ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన వాదనలు పాక్షిక వాస్తవాలే. వినియోగం కోసమే ఉత్పత్తి చేసే పేద, సాధారణ రైతులకు ఈ మార్కెట్ ఆధారిత సూత్రాలు వర్తించవు. పైగా ఉత్పాదకాల (విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు మొదలైనవి) ధరల పెరుగుదల భారం వీరిపైనే పడుతుంది. దీనికితోడు, ఆహార ధరల పెరుగుదల ప్రయోజనం వ్యాపారులకేగాని, ఉత్పత్తిదారులకు కాదు.

కార్పోరేట్ సంస్థలు భారతదేశం, ఇతర దేశాల్లో వేలాది ఎకరాల భూములు సంపాదించాయి. భారతదేశంలో టాటాలు, ఇతర దేశీయ కార్పోరేట్ సంస్థలు ఇప్పటికే విస్తృతంగా భూములు సంపాదించాయి. బ్రెజిల్‌లో టెక్సాస్‌కు చెందిన అంతర్జాతీయ పారిశ్రామిక కార్పోరేట్ సంస్థ కార్పోరేట్ వ్యవసాయం కోసం 34 వేల ఎకరాల భూమిని సంపాదించింది. న్యూజిలాండ్‌కు చెందిన సంస్థ ఉరుగ్వేలో పాడి పరిశ్రమ వ్యాపారం కోసం లక్ష ఎకరాల భూమి సంపాదించింది. లాటిన్ అమెరికాలో, మూడవ ప్రపంచ దేశాల్లో ముఖ్యంగా అమెరికా సంస్థలతోపాటు, ఇతర సంస్థలు కలిసి వ్యవయసాయ వ్యాపారం కొరకు వందల కిలోమీటర్ల భూమిని ఆక్రమించాయి. ఇది ఆహార అభద్రతకు దారితీస్తున్నది. అమెజాన్‌కు చెందిన నాబల్ భూభాగంలో పెట్టుబడిదారీ వ్యవసాయం కోసం 1250 చదరపు మైళ్ల అడవిని నరికి వేశారు.

1970-90ల మధ్య కాలంలో ప్రపంచంలో 12 లక్షల హెక్టార్ల (25 లక్షల ఎకరాలు)కుపైగా భూమి ఎడారిగా మారింది. భూమి పై పొరలోని 5 లక్షల టన్నుల సారవంతమైన మట్టి సారవిహీనమైపోయింది. దీనికంతటికి అడ్డుకట్టు వేయాలి. జీవ-ఇంధనోత్పత్తికి ఆహార ధాన్యాలను ఉపయోగించడానికి వ్యతిరేకంగా ప్రజలందరూ పోరాడాలి. కానీ, ప్రపంచ పేద ప్రజలకు నిరంతర ఆహారం కొరత, సారవంతమైన భూముల విధ్వంసం, అడవుల, పరిసరాల విధ్వంసం ప్రధానమైన సమస్య. ప్రపంచంలోని సామ్రాజ్యవాదుల మధ్య వున్న బలమైన సంబంధాలను, ఇంకా అన్ని విధాల మోయలేని భారాన్ని ప్రజల మూపులపై నుండి తొలగించి, వాటిని ప్రజా విప్లవం ద్వారా ధ్వంసం చేసినపుడే ప్రజల ఆహార కొరత శాశ్వతంగా పరిష్కారమవుతుంది. ★

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఫాసిస్టు నిర్బంధాన్ని ప్రతిఘటిస్తున్న పి.ఎల్.జి.ఎ.

ఈ మధ్యకాలంలో నిర్బంధం-ప్రతిఘటనకు సంబంధించిన పలు ఘటనలు దేశవ్యాప్తంగా చోటు చేసుకున్నాయి. ఇందులో ఏప్రిల్ 12-13న ఒడిస్సాలోని దామన్‌జోడి ప్రాంతంలో బాక్సైట్ గనులకు రక్షణగా వున్న సి.ఐ.ఎస్.ఎఫ్. క్యాంపుపై పి.ఎల్.జి.ఎ. చేసిన వీరోచిత దాడి మొదట చెప్పుకోవాల్సినది. పి.ఎల్.జి.ఎ. సాయుధ శక్తిని పెంచుకోవడానికి చేసిన ఈ దాడి 12వ తేదీ సాయంత్రం మొదలై రాత్రంతా హోరా హోరీగా కొనసాగింది. ఇందులో 11 మంది సి.ఐ.ఎస్.ఎఫ్. జవానులు చనిపోగా 9 మంది గాయపడ్డారు. నలుగురు పి.ఎల్.జి.ఎ. యోధులు అమరులయ్యారు. ఆయుధాలూ, మందుగుండు పి.ఎల్.జి.ఎ. స్వాధీనమయ్యాయి. పి.ఎల్.జి.ఎ. శక్తి సమర్థతలను చాటిన ఘటనగా ఈ దాడి చరిత్రలో నిలిచిపోతుంది. గనుల పేరిట ఆదివాసీల సంపదను దోచుకుంటూ వారి జీవితాలను చీకటిమయం చేస్తున్న పాలకవర్గాల విధానానికి ఈ దాడి ఒక చెంపదెబ్బ కూడా. ఈ దాడితో బెంబేలెత్తిన ఆంధ్రా సర్కార్ వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా రెడ్ అలర్ట్ ప్రకటించి తన పిరికితనాన్ని ప్రదర్శించుకుంది. కేంద్ర, పార్లమెంటుకు, ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరుగుతున్న సందర్భంలో ఈ దాడి జరగడంతో ఎన్నికల బహిష్కరణ క్యాంపెయిన్‌కు మంచి ఊపునిచ్చింది.

ఝార్ఖండ్‌లో సీసీ, సీఎంసీ సభ్యుడు అయిన కామ్రేడ్ అశుతోష్ సహా మరికొందరు కామ్రేడ్స్ అరెస్టుకు నిరసనగా బీహార్-ఝార్ఖండ్, ఒడిస్సా, పశ్చిమ బెంగాల్‌లలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు జరిగాయి. మూడు రాష్ట్రాల్లో ఫిబ్రవరి 28న బంద్ జరిగింది. ఈ సందర్భంగా పలు రైల్వే స్టేషన్లపై దాడులు జరిగాయి. రైలు పట్టాల విధ్వంసం జరిగింది.

ఏప్రిల్ 7న గడ్‌చిరోలి డివిజన్‌లోని ముగ్గులేర్ ప్రాంతంలో పి.ఎల్.జి.ఎ. చేసిన ఆంబుష్‌లో ముగ్గురు పోలీసులు చనిపోయారు, ఆరుగురు గాయపడ్డారు. ఇదేరోజు పశ్చిమ బస్తర్‌లో జరిగిన ఆంబుష్‌లో ఇద్దరు పోలీసులు చనిపోయారు. నలుగురు గాయపడ్డారు. ఏప్రిల్ 10న దక్షిణ బస్తర్ డివిజన్‌లోని చింతగుప్ప వద్ద చేసిన సాహసోపేత ఆంబుష్‌లో ఒక డిప్యూటీ కమాండెంట్ సహా 10 మంది పోలీసులు చనిపోయారు. మరో 10 మంది గాయపడ్డారు. ఇందులో మన కామ్రేడ్స్ నల్గురు వీరోచితంగా పోరాడుతూ అమరులయ్యారు. బీహార్-ఝార్ఖండ్‌లో ఇద్దరు ఎస్.జడ్.సి.ఎం.ల ఎన్‌కౌంటర్‌కు నిరసనగా ఏప్రిల్ 11న బంద్ జరిగింది. ఈ సందర్భంగా పెట్రోలింగ్‌కు వచ్చిన పోలీసులపై పి.ఎల్.జి.ఎ. చేసిన ఆంబుష్‌లో ఐదుగురు జవానులు చనిపోయారు. ఇద్దరు గాయపడ్డారు. ఇదేరోజు బీజాపూర్ జిల్లాలో ప్రెజర్ బాంబు పేలి ఇద్దరు జవాన్లు, ఒక పౌరుడు చనిపోయాడు.

ఈ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కూడా డీకే, బీహార్-ఝార్ఖండ్, ఎ.ఒ.బి.లలో చెప్పుకోదగిన ప్రతిఘటన జరిగింది.

ఏప్రిల్ 9న మల్కన్‌గిరి జిల్లాలో అభ్యర్థిని ఖతం చేయడంతో ఎన్నిక వాయిదా పడింది. ఏప్రిల్ 15న దంతెవాడలో జరిగిన కాల్పుల్లో ఒక జవాను, ఒక పౌరుడు చనిపోయారు. నారాయణపూర్‌లో జరిగిన కాల్పుల్లో ఇద్దరు జవాన్లు చనిపోయారు. బీహార్లో బి.ఎస్.ఎఫ్. క్యాంపుపై పి.ఎల్.జి.ఎ. దాడి చేసింది. ఇందులో 7గురు పి.ఎల్.జి.ఎ. కామ్రేడ్స్ అమరులయినట్టు వార్తల్లో వచ్చింది. అలాగే ఝార్ఖండ్‌లో జరిగిన ఆంబుష్‌లో 15 మంది జవాన్లు గాయపడ్డారు. ఈ ఘటనలో కూడా 5గురు పి.ఎల్.జి.ఎ. కామ్రేడ్స్ అమరులయినట్టు వార్తల్లో వచ్చింది. ఏప్రిల్ 16న ఎన్నికల రోజు జరిగిన ప్రతిఘటనలో దంతెవాడలో ఇద్దరు పోలీసులు చనిపోయారు. నారాయణపూర్‌లో ఒక బి.ఎస్.ఎఫ్. జవాను గాయపడ్డాడు. ఝార్ఖండ్‌లో 5 గురు, బీహార్లో ఇద్దరు జవాన్లు చనిపోయారు. గడిచిరోలి డివిజన్‌లోనూ ఒక చోట పోలీసులతో కాల్పులు జరిగాయి. రాజ్‌నంద్‌గావ్ జిల్లాలోని పిట్టెమెట్ట గ్రామంలో పి.ఎల్.జి.ఎ. కామ్రేడ్స్ పోలింగ్ సిబ్బందిని కొద్దిసేపు అరెస్ట్ చేసి ఓటింగ్ మిషన్లను ధ్వంసం చేశారు. మదన్‌వేడ గ్రామంలో రాత్రి బసచేసిన పోలీసులపై కాల్పులు జరిపారు. ఎన్నికలు ముగించుకొని తిరిగి వస్తున్న బలగాలపై ముచ్చర్-రేతె గ్రామాల మధ్య ఆంబుష్ చేశారు. తర్వాత ఇరుపక్షాల మధ్య ఒక గంటసేపు కాల్పులు జరిగాయి. ఇలా మొత్తంగా డీకేలో ఎన్నికల సందర్భంగా 20 చోట్ల శత్రు బలగాలకూ పి.ఎల్.జి.ఎ.కూ నడుమ కాల్పులు జరిగాయి. 23 చోట్ల ఓటింగ్ యంత్రాలను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా రాజ్‌నంద్‌గావ్ జిల్లాలో ఒక విషాదం చోటుచేసుకుంది. జిల్లాలోని కమ్కనూర్ గ్రామం వద్ద పోలీసు జీపని భావించి ఎన్నికల యంత్రాంగం ప్రయాణిస్తున్న జీపును పి.ఎల్.జి.ఎ. పేల్చివేయడంతో 6గురు ప్రభుత్వోద్యోగులు దుర్మరణం పాలయ్యారు. ఒకరు గాయపడ్డారు. వీళ్లలో ఇద్దరు అటవీశాఖ ఉద్యోగులు కాగా, మిగితా వాళ్లంతా ఉపాధ్యాయులు. మల్కన్‌గిరి జిల్లాలోని కలిమెల ఏరియాలో పి.ఎల్.జి.ఎ. మూడుచోట్ల ఎన్నికల బూత్‌ల మీద దాడి చేయడంతో పోలింగ్

***(మిగితాది 43వ పేజీలో...)***

రెక్టిఫికేషన్ క్యాంపెయిన్‌లో భాగంగా అధ్యయనం కోసం - 3

# ఫిలిప్పైన్స్ పార్టీ ను రెండవ గొప్ప దిద్దుబాటు ఉ వీఐక్యూలో

విజ్‌కాయ్-ఇసాబెలా-క్యూరినో (వీఐక్యూ) ప్రాంతంలోని ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టు పార్టీ, నూతన ప్రజాసైన్యం శ్రేణులూ, సభ్యులూ రెండవ గొప్ప దిద్దుబాటు ఉద్యమాన్ని లోతుగా ముందుకు తీసుకువెళ్లి, దానిని కొనసాగించాలి. తీవ్రమైన పెడధోరణులు, తప్పుల మూలంగా విపరీతమైన నష్టాలు జరిగినప్పటికీ ఇంకా సమూలంగా విప్లవోద్యమం నిర్మూలించబడకుండా ఉండడానికై మనం దానిని అంటిపెట్టుకొని వుండడం నిర్ణయాత్మకమైనది అవుతుంది. అలాగే ఈ ప్రాంతంలో పార్టీనీ, ప్రజాసైన్యాన్నీ, ప్రజా ఉద్యమాన్నీ తిరిగి బలోపేతం చేయడానికి కూడా అది ఒక నిర్ణయాత్మకమైనదే అవుతుంది.

తప్పుడు పార్టీ పంథా, అపరిపక్వ క్రమబద్ధీకరణా, సార్వత్రిక తిరుగుబాటువాదం పార్టీనీ, సైన్యాన్నీ, ప్రజా ఉద్యమాన్నీ పెద్దెత్తున బలహీనపరిచి శత్రు దాడుల నుండి రక్షణ లేకుండా చేశాయి. మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానం మార్గదర్శకత్వంలో చేపట్టిన రెండవ గొప్ప దిద్దుబాటు ఉద్యమం విప్లవోద్యమాన్ని మరింత నష్టపోకుండా కాపాడింది. ఈ ప్రాంతంలో ప్రముఖ రూపాలలో వున్న తీవ్ర పెడధోరణులనూ, తప్పులనూ ఈ ఉద్యమాన్ని చేపట్టడం ద్వారా మనం గుర్తించి విమర్శిస్తూ సరిదిద్దుకోగలిగాం. ప్రాథమిక స్థాయిలో పనిని తిరిగి గట్టిపర్చే క్రమంలో పార్టీ, సైన్యం నిజాయితీతో కొనసాగిస్తున్న దృఢమైన ప్రయత్నాలనూ, విమర్శ-ఆత్మవిమర్శను ప్రజలు స్వాగతించారు. గత అమెరికా-మార్కోస్, అమెరికా-అక్వినో ప్రభుత్వాలలాగే ప్రస్తుత అమెరికా-రామోస్ ప్రభుత్వాన్ని కూడా విప్లవోద్యమాన్ని అణచడంలో విఫలం చేసిన దిద్దుబాటు ఉద్యమానికి ధన్యవాదాలు. జనతా ప్రజాస్వామిక విప్లవం నిలదొక్కుకొని పటిష్టమవుతూ పురోగమించడానికి అన్ని విధాలా కావాల్సిన అవసరాల పరిపూర్తికి పాటుపడుదాం.

ప్రపంచ పెట్టుబడారీ విధాన సాధారణ సంక్షోభంలో భాగంగా మరింత దిగబడిపోతున్న అర్ధ వలస - అర్ధ భూస్వామ్య వ్యవస్థ సంక్షోభం మధ్య జనతా ప్రజాస్వామిక విప్లవాన్ని పురోగమింపచేయడానికి ప్రజలను పోరాటాలలోకి సమర్థవంతంగా పార్టీ నడిపించడానికి విప్లవ పురోగమనానికి దిద్దుబాటు ఉద్యమం హామీనిస్తుంది. సాయుధ విప్లవాన్ని నూతన, ఉన్నత దశకు తీసుకెళ్లడానికి పరిస్థితులు సానుకూలంగా వున్నాయి.

### పురోగమనం, తప్పులూ, నష్టాలు

1969లో ఉత్తర లూజాన్‌లో మొదలైన సాయుధ విప్లవం పార్టీ కేంద్ర నాయకత్వ నిర్దేశకత్వం కింద సాగిన మొదటి గొప్ప దిద్దుబాటు ఉద్యమ సందర్భంగా త్వరితగతిని పురోగమించింది. ఇసాబెలాలో దాదాపు వంద బారియో ఆర్గనైజింగ్ కమిటీలనూ, బారియో విప్లవ కమిటీలను సుమారు 1 లక్షా 50 వేల జనాభా గల ప్రాంతంలో నిర్మించగలిగాం. భూస్వామ్య వ్యతిరేక పోరాటాల ద్వారా పశువుల దొంగలను, ఇన్ఫార్మర్లను, దుష్ట శక్తులను అణచివేసి ప్రజలు లాభపడ్డారు.

ఈ ప్రాంతంలో పెంపొందుతున్న విప్లవోద్యమాన్ని ఒక్క దెబ్బతో మొగ్గలోనే తుంచివేయడానికి 1972 తర్వాత ఫిలిప్పైన్ సాయుధ బలగాలు విశాల ప్రాంతంలో చాలా కాలం వరకు కొనసాగించిన "చుట్టిముట్టి అణచివేత" కేంపెయిన్‌లో ఇసాబెలా ప్రాంతం నుండి 50 వేలకు పైగా ప్రజలను బలవంతంగా ఖాళీ చేయించడాన్ని కూడా జోడించారు. ఇలాంటి పరిస్థితుల్లో నూతన ప్రజాసైన్యానికి (ఎన్.పి.ఎ.) చెందిన కంపెనీలు నిర్మానుష్యమై, పెద్దఎత్తున శత్రు బలగాలు మోహరించబడి ఉన్న అటవీ ప్రాంతాన్నే తమకు సురక్షితం అని భావించి అంటిపెట్టుకొని ఉన్నారు. ఈ ప్రాంతంలోనే ప్రజలు, విప్లవోద్యమానికి మరింత అనుకూల పరిస్థితులున్నచోటికి తరలి వెళ్లడానికి సిద్ధపడలేదు. ఈ తప్పు మూలంగా పార్టీ, సైన్యం 70 శాతం పైగా బలహీనపడింది.

1977లో కేంద్ర నాయకత్వ గైడెన్స్‌లో ఈశాన్య లూజాన్‌లో

# ండి నేర్చుకుందాం
# ద్యమాన్ని మరింత లోతుగా
# కొనసాగిద్దాం!

పార్టీ ప్రాంతీయ మహాసభను జయప్రదం చేసుకొంది. ఎనిమిది సంవత్సరాల అనుభవాన్ని సమీక్షించిన మహాసభ ఛైర్మన్ అమాడో గురెరో ఇచ్చిన సందేశాల వాస్తవాలను గ్రహించింది. “నిర్మానుష్యమైన ప్రాంతాలను అంటిపెట్టుకొని ఉండడం మూర్ఖమైన పని. బేస్ ఏరియాలను నిర్మించడం అంటే ప్రాథమికంగా ప్రజలు వున్న ప్రాంతాల్లోనే నిర్మించడం అవుతుందిగానీ, అందుకు భిన్నంగా ప్రజలు లేని భౌగోళిక ప్రాంతాల్లోగాదు. మాస్‌వర్క్‌కు తోడ్పడని మిలటరీ చర్యలు నిర్మానుష్యమైన చోట కొనసాగించడం అంటే దుస్సాహసికవాదంతో కూడుకున్న తిరుగుబోతు దళాలు చేసే చర్యలే అవుతాయి.”

ఆయన ఇచ్చిన సందేశంలోని పిలుపులను అనుసరించి అలాగే మనం నిర్వచించుకున్న ‘మన తక్షణ కర్తవ్యాలు’లోని ప్రాథమిక సూత్రాలూ, కార్యాచరణ గైడెన్స్‌తోపాటు ‘మన ప్రజాయుద్ధ విశిష్ట లక్షణాలు’ ఇతర డాక్యుమెంట్లలో రాసుకున్న దాని ప్రకారం నూతనంగా విప్లవ కర్తవ్యాలను ముందుకు తీసుకుపోయాం. విప్లవ ప్రాంతాన్ని కొండ ప్రాంతాల్లోకి, మైదానాల్లోకి, లోపలి ప్రాంతాలు, ప్రధాన రహదారుల వెంట, అలాగే విశాల పశుపెంపక క్షేత్రాలు, చివరకు సరిహద్దుల వరకూ విస్తరించాం. సాపేక్షికంగా సంఘటితమైన గెరిల్లా జోన్‌లలోలాగా కాకుండా నూతన ప్రాంతాలలో వ్యవసాయ విప్లవ కనీస లక్ష్యాలను చేపట్టాం. పేదలూ, దిగువ మధ్యతరగతి రైతాంగం మధ్య, పరస్పర సహాయం, సహకారంతోపాటు భూస్వామ్య వ్యతిరేక పోరాటాలను పెంపొందించాలి.

పట్టణ కేంద్రాలలో చట్టబద్ద ప్రజా ఆందోళనను అభివృద్ధి చేయడం ద్వారా గ్రామీణ ప్రాంతంలోని గెరిల్లా జోన్‌లనూ మన బలగాలనూ విస్తరింపచేసుకొని సంఘటితం చేసుకోవడం ప్రత్యక్షంగా, పరోక్షంగా సులువైంది.

అన్ని యూనిట్లకూ మాస్‌వర్క్ అప్పగించాం. అయితే 1980 ప్రారంభంలో సోకాల్డ్ పరివర్తన కార్యక్రమం కింద పార్టీ యంత్రాంగం నుంచి మాస్ నెట్‌వర్క్‌ను సైనిక పనులు అప్పగించిన యంత్రాంగం నుంచి విడగొట్టాం. ప్రజాయుద్ధం యొక్క ఉపదశ-ఎస్.సి.ఒ.కు కావాల్సిన సన్నాహాలు చేసుకోవటం-ప్రధాన ఉద్దేశ్యంలో భాగంగా గెరిల్లా యూనిట్లను నిర్మించి వాటికి పూర్తిగా సైనిక పని అప్పగించాం. ఇప్పుడు పూర్తిగా సైనిక పనులే చేపట్టిన యూనిట్లకంటే అప్పుడు మాస్‌వర్క్ చేస్తుండిన యూనిట్లు ఎక్కువ సైనిక పనులు చేశాయి. పెడధోరణిలో భాగంగా ఏర్పడిన తర్వాతి యూనిట్లు చేపట్టిన సైనిక చర్యలు ఎంత దూరం వెళ్లాయంటే కొన్ని మున్సిపాలిటీలలో మాస్‌వర్క్‌కు నష్టం కలిగిస్తూ అక్కడ దానిని కొనసాగించడమే కష్టంగా తయారైంది. ఇసాబెలాలోని ఉత్తర జిల్లాల మున్సిపాలిటీలలో గెరిల్లా బేస్‌లకూ గెరిల్లా జోన్‌లకూ మధ్య అడ్డుగోడలుగా నిల్చిన శత్రు క్యాంపులను సైనిక చర్యల ద్వారా తరిమేసే అవగాహనను 1982లో అమలుచేశాం. అతి జాగ్రత్తగా మాస్‌వర్క్ విస్తరించాల్సిన తుమాయి లాంటి సమస్యాత్మక పట్టణాలలో ఎత్తుగడల ఎదురుదాడుల ద్వారా విస్తరించవచ్చనే నమ్మకాలుండేవి.

తీవ్రం చేసిన ఎత్తుగడల ఎదురుదాడులకూ, ఫాసిస్టు వ్యతిరేక ప్రజా నిరసన చర్యలకు వ్యతిరేకంగా శత్రువు ఎక్కుపెట్టిన దాడుల ఫలితంగా ఉత్తర జిల్లాలు వదలిపెట్టాల్సి వచ్చింది. సంఘటితమైన చిన్న ప్రాంతాలు ఎక్కడైతే ఎత్తుగడల ఎదురుదాడులు కొనసాగించాయో, అలాగే ప్రజలు నిరసన ర్యాలీలు జయప్రదంగా నిర్వహించారో అవి శత్రువుకు టార్గెట్లుగా వారి వేరుచేయబడినాయి. హసిఎన్‌డా సాన్ ఆన్‌టోనియా కూడా వదలాల్సి వచ్చింది. పునాది వర్గాల ప్రజలను బలమైన శక్తిగా మలచడాన్ని నిర్లక్ష్యం చేశాం. విశాల ప్రజాసమీకరణ ద్వారా అలాగే ప్రజాపోరాటాల నుంచి హసిఎన్‌డా దాని చుట్టుపక్కల ఉన్న మల్లిగ్ ప్రాంతంలో సార్వత్రిక తిరుగుబాటును రగిలించవచ్చనీ ప్రావిన్షియల్ పార్టీ కమిటీకి బలంగా ఉండింది. దానితో యావత్తు విప్లవ

బలగాలను తప్పులతో కూడిన ఎస్.సి.ఒ. లైన్‌ను మరింత పటిష్టం చేసేలా కదిలించాం.

1984-86 మధ్య త్వరిగతిని విస్తరించాం. "మన తక్షణ కర్తవ్యాలు'' అనుసరించి గెరిల్లా జోన్‌లను ప్రారంభించడం, విస్తరించడం, పటిష్టపర్చడంపై ఆధారపడి సాధించిన తొలి విజయాల ద్వారా అది సాధ్యమయింది. దేశంలో అత్యంత సానుకూలంగా వున్న రాజకీయ పరిస్థితులు అనే అదనపు అంశం కూడా అందుకు తోడయింది. అయితే, చట్టబద్ధ జాతీయ రైతు ఐక్య సంఘటన సృష్టించిన సానుకూల పరిస్థితులలో గెరిల్లా యూనిట్లూ, పాక్షిక కార్యకర్తలు అందరూ కలిసి పెద్దఎత్తున ఆర్గనైజేషన్ పనిపై కేంద్రీకరించడం, ప్రజలను కేంపెయిన్‌లకూ, ప్రదర్శనలకూ కదలించడం ద్వారానే వేగంగా జరిగిన విస్తరణలోని అధిక భాగం పూర్తయింది. రిక్రూట్‌మెంట్ చాలా వరకు ప్రమాణాల ప్రకారం జరగలేదు.

బారియోల సంఖ్య పెరిగి రాష్ట్ర రాజధాని నుంచి మనీలా (దేశ రాజధాని) వరకు ప్రజలను ప్రదర్శనలకు కదిలించగలిగాం. శత్రువు నుంచి ఆయుధాలు స్వాధీనం చేసుకోవడం పెరిగింది. ఇవి పురోగమనానికి అతి ముఖ్యమైన సాధనంగా ఉపయోగపడినాయి. ఇవన్నీ "నూతన ఎత్తుగడలు, పద్ధతులు, ఆదేశాలు'' ఫలితమే. ఇవి ఫాసిస్టు వ్యతిరేక ప్రజా చైతన్యాన్ని కొంత పెంచడానికి ప్రోత్సహించినప్పటికీ ఫిలిప్పైన్స్ విప్లవోద్యమ స్వభావాన్ననుసరించి రెండు దశలకు (నూతన ప్రజాస్వామిక విప్లవం, సోషలిస్టు విప్లవం-అను) తగిన విధంగా బలమైన ఆర్గనైజేషన్‌నూ, ప్రజల చైతన్యాన్ని శ్రమపడి పెంచడాన్ని నిర్లక్ష్యం చేసింది. సైన్యంలో పార్టీ నాయకత్వాన్ని చాలా ముందునుంచే ఏర్పర్చుకోకపోవడంతో అది బలహీనపడింది.

"స్థానిక వ్యూహం'' అనే దాన్ని ఎత్తిపట్టడం ద్వారా తప్పుడు అవగాహన మరింత దిగజారింది. 1987-88లో దేశంలోని మిగతా ప్రాంతాలకన్నా ముందుగానే విజ్‌కాయ్ - క్యురినోలో "వ్యూహాత్మక ప్రతిష్టంభన''ను పొందడానికి ఈ "స్థానిక వ్యూహం'' దొరికింది. ఇసాబెలాలో అమలు చేసిన "కాక్ చెయ్యి, ఏయిమ్ చెయ్యి - కాల్చేయ్'' పద్ధతులు, సైనిక అభియాన్‌లు, సైనిక ప్రతి-అభియాన్‌లు 1986-89 కాలంలో జరిగినవన్నీ సైనిక దుస్సాహసికవాదాన్నీ, సార్వత్రిక తిరుగుబాటువాదాన్నీ ఉద్దేశపూర్వకంగానే దిగజార్చాయి. దేశవ్యాప్తంగా మూడేళ్లలో ఎస్.సి.ఒ.ను అడ్వాన్స్ చేసే లక్ష్యంతో ఇవి జరిగాయి.

శత్రువు నుండి స్వాధీనం చేసుకున్న ఆయుధాల సంఖ్య, యుద్ధ ఎత్తుగడలు, టెక్నిక్కులు మెరుగైన ఫలితంగా శత్రువుకు నష్టాలు పెరిగిన మాట నిజమే. అయితే, అదే సమయంలో మహాచెడ్డ సైనిక దుస్సాహసికవాదం, కమాండిజం మూలంగా సైన్యానికి, ప్రజలకూ మధ్య సంబంధాలు, సఖ్యత బలహీనపడ్డాయి. సైనికులకూ, అధికారులకూ మధ్య చీలికలు పెరిగాయి. ఇతర కర్తవ్యాలను పట్టించుకోకుండా, రాజకీయ అవసరాల నుంచి చేపట్టిన వాటిపై ఏమాత్రం శ్రద్ధ పెట్టకుండా చేసిన యుద్ధాలు ప్రజాపునాదిని బలంగా దెబ్బతీసినా ప్రజా వుద్యమాన్ని పెంచాయి.

విప్లవ ప్రతీఘాతుక ప్రభుత్వం నుంచి, వర్తకులూ-వడ్డీ వ్యాపారస్థుల నుంచి ధరల నిర్ణయంలో సంస్కరణ పద్ధతులను, వ్యవసాయ పంటలకు గిట్టుబాటు ధరలను, ఎరువులు-క్రిమి సంహారక మందులు-నీటిపారుదల సౌకర్యాలనూ డిమాండ్ చేస్తూ రైతాంగ ఉద్యమం అత్యధికంగా బహిరంగ ప్రదర్శనలను చేపడుతూ కన్‌సాలిడేషన్‌ను వదిలేసిన ఫలితంగా సాయుధ విప్లవానికి బలాన్ని చేకూర్చే వ్యవసాయ విప్లవాన్ని ముందుకు తీసుకువెళ్లే కర్తవ్యాల నుంచి మరింతగా దూరమయ్యాం.

చివరకు 'తెల్ల ప్రాంతాల' పని కూడా ప్రాంతీయ కమిటీ నాయకత్వం నుంచి దూరమైంది. చర్చికి సంబంధించిన వాళ్లలో కూడా అంతర్గత ప్రశ్నలు పెరిగిపోయి వాళ్లు ముందు బలంగా సమర్థిస్తూ పాల్గొంటూ వచ్చిన పునాది వర్గాల ప్రజాపోరాటాల నుంచి దూరమయ్యారు. నగరాల్లో, పట్టణ కేంద్రాలలో "విలక్షణ గతిశీలత'' అవగాహనతో తెల్ల ప్రాంతాల అవసరాల కోసం మాత్రమే శక్తులను సమీకరించారు కానీ గ్రామీణ సాయుధ విప్లవం కోసం కాదు.

పట్టణ పోరాటాలకు సైతం పెద్దెత్తున శక్తులను సమీకరించగలిగే సామర్థ్యాన్ని సంస్కరణవాద జనాకర్షణవాదం, లీగలిజం, స్వచ్ఛంద సంస్థలవాదం, సైద్ధాంతిక-రాజకీయ, నిర్మాణ రంగాల పటిష్టతపట్ల నిర్లక్ష్యం, బూర్జువా వ్యక్తివాదంలో తలెత్తిన ధోరణులు, భూస్వామ్య భావజాల ప్రభావం వ్యాపిస్తున్న రక రకాల తప్పుడు అవగాహనలూ, బలహీనతల మూలంగా దీర్ఘకాలంలో ప్రజాపునాదిని కోల్పోయే వైపుకు నెట్టబడ్డాం.

విప్లవ శక్తులు "సైనిక'', "రాజకీయ'' పోరాటాలను తీవ్రం చేశాయి. సైనిక దుస్సాహసికవాద సార్వత్రిక తిరుగుబాటువాదం ద్వారా 'స్థానిక స్థబ్దత'ను సాధించవచ్చునే సాహసిక భ్రమలను సాకారం చేయడానికై విపరీతంగా శక్తులన్నింటినీ వెచ్చించాం. చివరకు సంస్కరణవాదం, లీగలిజం ప్రజా ఆందోళనను కూడా తక్కువ చేసి చూసింది. 1982 నుంచి శత్రువు అమలుచేసిన "సంపూర్ణ యుద్ధం'', "క్రమంగా నిర్మాణం'' అనే వ్యూహం, ఎత్తుగడల ఫలితంగా ఈ ప్రాంతంలో విప్లవ శక్తులకు చాలా వరకు రక్షణ లేకుండా పోయింది. 1977కు ముందు ఒక దశాబ్దకాలం

కూడగట్టుకున్న బలాన్ని 1987-89 మధ్య గణనీయంగా కోల్పోయాం.

పరిస్థితులు మరింత దిగజారిపోతూండడంతో అసహాయ స్థితిలో ఉండి నష్టాలు అరికట్టలేకపోవడంతో 1989లో విప్లవ శక్తులు ఇంకా ఎక్కువగా గందరగోళానికి గురయ్యాయి. ఫిలిప్పైన్స్ సైన్యం కొనసాగించిన సైనిక అభియాన్ - 1989లో సో ఓప్లాన్ డెల్టా బుస్టర్, 1987 మధ్యలో ఇసాబెలాలో ఓప్లాన్ రెడ్ బుస్టర్, 1988 నుంచి కొనసాగించిన లాంబాట్-బైటగ్‌లతో పెద్దెత్తున నష్టాలు సంభవించాయి.

1990లో ఇక్కడి విప్లవోద్యమం అనివార్యంగా పాక్షికంగానైనా దిద్దుబాటు ఉద్యమాన్ని చేపట్టి నూతన కర్తవ్యాలను నొక్కి చెప్పింది. బలగాలను పటిష్టపర్చుకొని, గెరిల్లా జోన్‌లలో శత్రు చుట్టివేత నుంచి తప్పుకొని కొత్త ప్రాంతాలకు వెళ్లి, ప్రజాపునాదిని తిరిగి సంపాదించుకొని బహిరంగంగా ప్రజా ఉద్యమాన్ని తిరిగి నిర్మించాలనుకున్నాం. అయితే ఇందులో సమస్యలన్నింటినీ సాకల్యంగా విశ్లేషించి పరిష్కరించుకోలేదు. ఆ పని 1992 మధ్యలో దిద్దుబాటు ఉద్యమ మొదటి డ్రాఫ్ట్ ఛైర్మన్ అర్మాన్‌డో లివానాగ్ తయారుచేసిన "మౌలిక సూత్రాలను అంటిపెట్టుకొని ఉందాం. తప్పులను సరిదిద్దుకుందాం" డాక్యుమెంటు అందిన తర్వాతనే చేయగలిగాం. పోతే, 1993 ప్రారంభంలో సీసీ 10వ ప్లీనం రూపొందించిన రెండవ గొప్ప దిద్దుబాటు ఉద్యమం గురించి ఈ ప్రాంతంలో మరింత ప్రచారం చేస్తూ సమస్యను దానితో పూర్తిగా జోడించగలిగాం. పార్టీ లైన్, మౌలిక సూత్రాలలో తలెత్తిన పెడధోరణులను దాని వెలుగులో అర్థం చేసుకోగలిగాం.

దిద్దుబాటు ఉద్యమ అవసరాన్నీ దాని అన్వయింపునూ గడిచిన కార్యాచరణలోని నష్టాలనూ అర్థం చేసుకోవడానికి ముందు కొంత సమయం పట్టింది. 1993 ప్రారంభంలో ఉత్తర లూజాన్ అంతర ప్రాంతీయ మహాసభలో సీసీ 10వ ప్లీనం రూపొందించిన డాక్యుమెంట్లను పై కమిటీ నిర్వహణలో అధ్యయనం చేశాం. అధ్యయన ఫలితంగా ఈ ప్రాంతంలో అవకాశవాద ద్రోహులను ఎండగడుతూ దిద్దుబాటు ఉద్యమాన్ని చేపట్టడానికి దృఢంగా నిలిచాం. సీసీ 10వ ప్లీనం తయారుచేసిన విశ్లేషణ, స్పష్టీకరణలపై ఆధారపడి ఈ ప్రాంతంలోని మా గత అనుభవాలను ప్రాథమికంగా సమీక్షించాం.

యావత్తు పార్టీ అనుభవాలను విశ్లేషించిన రెండు గొప్ప దిద్దుబాటు ఉద్యమాలను మేం దృఢంగా ఎత్తిపడుతూ నిల్చినప్పటికీ సొంత అనుభవాన్నీ, ఆచరణనూ విశ్లేషించుకోవడానికి గానీ, అన్వయించుకోవడానికి గానీ ఇంకా పూర్తిగా దాన్ని అవగతం చేసుకోలేకపోయాం. 1993కు ముందు అప్పుడు ప్రధాన బలగంగా ఈ ప్రాంతంలో ఉన్న తక్కువ సంఖ్యతో గల ఎన్.ఎల్. బెటాలియన్, సైనిక దుస్సాహసికవాదం వైపు మరో అడుగువేశాం. మేం గత అనుభవాలనూ, మా ప్రాథమిక సమీక్షలో గుర్తించిన సైనిక దుస్సాహసికవాదాన్నీ, దాని పాఠాలను సైతం పరిగణనలోకి తీసుకోలేదు.

1992-94 మధ్య కాలంలో చేపట్టిన సైనిక చర్యలలో దుస్సాహసికవాదం, ఏకపక్ష సైనిక దృష్టి ముందటికంటే ఎక్కువ మోతాదులో సాగింది. మా చర్యలలో స్పష్టంగా తప్పులుగా కనబడేవి - మధ్య ప్రాంతాన్ని (1992-94), దక్షిణ భాగాన్ని (1993-94) రక్షించుకోవడానికి తీసుకున్న దుస్సాహసిక వైఖరి, మా ప్రాంతీయ హెడ్‌క్వార్టర్లను కాపాడుకోవడానికి చేపట్టిన రక్షణ చర్యలు, శత్రువు ఇంటలిజెన్స్‌గా చెప్పబడుతున్న దాన్ని ధ్వంసం చేయడానికి కొనసాగించిన సైనిక కేంపెయిన్‌లు, అవే సైనిక పద్ధతులను అడవి నుండి కర్రను తీసుకెళ్లే వారిపై ప్రయోగించి చాలా మంది ప్రజల నుంచి మేం దూరం అయ్యాం. సిద్ధాంత, రాజకీయ, నిర్మాణ రంగాలలో ముఖ్యమైన ఇతర పనులకు కేడర్ల కొరత తీవ్రంగా వున్నప్పటికీ, అతి తరచుగా సమావేశాలు జరుపుతూ దిద్దుబాటు ఉద్యమానికన్నా ముందు ఉన్న కమాండ్‌ల వ్యవస్థను 1995 వరకు కొనసాగిస్తూ వచ్చాం.

సైనిక చర్యలు శత్రువుకన్నా ఎక్కువ మొత్తంలో మాకే నష్టాన్ని కలిగించాయి. పెద్దెత్తున ఆయుధాలు కోల్పోయాం. దీని నెగెటివ్ ప్రభావం ఎంతగానో పడింది. ముఖ్యంగా బలగాలను కోల్పోవడం, ప్రజా పునాదిని నష్టపోవడంతో పాటు రాజకీయంగా ఎదురైన తీవ్రమైన దుష్ప్రభావం నుండి బయటపడడానికి ఇప్పటికీ ఎంతగానో కృషి చేస్తున్నాం.

మేం రెండు రాష్ట్రాలంత వైశాల్యం కలిగిన ప్రాంతంతోపాటు మాలెలోని అంతర్ బారియోలలో ప్రజలను సమీకరించగలిగే వరకూ విస్తరించాం. ఇది మా అతి విస్తరణ. అన్ని వర్గాల రైతాంగ సమస్యలను తీసుకొని కేంపెయిన్‌లు చేశాం. ఇందులో ప్రభుత్వం నుండి కరువు సహాయక నిధులను డిమాండ్ చేయడం దగ్గరి నుండి సరుకుల ధరలు, రవాణా చార్జీలు, సాగునీటి సౌకర్యం వరకు అన్నీ వున్నాయి. ఈ ప్రాంతంలో నేటి తక్షణ కర్తవ్యంగా శ్రద్ధ పెట్టాల్సిన పునాదివర్గాల, నిమ్న-మధ్య వర్గాల వ్యవసాయ కూలీల మధ్య గట్టి బలాన్ని పెంచుకోవలసిన విషయాన్ని మాత్రం మరింత నిర్లక్ష్యం చేశాం.

రెండవ గొప్ప దిద్దుబాటు ఉద్యమాన్ని పూర్తి చేయాలనే వుద్దేశ్యంతో 1993-94లో మా వి.ఐ.క్యు. ప్రాంతీయ పార్టీ

నాయకత్వం ప్రాంతీయ మహాసభను జరపడం కోసం సన్నాహాలను చేయడంపై తన దృష్టి పెట్టింది. కానీ 1994లో జరిగిన మహాసభ సరైన సమీక్ష చేయడంలో విఫలమైంది. కేంద్ర నాయకత్వం నుంచి పాల్గొనలేదు. గైడెన్స్ కూడా అందివ్వలేదు. దానితో అది మాకు తోడ్పడకుండాపోయి మా సమస్యలు మరింత జటిలమై దిద్దుబాటు ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవడంలో అనేక ఆటంకాలు ఎదురయ్యాయి.

తప్పులతో కూడుకున్న పార్టీ లైన్ ఇంకా నష్టం చేస్తూనే పోయింది. మేం పని చేసే ప్రాంతం, ప్రజా పునాది, పూర్తికాలం పనిచేసే సభ్యులను నష్టపోతూనే వచ్చాం.

## రెండవ గొప్ప దిద్దుబాటు ఉద్యమం

### స్థానికంగా అన్వయింపు దిద్దుబాటుతో నష్టాల నివారణ

1995 చివర్లో ఉన్నత కమిటీ సహాయంతో మా కేడర్లందరూ పార్టీ మౌలిక సూత్రాలపై, దిద్దుబాటు ఉద్యమ క్రమంలో మా సొంత అనుభవం నుండి ఇప్పటివరకు తీసిన పాఠాలపై లోతైన అవగాహన పెంచుకున్నారు.

విఆర్ ప్రాంత పార్టీ కమిటీ అమలుచేసిన తప్పులతో కూడిన 'స్థానిక వ్యూహం', 'కాక్ చెయ్యి-ఎయిమ్ చెయ్యి-కాల్చు' పద్ధతులు, ఇసాబెలా ప్రాంత గత పార్టీ అమలుచేసిన 'ప్రతి-వ్యూహం' 1986-90 మధ్య సాగిన ఎస్.సి.ఒ. స్థానిక వక్కాణింపు, నూతన ప్రజాసైన్య పోరాట యూనిట్లను వరుసగా 'రెగ్యులరైజ్' చేయడం, 1991-92లో కమాండ్ సిబ్బంది "చలన యుద్ధపు కొన్ని లక్షణాలను" చేపట్టడం మొదలైనవన్నీ సూక్ష్మంగా విశ్లేషించి విమర్శించాం. అలాగే "శత్రు చుట్టివేతను ఛేదించండి'' అంటూ బిగ్గరగా ప్రకటించిన మన ఎత్తుగడల ఎదురుదాడులు, 1991-93లో "కార్డిలేరాలపై దాడులలో కేంద్రీకరించిన ప్రభుత్వ బలగాలను వెనక్కి మళ్లించండి'', పోతే ప్రజా ఉద్యమంపై బలంగా కొనసాగిన సంస్కరణవాద ప్రభావం, దృఢంగా పనిచేసిన సార్వత్రిక తిరుగుబాటు గాలులు విశ్లేషించబడి విమర్శించబడినాయి.

1995-96లో సైనిక దుస్సాహసికవాద అవశేషాలను నిర్ణయాత్మకంగా సరిదిద్దాం. 1993-94లో సందు ఇవ్వకుండా పెద్దెత్తున శత్రువు చేస్తున్న దాడుల నుంచి ప్రాంతీయ హెడ్క్వార్టర్లను రక్షించుకోవడానికి అమలు చేసిన "స్థావర" రక్షణ ఎత్తుగడ, శత్రువు ఇంటలిజెన్స్ వలన ధ్వంసం చేయడానికీ, మొద్దులను తరలించడంపై సైనిక పద్ధతుల్లో అమలుచేసిన నిషేధం 'క్యాంపెయిన్‌లు' కూడా విశ్లేషించి విమర్శలకు గురైనాయి. మేం ఛేదించలేకపోయిన మా వున్నత టార్గెట్లను 1996లో రాజకీయ పని కోసం తగ్గించుకున్నాం. వాటి కోసం ఏర్పర్చిన అతి ఉన్నత నిర్మాణాన్ని కూడా రద్దుచేసుకొని ఆ శక్తులను ప్రాథమిక స్థాయిలోని కర్తవ్యాలను పూర్తి చేయడానికి పార్టీ ప్రజాసైన్య అంతర్గత పటిష్టతను పెంచడానికి పునర్నిర్మాణంచేసాం.

ప్రాంతీయ దిద్దుబాటు ఉద్యమ కర్తవ్యాలను గత ఏడాది నుంచి మేం క్రియాశీలంగా అన్వయించుకుంటున్నాం. ఈ ఉద్యమాన్ని, ప్రత్యేకించి సైనిక యూనిట్లలో ఉద్యమాన్ని ముందుకు తీసుకోవడంలో చాలా లొసుగులున్నాయి. ఫలితంగా, కార్యక్షేత్రాలను విస్తరించుకోవడంలో, ప్రజాసంఘాలను పెంచుకోవడంలో, నూతన ప్రజాసైన్యంలో సంఖ్యను పెంచుకోవడంలో ఎలాంటి పెద్ద ఫలితాలు అగుపడడం లేదు. మౌలిక సూత్రాలను లోతుగా గ్రహించడం, తప్పులను స్వచ్ఛందంగా, మర్యాద పూర్వకంగా విమర్శించడం, అనుభవాలను సమీక్షించి తీసిన పాఠాల వెలుగులో తప్పులను సరిదిద్దుకోవడానికి కృషి చేయడం, మాస్‌వర్క్ వైపు ప్రజాసైన్య యంత్రాంగాన్ని తిరిగి నియామకం చేస్తూ దాని దృష్టికోణాన్ని మళ్లించడంలో, ముఖ్యమైన పలు రంగాలలో పార్టీ సమిష్టి నాయకత్వాన్ని నెలకొల్పడానికి చేస్తున్న కృషిలో మాత్రం గమనించదగిన ఫలితాలున్నాయి. పార్టీ, ప్రజాసైన్యం రక్షణ పట్లా నెమ్మదిగా ప్రజల్లో విశ్వాసం బలపడుతూ తిరిగి నూతన ఉత్సాహం పెంచడంలో ఫలితాలున్నాయి. మొత్తంపై, సరైన చట్రంలో మా యూనిట్లన్నీ మాస్‌వర్క్‌లో తమ నైపుణ్యాన్ని పెంచుకోవడానికి ఇష్టపడుతున్నాయి.

### నూతన ప్రజాసైన్య దృష్టికోణాన్ని సరిదిద్దుతూ మున్నెన్నటికంటే విస్తృతంగా, లోతుగా ప్రజాపునాదిని పెంచడంతోపాటు విస్తృతంగా, ముమ్మరంగా గెరిల్లా యుద్ధతంత్రాన్ని పురోగమింపచేద్దాం!

దిద్దుబాటు ఉద్యమాన్ని మేం అవగతం చేసుకున్న వెంటనే మా పూర్తికాలం గెరిల్లాలను, పెద్ద సంఖ్యలో మా ప్రాంతీయ సిబ్బందిలోని వ్యక్తులను మాస్‌వర్క్ కోసం తిరిగి పంపించాం. వారికి తిరిగి శిక్షణ, అధ్యయనం, మాస్‌వర్క్‌పై శిక్షణ ఇచ్చి పనిలోకి దింపాం. విస్తృతంగా, ముమ్మరంగా గెరిల్లా యుద్ధాన్ని పురోగమింపచేయడానికై పునాదిగా గల మాస్‌వర్క్ కర్తవ్యాలపైనా దృష్టిని ప్రధానంగా నిలిపాము. సైనిక పనిలో విజయాల హామీకీ, ప్రజాసైన్యంలో నూతన బలానికీ అది రిజర్వాయర్ లాంటిది. "ప్రజల్లోని సంఘటిత శక్తులు నిరంతరం బలహీనపడుతుంటే మనం ప్రజాసైన్యం సామర్థ్యాన్ని పెంచకుండా శత్రువు నుంచి అనేక ఆయుధాలు కొద్ది సమయంలోనే స్వాధీనం చేసుకొన్నా మనం విప్లవోద్యమ స్థాయిని ఎప్పటికీ పెంచలేము''

అనే పాఠాన్ని చైతన్యయుతంగా కామ్రేడ్స్ లోతుగా గ్రహిస్తున్నారు. నిరంతరం విస్తరణ, ప్రజాసైన్యం పెరుగుదల అనేవి ప్రజలతో ఏ మేరకు మమేకమయ్యాం, మాస్‌వర్క్‌లో ఎలా పాల్గొంటున్నాం, ప్రజల మద్దతు మనకు ఏమేరకుంది అనే విషయాలపైన ఆధారపడి వుంటాయి.

సైనిక విషయాలలో బూర్జువా పంథాను మేం ఎదుర్కొంటూ శ్రామికవర్గ విప్లవ పంథాతో సైన్యాన్ని నిర్మించడాన్ని ప్రోత్సహించాం. ముందుగా సైన్యంపై పార్టీ నాయకత్వాన్ని బలంగా నిలిపాం. వెంటనే అన్ని సైనిక యూనిట్లలో పార్టీ కమిటీల నాయకత్వాన్ని ఏర్పర్చడం, అది చైతన్యవంతమైన కృషితో, విప్లవ రాజకీయాల లక్ష్యాలతో, కర్తవ్యాలతో మమేకం కావడం, అన్ని కర్తవ్యాలలో రాజకీయాలను ఆధిపత్యంలో వుంచడం, వర్గ చైతన్యం, వర్గ దృష్టికోణంపై ఆధారపడిన చైతన్యయుతమైన ఉక్కు క్రమశిక్షణతో దానిని పటిష్టం చేయడం మొదలైనవి ప్రోత్సహించాం.

మా ఎర్ర సైనికులు, చైతన్యయుతంగా ప్రజల ముందు తమ ఆత్మవిమర్శను ప్రవేశపెడుతున్నారు. గత తప్పులపై, ప్రస్తుత ప్రజాసైన్య చర్యలపై వారి నుంచి విమర్శను నిజాయితీతో కోరుతున్నారు. ఇది ప్రజలతో సన్నిహిత సఖ్యతను పెంచుకోవడం, పార్టీనీ, ప్రజాసైన్యాన్ని పటిష్టపరచుకోవడంలో భాగంగా జరుగుతోంది.

## మాస్‌వర్క్-ప్రజాపోరాటాలు

చాలాకాలం వరకు పార్టీలో తీవ్ర పెడధోరణులు, తప్పులు, బలహీనతలు కొనసాగినప్పటికీ విప్లవోద్యమం పట్లా, ప్రజాసైన్యం పట్లా, పార్టీపట్లా ప్రజలకు గల గురి, నిబద్ధతా సానుకూలంగా కంటిన్యూ అయ్యాయి. పార్టీ దిద్దుబాటు ఉద్యమాన్ని చేపట్టిందని వారు తెలుసుకున్నాక అవి మరింత పెరిగాయి. ప్రజలు తమ నివాసప్రాంతాలలో సామాజిక సమస్యలను పరిష్కరించుకోవడంలో ప్రత్యేకించి దోపిడీ వర్గాల విపరీతమైన దోపిడీ, టెర్రరిజం, అణచివేతలకు వ్యతిరేకంగా వాళ్లు పార్టీ నాయకత్వాన్నీ, ప్రజాసైన్య చర్యలనూ కోరుకున్నారు.

మున్నెన్నటికన్నా రైతాంగ ప్రజల సమస్యలు దుర్భరమయ్యాయి. పలురకాల భూస్వామ్య, అర్ధభూస్వామ్య దోపిడీ పద్ధతులూ దుర్భరమయ్యాయి. ప్రజల భూములను గుంజుకోవడం వంటి తీవ్రమైన ఇతర ఆర్థిక, సామాజిక సమస్యలూ ఉన్నాయి. గెరిల్లా జోన్‌లలో ప్రజాసంఘాలు దెబ్బతిన్న తర్వాత ప్రజల నివాస ప్రాంతాలలో (గ్రామాల్లో) ప్రజాసమస్యలు విపరీతమయ్యాయి.

ఈ ప్రాంతంలోని గెరిల్లా జోన్‌లలో కనీసం బ్రిగేడ్ స్థాయిలో శత్రు సైనిక బలగాలు తిష్ట వేశాయి. అయినప్పటికీ, ప్రజాపునాదిపై ఆధారపడి చిన్న, చిన్న ప్రజాసైనిక యూనిట్లు ప్రభావయుతంగా సంచరించగలుగుతూ, గెరిల్లా ఎత్తుగడల ద్వారా చొరవను ప్రదర్శిస్తున్నాయి.

బారియోలలో గల మునుపటి ఆక్టివిస్టులను, ఆర్గనైజింగ్ గ్రూపుల సభ్యులను, కమిటీలను రీగ్రూప్ (పునస్సంఘటితం) చేయడంలో తొలి విజయాన్నీ సాధించాం. అయితే, మేం బారియోలలో ప్రజాసంఘాలను నిర్మించడం, పునరుద్ధరించడం మాత్రమే మొదలుపెట్టాం.

బారియోలలో సామాజిక పరిశోధన చేయడం, నిర్దిష్ట వ్యవసాయిక సంబంధాలను అర్థం చేసుకోవడం, పలు రూపాల భూస్వామ్య, అర్ధభూస్వామ్య దోపిడీ పద్ధతులను బహిర్గతం చేయడం, ఎదుర్కోవడం, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలలో ప్రజలను కదలించడం, ప్రజల ఇతరత్రా సమస్యలపై క్యాంపెయిన్లు చేపట్టడంపై తిరిగి నూతన దృష్టి నిలిపాం.

వ్యవసాయక విప్లవ కనీస లక్షణాలను ముందుకు తీసుకుపోవడానికై మేం తక్కువ స్థాయిలోనే ప్రజల సమీకరణను చేపట్టడం ద్వారా అనేక బారియోలలో, పట్టణాలలో ప్రజలకు లాభం చేకూరింది.

బహిరంగ సమరశీల ప్రజాపోరాటాలను చేపట్టాం. కెనన్ డ్యాం ప్రాజెక్టును అమెరికా-రామోస్ ప్రభుత్వం చెడగొట్టడానికి వ్యతిరకంగా చేపట్టిన పోరాటం; ఆర్మికో మైనింగ్ కంపెనీని విదేశీ గుత్తపెట్టుబడిదారులు స్వాధీనం చేసుకోవడానికి వ్యతిరేకంగా చేపట్టిన పోరాటం; స్థానిక బడా భూస్వామ్య - బడా బూర్జువాలకు వ్యతిరేకంగా రైతాంగం, జాతీయ మైనారిటీలు చేపట్టిన పోరాటాలు; విద్యార్థి-యువజనులూ, చర్చ్ జనం, వృత్తికారులూ, సమస్యలపై ఎత్తుగడలపరంగా కల్సివచ్చే ఐక్యతా శక్తులు, రైతాంగం... వీరందరికీ మద్దతుగా చేపట్టిన పోరాటాలు వీటిల్లో పెద్దవి.

అనేక పబ్లిక్, ప్రయివేట్ పాఠశాలల టీచర్లు, విద్యార్థి-యువజనులు ఇసాబెలా, కైరినోలలో చేపట్టిన పోరాటాలు బలమైనవి, సమరశీలమైనవి. ప్రజాస్వామిక హక్కుల కోసం అవినీతిమయ ఉన్నతాధికారులను గట్టిగా ఎదుర్కున్నారు. విద్యార్థి, ఉపాధ్యాయ, పాఠశాల సిబ్బంది ప్రయోజనాలకు వ్యతిరేకంగా వున్న ప్రభుత్వ విధానాలపై వాళ్లు పోరాడారు. అమెరికా-రామోస్ ప్రభుత్వ అధికార వ్యవస్థతో ప్రభావితమైన ఆరోగ్య సేవారంగ ఉద్యోగులూ, ఇతరులూ నిరసన చర్యలను చేపట్టడం మాత్రం జోరుగా సాగింది.

## రెక్టిఫికేషన్-పార్టీ కన్సాలిడేషన్

దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్నీ అంతర్జాతీయ శ్రామికోద్యమాన్నీ పురోగమింప చేయడానికై సైద్ధాంతిక, రాజకీయ సవాళ్లను పరిష్కరించడానికి పార్టీ డాక్యుమెంట్లను అధ్యయనం చేయడమనేది చాలా కఠినంగా వుండింది. వీటిని అధ్యయనం చేయని సభ్యుల మధ్య ప్రత్యేకంగా పార్టీ బేసిక్ కోర్సును ప్రచారంలో పెట్టాం. పార్టీ కోర్సులకు అవసరమైన రిఫరెన్స్ పుస్తకాల వ్యక్తిగత అధ్యయనం కూడా విస్తృతంగా సాగింది. ఏమైనప్పటికీ ఈ ప్రాంతంలోని కేడర్ల, పార్టీ సభ్యుల సైద్ధాంతిక అవగాహనను లోతుగా పెంచడానికి ఇంకా చాలా కృషి అవసరం.

'తెల్ల ప్రాంతాల'లో 1992-93లో సకాలంలో దిద్దుబాటు వుద్యమం ప్రచారం చేయడం, రైతాంగ ఉద్యమ అనుభవాలను సమీక్షించడం ద్వారా, మన శక్తులను కాపాడుకోవడానికీ, పార్టీలో చీలికలు సృష్టించి పట్టణ కేంద్రాలలో చొరబడడానికీ కుట్రలు చేసిన పార్టీ-వ్యతిరేక శక్తులను ఎదుర్కోవడానికి తోడ్పడింది.

గత అనుభవాల పాఠాలపై అవగాహనను లోతుగా పెంచుకోవడాన్ని పార్టీ ఆర్గనైజేషన్ కొనసాగించింది. మా గత ఆచరణలో నిర్దిష్టంగా ఏఏ రూపాలలో తీవ్ర తప్పులూ, పెడధోరణులూ చోటు చేసుకున్నాయో వాటిపైన లోతైన విమర్శను, దిద్దుబాటును కొనసాగించాం. మా గత బలహీనతలపై, లోపాలపై మా కామ్రేడ్స్ నుంచి, ప్రజల నుంచి వారి పరిశీలనలను, విమర్శలను పద్ధతి ప్రకారం చైతన్యవంతమైన కృషితో స్వీకరించాం. ఇలా చేయడం ద్వారా దిద్దుబాటు ఉద్యమాన్ని మరింత లోతుగా తీసుకెళ్లడంతోపాటు పార్టీకీ, ప్రజాసైన్యానికీ ప్రజలతో సంబంధాలు బలపడుతున్నాయి.

ఈ ప్రాంతంలోని పట్టణ కేంద్రాలలో చేపట్టిన దిద్దుబాటు వుద్యమాన్ని కొనసాగించాం. ప్రత్యేకించి మా కేడర్లనూ, సభ్యులనూ కన్సాలిడేట్ చేయడంపైనా, రహస్య పనిని విస్తృతపర్చడంపైనా, రైతాంగంలో విద్యార్థి-యువజనులలో, మహిళల్లో గతంలో కార్యాలయాల్లో పని చేసిన ప్రొఫెషనల్స్, ఇతర పునాది వర్గాలలో బలమైన ప్రజా పునాదిని నూతన దృష్టికోణం నుంచి ఏర్పర్చడానికి తిరిగి శక్తులను నియమించడంపైనా శ్రద్ధ పెట్టాం. ప్రముఖ రంగాలలోని పనికోసం శక్తులను నియమించడంలో గణనీయమైన ప్రగతి సాధించాం.

నూతన ప్రజాస్వామిక విధానాన్ని అన్ని విధాల నిశ్చయంగా పురోగమింపచేయడానికై ఈ ప్రాంతంలోని కేడర్లూ, సభ్యులూ గట్టి పునాదులు వేయడానికి ఎంతటి కష్టాలనైనా అధిగమిస్తున్నారు. గత పొరపాట్ల మూలంగా వాటిల్లిన తీవ్ర నష్టాన్ని అధిగమించడానికి ఈ ప్రాంతంలో దిద్దుబాటు ఉద్యమాన్ని పూర్తిగా కొనసాగించడానికి తీవ్రంగా కృషి చేయాల్సి వుంది. ఈ ప్రాంతంలోని పార్టీ, ప్రజాసైన్య కేడర్లలో, సభ్యుల్లో వున్న తప్పుడు అవగాహనల అవశేషాలను తొలగించడం, అలాగే పెడధోరణులు, తప్పులతో ఎదురైన భారీ నష్టాలు, సమస్యలు, బలహీనతల నుంచి బయటపడడం ఏమంత సులువైన పని కాదు. దిద్దుబాటు ఉద్యమాన్ని మరింత లోతుగా తీసుకెళ్లడానికై, సైద్ధాంతికంగా, రాజకీయంగా, నిర్మాణాత్మకంగా పార్టీని మరింత కన్సాలిడేట్ చేయడానికై ముఖ్యమైన సమస్యలను గుర్తించి చేపట్టి కొనసాగించాలి. అమెరికా-రామోస్ ప్రభుత్వం, వాళ్ల విప్లవ ప్రతీఘాతుక తొత్తులు, రివిజనిస్టులు, పెటీబూర్జువా సంస్కరణవాదులు మాకు వ్యతిరేకంగా తీవ్రమైన సైనిక, మానసిక (సైకో) యుద్ధ దాడులను ఎక్కుపెట్టినప్పటికీ మా బలహీనతలను మేం అధిగమించగలమన్న విశ్వాసం మాకుంది. ఎందుకంటే ముఖ్యంగా పెద్ద బలహీనతలను, పెడధోరణులను సైనిక దుస్సాహసికవాదం, సార్వత్రిక తిరుగుబాటువాదం అనే తప్పులతో కూడిన లైన్‌ను పార్టీ నిర్ణయాత్మకంగా సరిదిద్దుకుంది.

సాయుధ విప్లవాన్ని నూతన, ఉన్నత ఎత్తులకు పురోగమింపచేయడానికై రెండవ గొప్ప దిద్దుబాటు ఉద్యమాన్ని చివరి వరకూ కొనసాగించాలనీ, మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానం పునాదులపై దానిని బలోపేతం చేయాలనీ ప్రాంతీయ ఆర్గనైజేషన్ నిశ్చయంతో వుంది.

(1997 ఏప్రిల్‌లో వీఐక్యా ప్రాంతీయ పార్టీ కమిటీ విడుదల చేసింది) ★

**స్వీయాత్మకత సరైన అధ్యయన పద్ధతికాదు. అది మార్క్సిజం-లెనినిజానికి వ్యతిరేకమైనది; కమ్యూనిస్టు పార్టీతో పొసగనిది. మనం కోరుకునేది మార్క్సిస్టు-లెనినిస్టు అధ్యయన పద్ధతి. అధ్యయన పద్ధతి అనడంలో మన వుద్దేశ్యం పాఠశాలలలో అధ్యయన పద్ధతి మాత్రమేకాదు, మొత్తం పార్టీ అంతటా అధ్యయన పద్ధతి. అది మన అగ్రగామి సంస్థలలోని కామ్రేడ్ల, కార్యకర్తల, పార్టీ సభ్యుల ఆలోచనా విధానానికి సంబంధించిన ప్రశ్న, మార్క్సిజం-లెనినిజం పట్ల మన ధోరణికి, తమ పనిలో పార్టీ కామ్రేడ్స్ అందరి ధోరణికి సంబంధించిన ప్రశ్న. కాబట్టి ఇది అత్యంత ప్రాముఖ్యమున్న, ప్రాథమిక ప్రశ్న.**

**– మావో**

# మేడే స్ఫూర్తితో, నేటి ఆర్థిక సంక్షోభంలో విప్లవ తుఫానులను సృష్టించి విజయం వైపు పురోగమింపజేద్దాం!

ఆర్థిక సంక్షోభం ప్రపంచాన్ని ఆవరించిన ప్రస్తుత సమయంలో మేడే పోరాటం ఎప్పటికంటే కూడా ఎక్కువ స్ఫూర్తిదాయకం అవుతుంది. సామ్రాజ్యవాదం తన సంక్షోభ భారాన్ని పేద దేశాల ప్రజలపై మోపి ఈ సుడిగుండం నుండి క్షేమంగా బయటపడాలని ప్రయత్నిస్తున్నది. ముఖ్యంగా ప్రపంచాధిపత్యం చెలాయిస్తున్న అమెరికా సామ్రాజ్యవాదం భారతదేశాన్ని ఈ సుడిగుండంలోకి లాగి, కోట్లాది భారత శ్రామిక ప్రజానీకం యొక్క మూలుగులను పీల్చేసి తను మాత్రం గట్టెక్కాలని చూస్తున్నది. సామ్రాజ్యవాద ఆదేశాలను శిరసావహిస్తున్న భారత పాలకవర్గాలు దైనందిన సమస్యల పరిష్కారానికి, న్యాయమైన హక్కుల కోసం పోరాడుతున్న ప్రజలపై, ఈ పోరాటాలకు దన్నుగా నిలుస్తున్న విప్లవోద్యమంపై ఉక్కుపాదం మోపి అణచివేయబూనుకున్నాయి. పోరాట ప్రజల చైతన్యాన్ని పక్కదారి పట్టించడానికి కుట్రలు, చేస్తున్నాయి. పాలకవర్గాల పాశవిక దాడులను, కుట్రలను తిప్పికొట్టి, ప్రజలను వేలాదిగా పోరాటాల్లోకి కదిలించే బాధ్యత మావోయిస్టు పార్టీపై వుంది. మేడే స్ఫూర్తితో చికాగో కార్మికుల త్యాగాన్ని స్మరించుకుంటూ నిజమైన కార్మికవర్గ పోరాట యోధులుగా ఈ గురుతరమైన కర్తవ్య నిర్వహణకై దీక్షబూనుదాం.

'ఎనిమిది గంటల పని, ఎనిమిది గంటల అధ్యయనం, ఎనిమిది గంటల విశ్రాంతి' అనే మహోన్నతమైన నినాదంతో 19వ శతాబ్దంలో మొదలైన కార్మికవర్గ పోరాటం, 1886 మే 1 నుండి రోజుకు ఎనిమిది గంటల పనిని కార్మికులు ఖచ్చితంగా, చట్టబద్ధంగా డిమాండ్ చేయాలని అమెరికా, కెనడా దేశాల కార్మిక సమాఖ్య పిలుపునివ్వడంతో గొప్ప మలుపు తిరిగింది. ఈ పోరాటానికి మద్దతుగా అమెరికా దేశంలోని చికాగో నగరంలో 1886 మే 1 నాడు కార్మికులు చేపట్టిన ఊరేగింపుపై పోలీసులు కాల్పులు జరిపి నలుగురు కార్మికులను బలిగొన్నారు. దీనికి నిరసనగా అదే నగరంలోని హే మార్కెట్ కూడలిలో మే 4న కార్మికులు సమావేశమై ప్రదర్శన నిర్వహించారు. కార్మికుల పోరాటాన్ని భగ్నం చేయడానికి పాలకులు బాంబు పేలుడు కుట్ర పన్నారు. ఈ పేలుడులో ఒక పోలీసు మరణించగా, పేలుడుకు కారకులనే అబద్ధపు అభియోగం మోపి, నలుగురు కార్మిక నాయకులను తప్పుడు విచారణ జరిపి, ఉరి తీశారు. మరో నాయకునికి 15 సంవత్సరాల జైలు శిక్ష విధించారు. ఈ మహత్తర త్యాగపూరిత పోరాటాన్ని స్మరించుకుంటూ, తమ భవిష్యత్ పోరాటాలకు ఇది ఒక ఆదర్శంగా నిలిచి, స్ఫూర్తినివ్వాలనే మహదాశయంతో ప్రపంచంలోని కార్మిక సంఘాలన్నీ కలిసి జెనీవాలో సమావేశమై, మే 1ని 'అంతర్జాతీయ కార్మిక పోరాట దినం'గా జరుపుకోవాలని తీర్మానించాయి. అది 'మేడే'గా ప్రపంచ వ్యాప్తంగా కార్మిక పోరాటాలకు నిత్య స్ఫూర్తినందిస్తోంది.

ప్రపంచీకరణ పేరిట పేద, వెనకబడిన దేశాలను దోచుకుతింటున్న అమెరికా సామ్రాజ్యవాదం, అమెరికాలోని పరాన్నభుక్కు పెట్టుబడిదారీ ద్రవ్య తిమింగలాల మితిమీరిన దురాశ ప్రస్తుత ఆర్థిక సంక్షోభానికి తెరలేపింది. అమెరికాలో మొదలైన ఆర్థిక సంక్షోభం ప్రపంచవ్యాపిత సంక్షోభంగా మారి 1930ల నాటి పరిస్థితుల్ని పునరావృతం చేస్తున్నది. అన్ని రంగాల్లో ఉద్యోగాల నుంచి తొలగింపు, జీతాల్లో కోతలు, ఫ్యాక్టరీల, కంపెనీల మూసివేతలు, అదనపు పని గంటల విధింపు, కార్మికులను, రైతాంగాన్నేగాక, ఉద్యోగులు, మధ్యతరగతి, చిన్న వ్యాపారులు, చిన్న పెట్టుబడిదారులను కూడా నలిపేస్తున్నది. సంక్షోభానికి గురైన ప్రజల అసంతృప్తి, ఆగ్రహాలు రాజకీయ ఉద్యమాలుగా రూపుదిద్దుకుంటున్నాయి.

అమెరికాలో ఫ్యాక్టరీల మూసివేతలకు, పెరుగుతున్న నిరుద్యోగానికి వ్యతిరేకంగా కార్మికులు పోరాటాలకు దిగుతున్నారు. చికాగోలో రిపబ్లిక్ విండోస్ అండ్ డోర్స్ కంపెనీ కార్మికుల మిలిటెంట్ పోరాటం గొప్ప సంచలనాన్ని రేపింది. కార్మికులు ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకుని తమ హక్కులు సాధించుకున్నారు. గ్రీస్‌లో మొదలైన ఆందోళన యూరప్ దేశాలను భయపెట్టింది. ఐస్‌లాండ్ ఆర్థిక వ్యవస్థ, ప్రభుత్వం కుప్పకూలిపోగా, ఆర్థిక చౌర్యానికి నిరసనగా మిలిటెంట్ ఆందోళనలు జరిగాయి. ఫ్రాన్స్‌లో పెన్షన్ల కోత, ఉద్యోగాల తొలగింపు, ఉదారవాద సంస్కరణలకు వ్యతిరేకంగా జనవరిలో జరిగిన సాధారణ సమ్మెలో లక్షలాది మంది భారీ ప్రదర్శనలు జరిపారు. దివాళీ తీసిన బ్యాంకులకు వందల కోట్ల రూపాయలు ప్రభుత్వం సహాయంగా అందించడాన్ని ప్రజలు

**ప్రపంచ కార్మికులారా ఏకంకండి! పోరాడితే పోయేదేమీలేదు బానిస సంకెళ్లు తప్ప!**

నిలదీస్తున్నారు. యూరప్ అంతటా నెలకొన్న ఆర్థిక అనిశ్చితి సామాజిక ఉద్రిక్తతలకు దారితీస్తాయనే భయప్రకంపనలు వ్యాపిస్తున్నాయి. స్పెయిన్, లాట్వియాలలో ఉద్యోగాల తొలగింపుకు వ్యతిరేకంగా, గ్రీస్, ఇటలీ, స్కాట్‌లాండ్, ఫ్రాన్స్, జర్మనీ, చెక్ రిపబ్లిక్‌లలో పెరుగుతున్న నిరుద్యోగానికి వ్యతిరేకంగా పెద్ద యెత్తున ప్రదర్శనలు జరిగాయి. బల్గేరియా, హంగరీ, లాట్వియా, లిథుయేనియాలలో నిరసనలు హింసా రూపం తీసుకున్నాయి. సంక్షోభం బయట పడడానికి సామ్రాజ్యవాదుల నాయకత్వంలో రోమ్‌లో జరిగిన జి-7 దేశాల సదస్సు లండన్‌లో జరిగిన జి-20 దేశాల సదస్సుల దగ్గర నిరసనకారుల ఆందోళనలు హింసా రూపం తీసుకోవటంతో సదస్సును ఒకరోజు వాయిదా వేసుకున్నారు. జి-7 సదస్సులో పెట్టుబడిదారుల ఉద్దీపనకు సామ్రాజ్యవాదులు ప్రకటించిన వందల బిలియన్ డాలర్ల సహాయాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనకారులు "సామ్రాజ్యవాదం నశించాలి. సోషలిజం వర్థిల్లాలి" అని నిరసన ప్రదర్శనలు జరిపారు.

భారతదేశంలో సంక్షోభ ప్రభావంలేదని పాలకులు బుకాయిస్తున్నా, వాస్తవాల్లోకి వెళితే పరిస్థితి అర్థమవుతుంది. తోళ్ల ఉత్పత్తులకు విదేశాల్లో గిరాకి పడిపోయి, ఎగుమతులు నిలిచిపోయి, తోళ్ల పరిశ్రమ దెబ్బతిని ఇప్పటికే మూడున్నర లక్షల మంది ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. మరో ఐదు లక్షల మంది పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. నాపరాయి ఎగుమతి ఆగిపోయి ఆంధ్రప్రదేశ్‌లోని నాపరాయి పరిశ్రమలో వేలాది మంది ఉపాధి కోల్పోయారు. ఇనుము ఎగుమతి తగ్గటంతో గని కార్మికులు, రవాణా, ఓడ రేవుల కార్మికులు 50 శాతం ఉద్యోగాలు, ఉపాధి కోల్పోయారు. ఇనుము పరిశ్రమల్లో పని నిలిచిపోయి ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు గనుల్లో లక్షలాది కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు. 51 వేల అద్దెకార్లు, 10 వేల బస్సులు పనిలేక మూలపడటంతో 10 లక్షల మందికి ఉపాధి కరువైంది. ప్రయివేట్ కార్ల డ్రైవర్లు పని కోల్పోతున్నారు. భవన నిర్మాణ రంగం స్థంభించి పోవటం వల్ల ఒక విశాఖలోనే 40 వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. దేశం మొత్తం మీద ఈ సంఖ్య లక్షల్లోనో, కోట్లలోనో వుండవచ్చు. స్టీలు ప్లాంటు ఉత్పత్తి మందగించి 10 వేల మంది కార్మికులు వుపాధి కోల్పోయారు. షాపింగ్ మాల్స్ అమ్మకాలు తగ్గిపోయి కార్మికుల ఉపాధి దెబ్బతిన్నది. చిన్న దుకాణాలు, చిల్లర వ్యాపారులు దెబ్బతిని లక్షలాది మంది రోడ్డున పడుతున్నారు. విదేశాల్లో వుద్యోగాలు కోల్పోయి స్వదేశానికి వస్తున్న వారి సంఖ్య లక్షల్లో పెరుగుతున్నది. ఉన్నత, మధ్యతరగతి కుటుంబాల్లో కూడా అశాంతి, కల్లోలాలు తీవ్రమయ్యాయి.

ప్రపంచీకరణ విధానాల వల్ల ఘోరంగా దెబ్బతిన్న వ్యవసాయం, ఈ సంక్షోభ ప్రభావంతో సర్వనాశనమయ్యే స్థితి తలెత్తింది. రైతులు వ్యవసాయం వదిలేసి కూలీలుగా, కార్మికులుగా పట్టణాలకు వలసలు పోవటం పెరిగింది. అక్కడ కూడా ఉపాధి దొరక్క అర్థాకలితో పస్తులుంటున్నారు. ఎస్.ఇ.జడ్.లు, అభివృద్ధి ప్రాజెక్టుల్లో భూములు కోల్పోయి బలవంతంగా నిర్వాసితులైన లక్షలాది రైతాంగం బతుకుదెరువు కోల్పోయి బజారునపడ్డారు.

పాలకవర్గాల ఈ దుర్మార్గపు విధానాలకు వ్యతిరేకంగా ప్రజల్లో అసంతృప్తి, ఆగ్రహజ్వాలలు పోరాటాలుగా బద్దలవుతూనే వున్నాయి. సింగూరు, నందిగ్రామ్‌లలో టాటా కార్ల పరిశ్రమ, సెజ్‌ల కోసం భూములు గుంజుకోవడాన్ని రైతులు, ప్రజలు ఆత్మ బలిదానాలతో వీరోచితంగా తిప్పికొట్టారు. బాక్సైట్ గనులకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్, ఒడిస్సాలలో ఆదివాసీ ప్రజానీకం ఉద్యమిస్తూనే వున్నారు. దండకారణ్యం, బీహార్, ఝార్ఖండ్‌లలో మావోయిస్టు పార్టీ నాయకత్వంలో దోపిడి పాలనకు ప్రత్యామ్నాయంగా ప్రజారాజ్యాధికార స్థాపనకు ప్రజాసైన్యంతో భుజం భుజం కలిపి పోరాడుతున్నారు.

సంక్షోభ భారానికి గురవుతున్న ప్రజానీకాన్ని లక్షలాదిగా పోరాటాల్లో సమీకరించి, వారిని సాయుధులుగా సంఘటితం చేసి, విప్లవోద్యమాన్ని పురోగమింపజేయటం మావోయిస్టులుగా నేడు మనముందున్న కర్తవ్యం. మొదటి, రెండవ దశ ప్రపంచ ఆర్థిక సంక్షోభాల కాలంలో రష్యా, చైనా, ఇంకా అనేక దేశాల్లో కార్మికవర్గం సోషలిస్టు రాజ్యాలను స్థాపించింది. సామ్రాజ్యవాద కుట్రల వల్ల స్థావర ప్రాంతాలను కోల్పోయిన నేటి మూడవ దశ సంక్షోభ సమయంలో కార్మికవర్గం మరింత కర్కశమైన విప్లవ యుద్ధాన్ని సాగించాల్సి వుంది. అటువంటి కఠోరమైన కర్తవ్య నిర్వహణలో చికాగో కార్మికుల పోరాటాన్ని స్మరించుకుంటూ న్యాయమైన హక్కుల కోసం పోరాటంలో, విప్లవంలో అసువులు బాసిన శ్రామిక ప్రజల, కార్మికవర్గ వీరుల త్యాగాలు ఆదర్శంగా మేడే స్ఫూర్తిని కొనసాగిస్తూ, భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయంవైపు పురోగమింపజేద్దాం. ★

**పత్రికకు మీ ప్రాంతంలోని పోరాట, ప్రతిఘటన, నిర్బంధ, సభలూ - సమావేశాల నివేదికలు, అమరుల చరిత్రలను ఎప్పటికప్పుడు పంపుతూ వుండండి.**

# బుష్‌పై బూట్లు-పెల్లుబుకుతున్న ప్రజల ఆగ్రహావేశ జ్వాలలు

అధికార పీఠం నుండి దిగిపోవడానికి 37 రోజుల ముందు అమెరికా అధ్యక్షుడు జార్జి బుష్ ఇరాక్‌లో వీడ్కోలు పర్యటన జరిపాడు. విలేఖరుల సమావేశంలో మాట్లాడుతుండగా అల్ బాగ్దాదియా ఛానెల్ విలేఖరి ముంతజర్ అల్-జైదీ బుష్‌పై తన రెండు బూట్లు విసిరాడు. "భర్తల్ని కోల్పోయిన, తల్లిదండ్రులను కోల్పోయిన మహిళల, అనాధ పిల్లల నుంచి" అంటూ మొదటి బూటు విసిరాడు. ఆ వెంటనే "ఇది నీ వీడ్కోలు ముద్దు కుక్కా" అంటూ రెండవ బూటు విసిరాడు.

అరబ్ సమాజంలో చెప్పులు చూపడం చాలా అవమానకరమైనది. చెప్పులు విసరడం మరింత హీనమైన అవమానం. బుష్ దుర్మార్గాలకు పదవీ విరమణ దశలో తగిన వీడ్కోలు లభించింది. ఇది బుష్‌ను జీవితాంతం పీడకలలా వెంటాడుతుంది. అమెరికా అధ్యక్షులందరిలోకి తీవ్రమైన ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న వాడు బుష్.




ఈ సంఘటన వెంటనే టి.విలలో పదే పదే ప్రసారం కావటంతో ప్రపంచ వ్యాప్తంగా జైదీకి ప్రశంసల జల్లు కురిసింది. గంట గంటకు ఈ వీడియో దృశ్యానికి ప్రజాదరణ పెరిగింది. బుష్‌పై విసిరిన బూట్ల జతలోని ఒక్క బూటుకే 48 కోట్ల రూపాయలు ఇచ్చి కొనడానికి సౌదీ అరేబియాలోని ఒక వ్యక్తి ముందుకొచ్చాడు. లిబియా అధ్యక్షుడు ముహమ్మద్ గడాఫీ కుమార్తె నేతృత్వంలోని ఒక బృందం జైదీ సాహసానికి మెచ్చుకుంటూ అతడికి శౌర్య పతకాన్ని ప్రకటించింది. జైదీ ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిచాడని పేర్కొంటూ అతడిని వెనెజులా అధ్యక్షుడు హ్యూగో చావెజ్ ప్రశంసించాడు. ఇరాక్ పార్లమెంటులో జైదీ విడుదలను డిమాండ్ చేస్తూ పట్టుబట్టడంతో గందరగోళం చెలరేగింది. స్పీకర్ రాజీనామా చేస్తాననేంత సీరియస్‌గా చర్చ జరిగింది.

జైదీ ఇప్పుడు అరబ్ దేశాలకు ఆరాధ్యుడయిపోయాడు. ఈజిప్టులో ఒక పెద్ద మనిషి తనకు విలువైనది కూతురే కనుక కూతురునిచ్చి పెండ్లి చేస్తానన్నాడు. ఆమె పేరు అమల్‌సాద్‌గుమా, జర్నలిజం విద్యార్థి. "జైదీ వంటి సాహసవంతుడితో జీవితం పంచుకోవడం చాలా ఇష్టం, ఇది నాకు గౌరవంగా భావిస్తాను. ఇరాక్‌లో వుండడం నాకు ఇష్టమే" అని ప్రకటించింది.

ఇక బుష్‌కు జరిగిన అవమానంపై మీడియాలో విస్తృత ప్రచారం జరిగింది. పత్రికలు పతాక శీర్షికలతో కథనాలు ప్రచురించాయి. దీనిపై వెల్లువెత్తిన కార్టూన్లు, జోకులు, ఇంటర్నెట్‌లో బుష్‌పై బూట్లు విసిరే ఆటలు కూడా పుట్టుకొచ్చాయి. 'ఇరాక్' ఈ ఆదివారాన్ని అంతర్జాతీయ చెప్పుల దినంగా ప్రకటిస్తుందని" సౌదీ రాజధాని రియాద్‌లో, "కొండొలిజారైస్‌పై చెప్పులు విసిరే ధైర్యశాలి ఎవరు" అని పాలస్తీనాలోని రమల్లాలో జోకులు, వ్యంగ్యాస్త్రాలు వెల్లువెత్తాయి.

సంఘటన జరిగిన వెంటనే జైదీని భద్రతా బలగాలు నిర్బంధించి, దీని వెనక ఎవరైనా వున్నారా? అని ఇంటరాగేషన్ జరిపాయి. మత్తు పదార్థాలు సేవించిన మైకంలో బూట్లు విసిరాడా? అని కూడా విచారించాయి. ఎవరి ప్రమేయం లేకుండా అత్యంత ధైర్య సాహసాలతో జైదీ తనకు తానుగానే ఈ సాహసానికి పూనుకున్నాడని తేలింది. అందుకు అతడు అంతకుముందు అనేక రోజుల పాటు గురితప్పకుండా బూట్లు విసరడం సాధన చేశాడని, ఇటువంటి సాహసమేదో చేస్తాడని ఊహించానని అతని సోదరుడు చెప్పాడు.

ఆ తర్వాత జైదీని విడుదల చేయాలని ఇరాక్ అంతటా మూడు రోజులు పెద్ద యెత్తున ప్రజల నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఇవి కూడా బుష్ వ్యతిరేక ప్రదర్శనలుగా మారాయి. 2003లో ఇరాక్‌పై దండెత్తిన అమెరికా బలగాలు సద్దాం విగ్రహాన్ని కూల్చినపుడు, సద్దాం వ్యతిరేకులు ఆ విగ్రహాన్ని చెప్పులతో కొట్టిన చోటనే ఇప్పుడు వ్యతిరేకులు, అనుకూలురు అంతా కలిసి పెద్దయెత్తున చెప్పులతో బుష్ వ్యతిరేక నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. "బుష్, బుష్ బాగా విను: నీ నెత్తిన రెండు బూట్లున్నాయి" అనే నినాదాలు మిన్నుముట్టాయి. ముస్లిం దేశాలన్నింట జైదీ విడుదలకు ప్రజా ప్రదర్శనలు జరిగాయి. 2007లో ఇదే జైదీని సద్దాం వ్యతిరేక షియా వర్గ మిలిటెంట్లు కిడ్నాప్ చేసి, తర్వాత వదిలిపెట్టారు. కాగా, బూట్లు విసిరినందుకు పోలీసులు నిర్బంధించిన జైదీని విడుదల చేయాలని డిమాండు చేస్తూ, బుష్‌కు వ్యతిరేకంగా ప్రదర్శనలు నిర్వహించాలని తీవ్రవాద షియా మత నాయకుడు ముక్తదా అల్ సదర్ ముస్లిం ప్రజలకు పిలుపునిచ్చాడు. ఈ నిరసనలు తీవ్ర రూపం దాల్చి ఆత్మాహుతి కారుబాంబులుగా మారాయి. పశ్చిమ బాగ్దాద్‌లోని

ఒక తనిఖీ కేంద్రం దగ్గర ఆత్మాహుతి కారుబాంబు పేలుడులో ఐదుగురు పోలీసు అధికారులు చచ్చారు. ఆ విధంగా ఇరాక్ ప్రజల్లో నానాటికి పెరుగుతున్న అమెరికా వ్యతిరేక ఆగ్రహావేశాలు ప్రతిచిన్న అంశాన్ని అమెరికాకు, దాని కీలుబొమ్మ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎక్కుపెడుతున్నాయి.

ఇరాక్‌లోని కీలుబొమ్మ ప్రభుత్వం జైదీ తప్పుకు అతడికి వుద్యోగమిచ్చిన అల్-బాగ్దాదియా టి.వి. ఛానెల్ క్షమాపణలు చెప్పాలని డిమాండు చేసింది. మూడు నెలల విచారణ తర్వాత బాగ్దాద్ న్యాయస్థానం ముంతజర్ అల్-జైదీకి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ మార్చి 12న తీర్పు చెప్పింది. న్యాయస్థానంలో 'ఇరాక్ వర్థిల్లాలి' అంటూ జైదీ నినదించాడు.

2011 నాటికి ఇరాక్ నుంచి బలగాల ఉపసంహరణ, హింసను విరమించటంపై అమెరికా-ఇరాక్‌ల మధ్య జరిగిన భద్రతా ఒప్పందాన్ని ఎత్తిపడుతూ విజయోత్సవం జరుపుకోవడానికి వీడ్కోలు పర్యటన జరిపిన బుష్‌కు అది తీరని అవమానోత్సవంగా మారింది. "యుద్ధం అంతం కాలేదు, ప్రజా విజయంవైపు నిశ్చయాత్మకంగా సాగుతోంది''. అమెరికా పతనం ఆరంభమైంది. అది ఆర్థిక సంక్షోభంగా మారి అమెరికాను మరింతగా ఊబిలోకి గుంజుతున్నది. దీన్నుంచి బయటపడటానికి బలహీనమైన దేశాలపై అమెరికా సాగించే దురాక్రమణ, యుద్ధాలు, దౌర్జన్యాలు అమెరికాను మరింత పతనంలోకే నెడతాయి. ఇరాక్‌ను అదుపులోకి తెచ్చుకున్నాననుకుంటున్న అమెరికాకు ఆఫ్ఘనిస్తాన్‌లో, ఇరాక్‌లో ఉచ్చు బిగుసుకుంటూనే వుంది. వియత్నాం ఘోర పరాభవాన్ని అమెరికా మరొకసారి రుచిచూడకతప్పదు. దాని పతనంతోనే దాని దురాక్రమణ యుద్ధం, యుద్ధోన్మాదం అంతం అవుతాయి. అంతవరకు అమెరికాపై ప్రపంచ పీడిత ప్రజల యుద్ధం కొనసాగుతూనే వుంటుంది.

జైదీ సాహసం ప్రపంచ వ్యాప్తంగా అధికార దుర్మదాంధులపై దాడులకు ప్రజల్ని పురిగొల్పింది. చైనా ప్రధానిపైన, భారత ప్రధాని మన్మోహన్‌సింగ్, హోంమంత్రి చిదంబరంలపైనా, కర్నాటక ముఖ్యమంత్రి యడియూరప్ప పైనా చెప్పులు, బూట్లు పడ్డాయి. వీళ్లంతా ప్రజా వ్యతిరేకులే. దుర్మార్గమైన విధానాలతో ప్రజలపై విచ్చలవిడిగా దోపిడి సాగిస్తున్నందుకే వీళ్లపై బూట్లు పడ్డాయి. సామ్రాజ్యవాదంపై అనుకూల ప్రపంచ బ్యాంకు విధానాలు అమలుచేస్తూ, ప్రజల్ని నిర్వాసితుల్ని చేసి, రైతుల పంట భూములను (లక్షలాది ఎకరాలు) కార్పోరేట్లకు, ఎస్.ఇ.జడ్.లకు దారాదత్తం చేస్తూ, ఎదిరించిన ప్రజలపై లాఠీలు, తూటాలు ప్రయోగిస్తూ, పేదల్ని మరింత పేదరికంలోకి నెడుతున్నందుకే, వారి బతుకుదెరువును లాగేసుకుంటున్నందుకే ఈ ప్రజా వ్యతిరేకులపై చెప్పులు పడుతున్నాయి. నరహంతక పాలకులు తమ చుట్టూ ఎన్ని రక్షణ వలయాలు నిర్మించుకున్నా, ప్రజల ఆగ్రహావేశాలు ఏదో రూపంలో దహించక మానవు. నేడు జైదీ బూట్ల ప్రయోగాన్ని స్ఫూర్తిగా తీసుకున్న ప్రజలు, రేపు శ్రామికవర్గ విముక్తి కోసం సాగుతున్న విప్లవోద్యమం స్ఫూర్తిగా ఆయుధాలు అందుకుని పాలకులను, దోపిడి వ్యవస్థను కూలదోస్తారు. ★

---

*(...4వ పేజీ తరువాయి)*

ఒక సంవత్సర కాలంగా మీడియా మొత్తుకుంటున్న ఎన్నికలు పూర్తయ్యాయి. ఫలితాలొచ్చి పాలకులు సీట్లు సర్దుకున్నారు. ఇక ఊహాగానాలకు అవకాశం లేకుండా వాస్తవాలే మళ్లీ మనల్ని భూమి మీద నిలబెట్టి నడిపిస్తాయి. రోజువారీ సమస్యలు యధా ప్రకారం వెంటాడి వేటాడుతాయి. "నిన్ను నీవు తెలుసుకో. నీ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని తెలుసుకో'' అంటూ జ్ఞానబోధ చేస్తాయి. 'రాజీపడతారా? ఎదురు తిరుగుతారా? ప్రేక్షకులుగానే నిలిచిపోతారా?' అని కర్తవ్యం గుర్తు చేస్తాయి. ఎవరేం చేస్తారో చరిత్ర నమోదు చేసుకుంటూ ముందుకుసాగిపోతూనే వుంటుంది.

గతంతో పోల్చుకుంటే కాశ్మీర్‌లో ప్రజలపై సైనిక దాడులు, విచక్షణారహిత హింస కొంత తగ్గినా, మణిపూర్‌లో మరింత తీవ్రమయ్యింది. సి.పి.ఐ.(మావోయిస్టు) నాయకత్వంలో నిర్మాణమవుతున్న ఉద్యమ ప్రాంతాల్లో ప్రభుత్వ హింస అత్యధిక స్థాయిలో వుందని ఆసియా మానవహక్కుల వేదిక తెలియజేస్తున్నది. పాలకవర్గాల అణచివేతే దాడులకు, బూటకపు ఎన్నికల ప్రహసనాలకు వ్యతిరేకంగా ప్రజలనూ చైతన్యపరచి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయాలి.

ప్రపంచ ఆర్థిక సంక్షోభం భారతదేశంలో ఆర్థిక సంక్షోభాన్ని పెంచింది. సమస్యలు మరింతగా పెరిగాయి. కాంగ్రెస్ అధికారంలో స్థిరంగా కనబడినా ఇది తాత్కాలికమే. ప్రజా ఉద్యమాలు రాజకీయ అస్థిరతకు దారితీస్తాయి. ఈ పరిస్థితుల అనుకూలత ప్రజలను విస్తృతంగా సమీకరించడానికి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు, పాలకవర్గాల దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు భూమికను ఏర్పరుస్తున్నాయి. ప్రజలకు ఎన్నికల పార్టీల మీద భ్రమలు తొలగుతున్న సమయంలో ప్రత్యామ్నాయ విప్లవ మార్గాన్ని ముందుకు తీసుకువెళ్లాలి. ప్రజా గెరిల్లా సైన్యాన్ని విస్తృతపరిచి, ప్రజా విముక్తి సైన్యంగా అభివృద్ధిపరచాలి, ప్రజా రాజ్యాధికారాన్ని విస్తరించి విముక్తి ప్రాంతాలను ఏర్పరచాలి. ప్రజలకు నిజమైన ప్రజాస్వామ్యాన్ని సాధించి తీరాలి. ★

# పోరాటాలు - సభలు - ప్రతిఘటన

**ఏ.ఓ.బి**

## విశాఖ డివిజన్

### నగల వ్యాపారిపై పి.ఎల్.జి.ఎ. దాడి

ఎం.సి.రెడ్డి. అనే నగల వ్యాపారి రెడ్డి జ్యూవెలరీస్ పేరుతో వ్యాపారం చేసి పాడేరులో అనతికాలంలోనే లక్షలకు పడగలెత్తాడు. తాము పుట్టిన ప్రాంతంలో బ్యాంక్ నిల్వల్ని, స్థిరాస్తుల్ని పెంచుకుంటూ, విలువైన భూములకు అధిపతిగా ఎదిగాడు. నాసిరకం, రోల్డ్ గోల్డ్ బంగారంతో ఆదివాసుల అమాయకత్వాన్ని పెట్టుబడిగా చేసుకొని అక్రమంగా ఆర్జించిన ఎం.సి.రెడ్డి బి.జె.పి. పార్టీ, వి.హెచ్.పి.లోనూ పని చేస్తున్నాడు. పోలీసులకు పట్టుబడే చోరీ బంగారాన్ని పోలీసులతో కుమ్మక్కయ్యి చౌకగా కొనేసి అక్రమ వ్యాపారం చేస్తూ లక్షలు సంపాదించాడు. ఆదివాసీ చట్టాల్ని వుల్లంఘిస్తూ ఇక్కడి ఆస్తుల్ని, ప్రజల కష్టాల్ని అక్రమంగా దోచే ఇటువంటి వారి దోపిడీకి ప్రభుత్వాలు చట్టబద్ధత కల్పిస్తాయి. ఇతన్ని ప్రశ్నించిన ప్రజలను పోలీసులతో కుమ్మక్కయి వేధించేవాడు.

దోపిడీ ప్రభుత్వాలకు, పోలీసులకు వేలకొలది లంచాలు ఇస్తూ అక్రమ పద్ధతుల్లో బతికే ఇలాంటి బడా షావుకారులకు బుద్ధిచెప్పాలని నిశ్చయించుకున్న పి.ఎల్.జి.ఎ. ఈ ప్రజా వ్యతిరేకిపై 2008 సెప్టెంబర్‌లో కాల్పులు జరిపింది. అయితే తీవ్రగాయాలతో ఇతను తప్పించుకున్నాడు.

ఈ ఘటన అనంతరం పాడేరులోని ముఖ్యమైన బడా షావుకారులందరూ తాము పుట్టి పెరిగిన మైదాన ప్రాంతాలకు పరుగులు తీశారు. తమ ఆస్తులను ఏజెన్సీ నుండి తరలించుకున్నారు. చుట్టూ పోలీస్ స్టేషన్లు, పోలీసుల బలం ఎంత వున్నా తమ అక్రమ ఆస్తులకు, ప్రాణాలకు గ్యారంటీలేదని తెలుసుకున్నారు. మరికొందరు ప్రజలకు, బడా వ్యాపారులు వుద్యమానికి లొంగి ఉంటామని వర్తమానాలు పంపారు.

### ప్రజాపీడకుల పీడవిరగడ

విశాఖ జిల్లా లోతుగెడ్డ పంచాయితిలోని మేడూరు గ్రామానికి చెందిన రామారావ్, సొణాలు ఆదివాసులు. ఉద్యమం బలంగా వున్నచోట ఫారెస్టు అధికారుల దోపిడీ, దౌర్జన్యాలకు నూకలు చెల్లాయి. ఉద్యమం బలహీనంగా వున్నచోట ప్రభుత్వం వి.ఎస్.ఎస్.ల రూపంలో మళ్లీ ఫారెస్ట్ అధికారుల జులుంను అమలుచేయ చూస్తోంది. వి.ఎస్.ఎస్. ఛైర్మన్, సెక్రటరీల పదవులు ఆదివాసులకే కట్టబెడుతోంది. మొక్కలు నాటించడం, గోతులు తవ్వించడం పేరుతో లక్షల డబ్బును వీరు స్వాహా చేస్తున్నారు. కొమ్మ నరికినా, మేకలు, పశువులు అడవిలో మేసినా అక్రమ కేసుల్లో ఇరికించడం ప్రభుత్వానికి తొత్తులుగా పని చేయడం వి.ఎస్.ఎస్.ఛైర్మన్, సెక్రటరీల పని. రామారావ్, సొణాలు మేడూర్‌లో ఈ పాత్రనే పోషించారు. ఈ గ్రామంలోని నూకదొర్లకు చెందిన 30 కుటుంబాలు పొట్టకూటి కోసం టేకు చెట్లు నరికి ఫారెస్ట్ జులుంను ఎదిరిస్తూ వ్యవసాయయోగ్య భూములుగా తీర్చిదిద్దారు. ఈ కుటుంబాలపై అక్రమ కేసులు పెట్టించిన ఫలితంగా ఎన్నో సంవత్సరాలు జైళ్లలో మగ్గాల్సి వచ్చింది. ఈలోగా వీరు నరికిన భూములు రామారావ్, సొణాలు సొంతం చేసుకున్నారు. వీళ్లు తాము ఆక్రమించుకున్న భూముల్లో కొన్ని ఉంచుకొని మిగతావి అమ్ముకున్నారు. జైలు నుండి బయటికొచ్చిన నూకదొర కుటుంబాలు తాము నరికిన భూములు తమకే దక్కాలని కోర్టులు, రాజకీయ నాయకుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగారు. అయినా ఫలితం లేకుండా పోయింది. రామారావ్, సొణాలు మాత్రం భూస్వాములుగా పడగలెత్తారు. గ్రామంలో ఆర్థిక, రాజకీయ ఆధిపత్యాన్ని సంపాదించారు. గ్రామంలో భూమిలేని కువ్వి, నూకదొర కుటుంబాలు వీరి భూముల్లో వెట్టి కూలీలుగా జీవితం గడపాల్సిందే. ఈ గ్రామమేకాదు చుట్టుపక్కల గల సొడరాయి, కోటకొండ, లోతుగడ్డ ఫారెస్టు భూముల్ని కూడా రామారావే ఆక్రమించాడు. చాలా వరకు అమ్మేశాడు.

మేడూర్ గ్రామానికి అరగంట దూరంలో కోరుకొండ వచ్చే రోడ్డుపై రామారావు ఒక గ్రామాన్నే ఏర్పరిచాడు. అది తన పేరుమీదే 'రామారావుపాలెం'గా నామకరణం చేసాడు. అక్కడ రామారావ్, సొణాలు రెండు అద్దాలమేడలు కట్టుకున్నారు. చుట్టూ పూరిగుడిసెల నడుమ ఈ మేడలు వుంటాయి. ఈ ప్రాంతంలో ఇంతటి చక్కని భవనాలు ఎవరికీ లేవు. గ్రామంలో ఏ తగువు జరిగినా వీరే పంచాయితీ చేస్తారు. దగ్గరలో వున్న అన్నవరం పోలీస్ స్టేషన్‌లోని ఎస్.ఐ., సి.ఐ.లు వీరిమాట వినాల్సిందే. గ్రామంలో ఈమధ్య కాలంలో అమ్మాయిలపై వీరి మనుషుల వికృత చేష్టలకు అడ్డులేదు. 'ప్రశ్నిస్తే కంప్లయింట్ మేమే రాసిస్తాము, వెళ్లి పోలీస్ స్టేషన్‌లో ఇచ్చుకోండి' అని విర్రవీగేవాళ్లు. సి.పి.ఐ.లో జిల్లా స్థాయి నాయకులుగా గుర్తింపు పొందారు. పండుగలకు, ఇతర పునస్కారాలకు పోలీసు స్టేషన్లకు అవసరమైనవన్నీ సమకూర్చి పంపటం వీరి ఆనవాయితి.

వీరి ఆగడాలను భరించలేమని ఖచ్చితంగా శిక్షించాల్సిందేనని ప్రజలు సంఘటితమయ్యారు. 2008, నవంబర్ 30న మేడూర్ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వంద మంది, సాయుధ మిలీషియా మరో వంద మంది కలిసి రామారావ్, సాణాల ఇండ్లపై దాడి చేశారు. వారి మోటారు సైకిళ్లను తగులబెట్టారు. మరికొన్ని ఆస్తులను పంచుకున్నారు. వీరిద్దరికి మరణశిక్ష విధించారు. ఇన్ని సంవత్సరాలుగా దోపిడీ దౌర్జన్యాలతో అధికారం చెలాయిస్తూ ప్రజల్ని వేధించే వీరు చావడంతో ఈ ప్రాంత ప్రజల్లో సంతోషం వెల్లివిరిసింది. మరుసటిరోజు గ్రామ ప్రజలు బహిరంగంగానే పత్రికల వారితో వీరిద్దరూ చావడం సంతోషకరమైనదని మాట్లాడారు. ప్రజల మనోభావాలు కొన్ని దినపత్రికల్లో విస్తృతంగా ప్రచారమయ్యాయి. ప్రజాపీడకులుగా, ప్రజా ఉద్యమాల్ని వ్యతిరేకిస్తూ పోలీసుల అండతో విర్రవీగిన వీళ్లు, ప్రజల చేతుల్లో చావడంతో ప్రజాపీడకులకు ఏనాటికైనా శిక్ష తప్పదనే సత్యం మరోసారి ఆవిష్కృతమైంది.

## పి.ఎల్.జి.ఎ. వారం సందర్భంగా...

విశాఖ జిల్లాలోని కోరుకొండ ఏరియా పరిధిలో విప్లవ ప్రజలు పి.ఎల్.జి.ఎ. 8వ వారోత్సవాన్ని ప్రతి సంవత్సరంలాగే ఈసారి కూడా ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ వారోత్సవాల సందర్భంగా సభలు, సమావేశాలు జరుపుకున్నారు. ఏరియాలో వివిధ కార్యక్రమాలు జరుపుకోవటానికి ఏసీ నాయకత్వంలో ప్రణాళికబద్ధంగా కార్యక్రమాల్ని ప్లాను చేసుకుని అమలుచేశారు. ప్రజాద్రోహుల్ని శిక్షించటం, కరువు దాడులు, బహుళజాతి సంస్థల ఆస్తులు ధ్వంసం చేయడం, పోస్టర్లు, బ్యానర్ల ద్వారా విస్తృత ప్రచారం చేయడం, రోడ్లకు అడ్డంకులు కల్పించడం, పునాది బలగాలకు రాజకీయ, మిలటరీ తర్ఫీదునివ్వటం, ఒ.ఎస్.ఎ.పి. పోలీసుల్ని బంధించడం, పి.ఎల్.జి.ఎ.లోకి విస్తృతంగా భర్తీకావాలనే పిలుపుని ప్రజల్లోకి తీసుకెళ్లటం, స్థూప నిర్మాణాలు చేయడం వంటి కార్యక్రమాల్ని రూపొందించుకున్నారు.

## అమరుల స్థూప నిర్మాణం

2008 జూలై అమరుల సంస్మరణా వారం సందర్భంగా 'బలిమెల' విజయోత్సాహంతో ఈ స్థూపాల నిర్మాణం ఒక క్యాంపెయిన్‌లా సాగింది. ఇది ఎక్కువగా కోరుకొండ, పెదబయలు ఏరియాల్లోని ఆంధ్ర ప్రాంతంలో జరిగింది. పి.ఎల్.జి.ఎ. వారోత్సవాల సందర్భంగా ఒడిస్సా ప్రాంతంలో గతంలో నిర్మాణం కాకుండా మిగిలిన గ్రామాలన్నింటా మళ్లీ ఒక క్యాంపెయిన్‌లాగే ప్రజలు అమరుల స్థూపాల్ని నిర్మాణం చేసారు.

కోరుకొండ ఏసీ పరిధిలోని ఒడిస్సా రాష్ట్రం కుడుములగుమ్మ బ్లాక్‌లో బోడ్‌పొదర్, బొడపొడ, పప్పర్‌మట్ల, రాళ్లగడ్డ పంచాయితీల్లో ఈ స్థూపాలు నిర్మాణం అయ్యాయి. కొన్ని గ్రామాలు ఐక్యంగా కలసికట్టుగా, మరికొన్ని గ్రామాలు ఏ గ్రామానికి ఆ గ్రామం విడిగా స్థూపాలు నిర్మించుకున్నాయి. ఈ నిర్మాణ కార్యక్రమాల్లో ఆడ, మగ అందరూ పాల్గొన్నారు. వీటికి అవసరమయ్యే సిమెంట్, ఇసుక, ఇటుక, రాళ్లు, రంగులు ప్రజలే చందాలు వేసుకొని తెప్పించారు. ఈ సందర్భంగా 29 గ్రామాల్లో నూతన స్థూపాలు నిర్మితమయ్యాయి. వేల సంఖ్యలో ప్రజలు ఈ నిర్మాణాల కోసం కదిలారు.

గత కొన్ని సంవత్సరాలుగా ఉద్యమ కార్యకలాపాలు, నిర్మాణ బలం తగ్గివున్న గ్రామాల్లో కూడా మళ్లీ ప్రజలు గునికిరాయి, బలిమెల దాడుల ప్రేరణతో అమరులైన కామ్రేడ్స్ స్మరణార్థం స్థూపాలు నిర్మించుకున్నారు. చిత్రకొండ నుండి బొడపొడ వరకు ఒ.ఎస్.ఎ.పి. పోలీసులు నిత్యం సంచరించే ఈ ప్రధాన రహదారి పొడుగునా స్థూపాలు వెలిశాయి. ఒ.ఎస్.ఎ.పి. క్యాంపుకు కూతవేటు దూరంలో ఉన్న ఇటు జనబ గ్రామంలో అటు బొడపొడ గ్రామంలో స్థూపాలు వెలిశాయి. చిత్రకొండకు 5 కి.మీ. దూరం నుండి మొదలు ఇటు ఆంధ్ర సరిహద్దు అయిన గొందిగూడ వరకు దాదాపు అన్ని గ్రామాల్లో ప్రజలు అమరుల స్థూపాలు నిర్మించుకొని నివాళులు అర్పించారు.

## జవాన్లను బందీలుగా పట్టుకున్న పి.ఎల్.జి.ఎ.

ఒడిస్సా రాష్ట్రంలోని కుడుములగుమ్మ బ్లాక్ పరిధిలోని బొడపొడు పంచాయతీలోగల పప్పర్‌మెట్ల పోలీస్ ఠాణా, బొడపొడు ఒ.ఎస్.ఎ.పి. ఔట్‌పోస్ట్ కలిసి బొడపొడలో ఏర్పాటు చేశారు. ఇందులో ఒ.ఎస్.ఎ.పి.కి చెందిన సుమారు 60 మంది పోలీసులు వున్నారు. గతంలో పి.ఎల్.జి.ఎ. బలగాలు బొడపొడ, బొడిగెడ్డ ఔట్ పోస్టులపై దాడి చేసి ఆయుధాల్ని స్వాధీనం చేసుకున్నాయి. ఈ క్రమంలో బొడిగెడ్డలో పోస్టును ఎత్తేసారు. ప్రస్తుతం బొడపొడలో దీన్ని కలిపే కొనసాగిస్తున్నారు.

ఆంధ్ర పోలీసులు ఒడిస్సాలోకి కూంబింగులకు వచ్చినప్పుడల్లా బొడపొడ క్యాంపులో సేదతీరటం, అన్నపానీయాలు ముగించుకుని తిరిగి వెళ్లటం చేస్తుంటారు. ఈ క్యాంపు నుండి చిత్రకొండకు ఇద్దరు, ముగ్గురు సివిల్‌లో జట్లుగా, చిన్న తుపాకులు ధరించి తిరుగుతుంటారు. వెళ్లి వస్తుంటారు. 2008, డిసెంబర్ 5వ తేదీన ఈ క్యాంపు నుండి జీపులో వస్తున్న నల్గురు ఒ.ఎస్.ఎ.పి. పోలీసులను పి.ఎల్.జి.ఎ.కు చెందిన జన మిలీషియా చిత్రకొండకు 10 కి.మీ. దూరంలో పనసగొంది గ్రామ సమీపంలో వీరిని పట్టుకున్నారు.

ప్రయాణికుల్ని దించేసి వీరిని చెక్ చేయగా ఎలాంటి తుపాకులు దొరకలేదు. వీరిని సమీప అడవుల్లోకి పట్టుకెళ్లి 18 గంటలపాటు వాళ్లతోనే వుంచుకున్నారు. ఈ సందర్భంగా పి.ఎల్.జి.ఎ. వారం నేపథ్యం, పార్టీ, పి.ఎల్.జి.ఎ., లక్ష్యాలు, పోలీసు బలగాల్లోని వివిధ స్థాయిలవారి పార్టీ వైఖరిని వివరించారు. బందీలతో పి.ఎల్.జి.ఎ. వ్యవహరించిన తీరుకు వారు ఉత్తేజితులయ్యారు. పొట్టకూటి కోసమే ఈ ఉద్యోగం చేస్తున్నాం తప్ప ఉద్యమంపై తమకు వ్యతిరేకత లేదని మాట్లాడారు. తమ డిపార్ట్‌మెంటులో పై అధికారులకు తమకు మధ్య కొనసాగుతున్న వివక్ష, చిన్నచూపు వంటి పలు విషయాల్ని వాళ్లు ఏకరువు పెట్టారు. పైస్థాయి అధికారుల్ని ఉద్యమం ఖచ్చితంగా టార్గెట్ చేయాలని కోరారు. మాపై పార్టీ దాడులు చేస్తే లొంగిపోవాలనే భావనతోనే ఉన్నామని చెప్పారు. “మీతో గడిపిన ఇన్ని గంటలు కూడా మమ్మల్ని బంధీలుగా పట్టుకున్నారన్న భావనే మాకు రాలేదు” అన్నారు. ఇన్నాళ్లూ పి.ఎల్.జి.ఎ., పార్టీ గుర్చి బయట వింటున్న తప్పుడు ప్రచారంతో పి.ఎల్.జి.ఎ. ప్రత్యక్ష ఆచరణని పోల్చుకొని ఎంతో ఉత్తేజితులు అయ్యారు.

వీరిని పట్టుకున్న విషయం ఒడిస్సా మొత్తం గుప్పున వ్యాపించింది. పి.ఎల్.జి.ఎ. వారోత్సవాల సందర్భంగా మావోవాదులు బందీలుగా పట్టుకెళ్లారన్న విషయం విస్తృతంగా ప్రచారం అయింది. ఈ ఘటన అనంతరం బొడపాడు ఔట్‌పోస్ట్‌లో చాలా మంది సిబ్బంది సెలవులపై వెళ్లిపోయారు. లోతట్టు ప్రాంతంలో విధులు నిర్వహించడానికి ససేమిరా అంటూ పోస్ట్‌ని ఎత్తేయాలని తమ సంఘం తరుపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పార్టీ విడుదల చేసిన పత్రికా ప్రకటన ప్రజల్లోనూ, ఒ.ఎస్.ఎ.పి. బలగాల్లోనూ మంచి ప్రభావాన్ని వేసింది.

## ఎస్సార్ కంపెనీ ఆస్తుల దగ్ధం

విశాఖ జిల్లా చింతపల్లి మండలం లోతుగెడ్డ పంచాయతీలోని రామారావ్‌పాలెం గ్రామానికి సమీపంలో ఎస్సార్ పైపులైను వెళ్లే లైనులో ఒక ఆఫీసు భవనం నిర్మించారు. దీనికి ఎల్లప్పుడు ఇద్దరు వాచ్‌మెన్‌లు కాపలా వుంటారు. దాదాపు 70 సోలార్ ప్లేట్లు ఏర్పర్చి వాటి విద్యుత్‌తో పైపులైను నుండి లోహాన్ని సక్రమంగా వెళ్లేలా చేస్తారు. గత టి.సి.ఒ.సి.లో పి.ఎల్.జి.ఎ. ఈ భవనాన్ని పేల్చిసి సోలార్‌లు స్వాధీనం చేసుకుని ప్రజలకు పంచింది. ఇదే స్థానంలో మళ్లీ కొత్తగా భవనాన్ని ఏర్పర్చి కంచే, గేటులను ఏర్పర్చారు. పి.ఎల్.జి.ఎ. వారం సందర్భంగా నవంబర్ 30న సాయుధ మిలీషియా, సెకండరీ బలగాలు కల్సి 70 మంది వరకు దీనిపై దాడిచేసి యంత్రాల్ని డీజిల్‌తో తగులబెట్టి నష్టం చేశారు. సోలార్ ప్లేట్లు స్వాధీనం చేసుకొని ప్రజలకు పంచారు.

## ప్రచారం

పాడేరు నుండి అన్నవరం మధ్య నాలుగైదు కేంద్రాల్లో ప్రధాన రహదారిపై విస్తృతంగా పోస్టర్లు వేసి బ్యానర్లు కట్టారు. గొండెలి సెంటర్, పి.కొహడపల్లి, బందవీది, మచ్చపురం, కొత్తపల్లి, కులుపాడు సెంటర్స్ మొత్తం 3,4 తేదీలలో పోస్టర్లూ, బ్యానర్లతో నిండిపోయాయి. రోడ్డుకు అడ్డంగా చెట్లు నరికి పడవేశారు. వందలాది బలగాల్ని రోడ్లపై పహారాకాయిస్తూ పి.ఎల్.జి.ఎ. వారోత్సవాల్ని అడ్డుకుంటామని ఎస్.పి., పోలీసు అధికారులు ప్రకటించుకున్నప్పటికీ జరుగుతున్న కార్యక్రమాలను చూసి పోలీసులు తలపట్టుకోక తప్పలేదు.

పెదబయలు మండల కేంద్రంలో కూడా పోస్టర్లు వెలిశాయి. జూనియర్ కాలేజి నుండి మొదలు ఎం.ఆర్.ఒ. ఆఫీస్ వరకు పి.ఎల్.జి.ఎ. నినాదాలతో పోస్టర్లు వెలిశాయి. నయాగఢ్, బలిమెల దాడుల్ని ఎత్తిపడ్తూ, పి.ఎల్.జి.ఎ. ను పి.ఎల్.ఎ.గా అభివృద్ధి చేయాలని, వందలాది నయాగఢ్, బలిమెల దాడుల్ని చేయాలని, పి.ఎల్.జి.ఎ.లో విస్తృతంగా భర్తీ కావాలని, ఎ.ఒ.బి. ఉద్యమాన్ని పురోగమింపజేద్దామనే నినాదాలతో విస్తృతంగా ప్రచారం చేశారు.

## పునాది బలగాలకు రాజకీయ, మిలటరీ తర్ఫీదు

పి.ఎల్.జి.ఎ. వారం సందర్భంగా నాలుగు రోజులపాటు విశాఖ డివిజన్‌లో పునాది బలగాలకు రాజకీయ, మిలటరీ తర్ఫీదును అందించారు. డిసెంబర్ 6 నుండి జరిగిన తర్ఫీదులో ఆర్.పి.సి. పరిధిలోని బేసిక్ మిలీషియా యూనిట్లు, ప్రజాసంఘాల నాయకత్వం జె.ఎం.ఎస్‌ల నుంచి 80 మంది వరకు పాల్గొన్నారు. మూడు రోజులపాటు జరిగిన క్లాసుల్లో వ్యూహం-ఎత్తుగడలు, విప్లవ ప్రజాకమిటీ సర్క్యులర్, మిలీషియా గురించిన డివిసి సర్క్యులర్, పార్టీ, సైనిక నిర్మాణాలు, ఆర్.పి.సి.ల మధ్య సమన్వయం గుర్చి చెప్పడమైంది. ఒకరోజు మిలటరీ తర్ఫీదులో ఆంబుష్‌లు, ప్రయిమరీ వెపన్ పొజిషన్స్, సింగిల్ యాక్షన్స్, మిలీషియా చర్యల కొత్త రూపాల గురించి చెప్పడమైంది.

ఈ క్యాంపు విజయవంతం చేయడానికి స్థానిక గ్రామ నాయకత్వం నుంచి అయిదుగురితో నిర్వహణ కమిటీ ఏర్పడింది. ఈ కమిటీ తిండి, రక్షణ, నిర్వహణ బాధ్యతను నిర్వహించి క్యాంపును విజయవంతం చేసింది.

## ఎన్.టి.

## ఖమ్మం డివిజన్

### ప్రచారం

2008 అక్టోబర్ నెలలో వెంకటాపురం ఏరియా పరిధిలోని ఆదివాసీ ప్రజలు ఆదివాసీ హక్కులను హరించి వేస్తోన్న కొత్త అటవీ చట్టంను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పేద ప్రజల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని ప్రచారం చేశారు.

పి.ఎల్.జి.ఎ. 8వ వార్షికోత్సవం సందర్భంగా వారం రోజులపాటు ఈ పరిధిలోని 30 గ్రామాలలో పోస్టర్లు, బ్యానర్లు వేశారు. కాగడాలతో ప్రదర్శనలు చేశారు. సంఘాలు బలంగా వున్న ఆరు గ్రామాల్లో సభలు జరిగాయి. అయిదు గ్రామల్లో రోడ్లపై బ్యానర్లు కట్టి శత్రువును చికాకుపర్చడానికి డమ్మీ బాంబులు పెట్టారు. దానితో శత్రువు భయభ్రాంతులకు గురయ్యాడు. ప్రచారాన్ని అడ్డుకోవడానికి పోలీసులు రాత్రీపగలు విస్తృతంగా కూంబింగ్స్ చేసినప్పటికీ ఆ నిర్బంధం మధ్యనే ప్రచారం విజయవంతం అయింది.

### ఇన్ఫార్మర్లకు శిక్షలు

వెంకటాపురం మండలం ఆలుబాక పంచాయతి పరిధిలోని కొండాపురం గ్రామానికి చెందిన సతీష్ గ్రామ సేవకుడి (సుంకరి)గా పని చేస్తూనే ఇన్ఫార్మర్‌గా మారాడు. ఇతనికి సి.ఐ., ఎస్.ఐ.లతో దగ్గరి సంబంధాలు వుండేవి. పోలీసు బ్యాచీలకు గైడ్‌గా పని చేయడం కోసం పోలీసులు ఇతనికి 10 వేల రూపాయలు ఇచ్చారు. దళాన్ని చుట్టుముట్టి కాల్పులు జరపడానికి వీలుగా సరైన సమాచారం ఇస్తే లక్ష రూపాయలు ఇస్తామని పోలీసులు ఒప్పందం కుదుర్చుకున్నారు. దానితో 2008, డిసెంబర్ 10న రాత్రి ఈ ప్రజా ద్రోహిని పి.ఎల్.జి.ఎ. ఖతం చేసింది.

చర్ల మండలంలోని సత్యనారాయణపురం గ్రామస్తుడైన సూర్యనారాయణ మేకల వ్యాపారం చేస్తూ వుండేవాడు. ఇతను సి.పి.ఎం. నాయకుడిపై దాడి జరిగినట్లు సృష్టించి, మిలీషియా వాళ్లు ఆ దాడి చేశారని ఆరోపిస్తూ వాళ్లను పట్టుకొని కొట్టి పోలీసులకు అప్పగించాడు. మిలీషియా, దళ సమాచారాన్ని సి.పి.ఎం. కార్యకర్తలకూ, పోలీసులకు చేరవేసేవాడు. ఈ ద్రోహిని 2008 సెప్టెంబర్‌లో పి.ఎల్.జి.ఎ. ఖతం చేసింది.

చర్ల మండలం తిప్పాపురం పంచాయతి రాళ్లగట్ట గ్రామానికి చెందిన మాడవి ఉంగాల్‌ను పోలీసులు అరెస్టు చేసి లొంగదీసుకొని ఆంధ్ర-ఛత్తీస్‌గఢ్ బార్డర్‌లో పోలీసు బ్యాచీలకు గైడ్‌గా పని చేయడానికి శిక్షణ కోసం హైదరాబాద్‌కు పంపారు. ఐదు వేల రూపాయలు కూడా ఇచ్చారు. పి.ఎల్.జి.ఎ. ఇతన్ని పట్టుకొని విచారించి చంపివేసింది.

వీరిని చంపడంతోపాటు తిప్పాపురం, కొత్తపల్లి, పూసుగుప్ప గ్రామాలకు చెందిన మరికొందరు ఇన్ఫార్మర్లకు దేహశుద్ధి చేసి, హెచ్చరించి వదిలేశారు.

### పోలీసులపై కాల్పులు

ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించడానికి వచ్చిన రాష్ట్ర, సి.ఆర్.పి.ఎఫ్. పోలీసు బలగాలు పూజారి కాంకేర్‌లో మకాం వేశాయి. ప్రధాన, సెకండరీ, మిలీషియా బలగాలు కలిసి 2008, నవంబర్ 13 నాడు రాత్రి 12 గంటలకు పోలీసు మకాంపై కాల్పులు జరిపాయి. నిద్రలో నుండి ఉలిక్కిపడి లేచిన పోలీసులు ఎదురుకాల్పులు చేశారు. మరునాడు ఉదయం 8 గంటలకు పి.ఎల్.జి.ఎ. బలగాలు మరోసారి కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో గందరగోళపడిన పోలీసులు కేకలు వేసుకుంటూ దారులు విడిచి గుట్టల పైనుండి పారిపోయారు. ఈ ఘటన ప్రజల్లో మంచి ప్రభావాన్ని వేసింది.

## వెంకటాపురం ఏరియాలో శత్రు నిర్బంధం

ఏరియాలో రోజు రోజుకూ శత్రు నిర్బంధం బాగా పెరుగుతోంది. అర్ధరాత్రి ఇండ్లపై దాడి చేసి దొరికిన వాళ్లను పట్టుకుపోతున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌కు కాకుండా డి.ఎస్.పి., ఎస్.పి.ల దగ్గరికి తీసికెళ్లి అక్కడ ఇంటరాగేట్ చేసి ఆ తర్వాత స్థానిక పోలీస్ స్టేషన్‌లకు తీసుకువస్తున్నారు. అక్కడ నిర్బంధించి ఊరివాళ్లందర్నీ తీసుకురావాలనీ లేకుంటే ఊళ్లను తగులబెడ్తామని బెదిరిస్తున్నారు. దళాల ఆచూకీ చెప్పాలని నిర్బంధిస్తున్నారు. గ్రామంలో మావోవాదులు బ్యానర్లు, పోస్టర్లు వేసినా, పోలీసులపై, ఇన్ఫార్మర్లపై దాడులు చేసినా మీదే బాధ్యత అంటూ బెదిరిస్తున్నారు. ఎవర్ని ఎప్పుడు పట్టుకుపోతారోననే భయంతో ప్రజలు ఊళ్లో పడుకోవడానికి భయపడి అడవిలో పడుకుంటున్నారు. ఒకవేళ ఊళ్లో, పడుకుంటే అయిదారు ఇళ్లవాళ్లు కలిసి ఒకేచోట పడుకుంటున్నారు. కొంత మందిని 'ఎన్‌కౌంటర్' చేస్తమని భయపెట్టడం, ఇన్ఫార్మర్లుగా తయారు కావాలని వత్తిడి చేయడం మూలంగా మానసిక, శారీరక వత్తిడిని తట్టుకోలేక ఈ మధ్య పెంకవాగు గ్రామానికి చెందిన నర్సింగరావు అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినాడు. గతంలో కూడా మొట్లగూడెం గ్రామానికి చెందిన కుర్సం సమ్మయ్య, దూలపురం గ్రామానికి చెందిన కోరం నారాయణ, బొల్లాపురం గ్రామానికి

చెందిన ఇర్ర వెంకటేశ్వర్లు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఒకవైపు కరువుతో ఆర్థిక పరిస్థితులు దిగజారిపోతుంటే రాజ్యహింస వల్ల ప్రజలు అటవీ ఉత్పత్తులు సేకరించుకోవడానికి భయపడిపోతున్నారు. కస్తూరిపహాడ్ గ్రామానికి చెందిన ఒక మహిళ అడవిలో కనబడితే దళాల ఆచూకీ చెప్పమని వేధించారు. ఆమెను వెతుక్కుంటూ వచ్చిన భర్తను పట్టుకొని బాగా కొట్టారు.

ఏరియాలోని గ్రామాల్లో, మండల కేంద్రాల్లో మావోయిస్టు వుద్యమానికి వ్యతిరేకంగా సభలు, సమావేశాలు, కౌన్సిలింగ్‌లు, నక్సలైట్ సమస్యపై ఇష్టాగోష్టులు ఏర్పాటు చేస్తున్నారు.

యువతీ యువకులకు రకరకాల ఉపాధిని కల్పించడం కోసం శిక్షణ ఇప్పించే పేరుతో తీసికెళ్లి ఇన్ఫార్మర్లుగా మార్చుతున్నారు. సెల్ ఫోన్లు, సైకిల్ మోటార్లు, డబ్బులు ఇస్తున్నారు. ఉద్యమంపై దుష్ప్రచారం చేస్తున్నారు.

అయితే ఈ దుష్ప్రచారాన్ని ప్రజలు తిప్పికొడుతున్నారు. ఈ మధ్య పూసుగుప్ప, మొలకలపల్లి గ్రామాల్లో ఇటువంటి దుష్ప్రచారానికి పాల్పడినపుడు ప్రజలు బాగా వ్యతిరేకించారు. ''మీరు డబ్బుల ఆశ చూపి ప్రజలను ఇన్ఫార్మర్లుగా మార్చుతున్నందువల్లనే నక్సలైట్లు అటువంటి వారిని చంపుతున్నారని'' మాట్లాడారు.

ఎంత నిర్బంధం ప్రయోగించినా, దుష్ప్రచారాలకు పాల్పడినా ప్రజలను ఉద్యమాలకు దూరం చెయ్యలేరనే విషయం దీని ద్వారా స్పష్టమవుతుంది.

## అరెస్టులు

శబరి ఏరియా కమిటీ పరిధిలోని చింతూరు మండలం అందాలపాడు గ్రామాన్ని ఫిబ్రవరి మొదటి వారంలో పోలీసులు చుట్టుముట్టి గ్రామస్తులందరినీ నిర్బంధించి సంఘ నాయకత్వం గురించి ప్రశ్నించారు. కానీ సంఘ నాయకత్వం ముందే తప్పుకున్నారు. దీనికి కొద్ది రోజుల ముందు ఈ గ్రామంలో ఈశ్వర్ అనే ఒక ఇన్ఫార్మర్‌ను పి.ఎల్.జి.ఎ. చంపివేసింది. 'ఈశ్వర్ గురించి మీరే దళానికి చెప్పారు' అంటూ గ్రామస్తులందర్నీ వేధించారు. ఆ తర్వాత ఆ గ్రామం నుండి ఓ నలుగురిని తమతోపాటు తీసికెళ్లిపోయారు. తీసుకెళ్తుంటే ప్రజలంతా అడ్డుకున్నారు. అయినప్పటికీ పోలీసులు తీసికెళ్లిపోయారు. ఆ తర్వాత గ్రామస్తులంతా పోలీసు స్టేషన్‌కు వెళ్లి పెద్ద ఎత్తున ఘర్షణకు దిగారు. అయినప్పటికీ పోలీసులు వారిని వదిలిపెట్టలేదు.

ఈ నల్గురినేకాక డీకే నుండి ఎ.పి.కి కూలీ కోసం వెళ్లిన ముగ్గురు పురుషులను పట్టుకెళ్లారు. వెళ్తూ వెళ్తూ బట్టుగూడెం గ్రామంకుపోయి అక్కడ ఇద్దర్ని పట్టుకున్నారు. ఇలా మొత్తంగా తొమ్మిది మందిని పట్టుకుపోయి పోలీస్ స్టేషన్‌లో పెట్టారు. ఇంకా ఇటువంటి అరెస్టులు మరికొన్ని జరిగాయి ఈ ఏరియాలో. ★

*(...6వ పేజీ తరువాయి)*

అమలుచేయవచ్చు. జనతా ప్రజాస్వామిక వ్యవస్థ నిర్మాణం దీర్ఘకాలిక లక్ష్యంగా ఉండాలి. బూర్జువా ప్రజాస్వామ్యం, నూతన ప్రజాస్వామ్యంల మధ్య ఒక పరివర్తనా దశ వుంటుందని మూడు దశల సిద్ధాంతాన్ని కా. ప్రచండ చెబుతున్నారు. పునాదిలో మార్పు రాకుండా బూర్జువా పార్టీలలో పరివర్తనను ఆశిస్తున్న భారత కమ్యూనిస్టు (రివిజనిస్టు) పార్టీలు సుదీర్ఘ కాలంగా (50 సం.) చేసిన ప్రయోగాలు మనకు ఎన్నో విలువైన పాఠాలనే ఇచ్చాయి.

విశాల ప్రజానీకాన్ని కఠినమైన వర్గ పోరాటంలోకి మిలిటెంట్‌గా కదిలించకుండా వ్యవస్థను మౌలికంగా పునర్నిర్మించడం సాధ్యం కాద''ని మార్క్సిజం బోధిస్తున్నది. ప్రజల అధికారాన్ని స్థాపించి, నిజమైన ప్రజాస్వామ్యాన్ని అమలుచేసే క్రమంలో సాయుధ తిరుగుబాటుతో సహా, అన్ని విధాలుగా పోరాటాన్ని తీవ్రం చేయాలి. నూతన ప్రజాస్వామిక వ్యవస్థ ఏర్పాటుకు మరోమార్గం లేదు'' అని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) చెబుతున్నది. ''పార్లమెంటరీ పంథాతో వ్యవస్థలో మౌలికమైన మార్పు సాధించలేమని, వర్గపోరాటం ద్వారానే సాధ్యమని'' దృఢంగా నమ్ముతుంది. "ఉనికిలో వున్న రాజ్యాన్ని ధ్వంసం చేయకుండా నూతన నేపాల్‌ను నిర్మించాలనుకోవడం ఒట్టి భ్రమ'' అని కూడా స్పష్టపరిచింది.

నేపాల్ ప్రజలకు తిండి, బట్ట, గూడుతోపాటు ప్రజాస్వామ్యం కావాలి. ప్రజలు పోరాడింది, ప్రజాయుద్ధంలో ప్రాణత్యాగం చేసింది అందుకే. ఎన్నికల రాజకీయాల క్రీడలో విలువైన అనుభవాన్ని ఇప్పటికే నేపాల్ మావోయిస్టులు గ్రహించారు. అన్ని రంగులు విస్పష్టంగానే గోచరించాయి. ప్రపంచ దేశాల అనుభవాలకుతోడుగా మరో వినూత్న అనుభవ పాఠం నేర్చుకున్నారు. ఇండోనేషియా, చిలీ, నికరాగువా వంటి కమ్యూనిస్టు పార్టీలు అధికారంలోకి వచ్చిన దేశాల్లో సామ్రాజ్యవాదుల అండతో అక్కడి దోపిడీ వర్గాలు ప్రతీఘాతుక కుట్రలు, మారణకాండలు జరిపి అధికారాన్ని కూల్చాయి.

ఇక్కడ కూడా అవే శక్తుల పునరేకీకరణ జరుగుతున్నది. ప్రజల ముందున్న మార్గం ఒక్కటే- ప్రజాసైన్యం నిర్మించి ప్రజాయుద్ధం ద్వారా ప్రజారాజ్యాన్ని గెలవడం.

*(...44వ పేజీ తరువాయి)*

ప్రస్తుతం శ్రీలంక అని పిలువబడుతున్న దేశంలో ఒకప్పుడు రెండు రాజ్యాలుండేవి. ఉత్తరం వైపు వున్న రాజ్యం తమిళులదైతే దక్షిణం వైపు వున్న రాజ్యం సింహళీయులది. తమిళులూ, సింహళీయులూ ఇరువురూ స్థానికులు కాదు. తమిళులు మన దేశంలోని తమిళనాడు నుండి వలస వెళ్లిన వారు కాగా, సింహళీయులు ఒడిస్సా-బెంగాల్ ప్రాంతం నుండి వలస వెళ్లినవారు. కొన్ని వేల సంవత్సరాల క్రితం వెళ్లారు కనుక, వీరిరువురిలో ఎవరు ముందు వలస వెళ్లారో తెలియడానికి చారిత్రక ఆధారాలు లేవు. నిజానికి ఎవరు ముందు వెళ్లారన్న ప్రశ్న అవసరం లేనిది. ఎవరు ముందు వెళ్లినా వీళ్లు రెండు జాతులుగా, రెండు రాజ్యాలుగా స్థిరపడ్డారనేది చారిత్రక వాస్తవం. ఈ రెండు రాజ్యాల మధ్య యుద్ధాలు జరిగాయి. తర్వాత ఈ రెండు రాజ్యాలను బ్రిటీష్ వాళ్లు ఆక్రమించుకొని వలసలుగా మార్చుకున్నారు. రెండింటినీ ఒకే దేశంగా కలిపి సిలోన్ అని నామకరణం చేశారు. భౌతికంగా రెండు రాజ్యాలను కలిపేసినంత మాత్రానా రెండు జాతుల మధ్య విభేదాలు సమసిపోలేదు పైగా పెరిగాయి. అధిక సంఖ్యలో వున్న సింహళీయులు అల్పసంఖ్యాకులైన తమిళుల పట్ల వివక్షను చూపేవారు. ఈ వివక్షకు వ్యతిరేకంగా తమిళులు బ్రిటీష్ పాలకులకు అనేకసార్లు వినతిపత్రాలు ఇచ్చారు. కానీ సమస్యలేవీ పరిష్కారం కాలేదు. 1948లో బ్రిటీష్ వాళ్లు వెళ్లిపోయాక కూడా ఇది ఒకే దేశంగా వుంది. కానీ సింహళీయులు దాన్ని తమ దేశంగానే భావించారు. మిగతా వాళ్లంతా తమకు లోబడి వుండాలన్నట్టు ప్రవర్తించారు. భారత్ నుంచి తేయాకు తోటల్లో పని చేయడానికి వచ్చిన లక్షల మంది తమిళుల పౌరసత్వాన్ని బ్రిటీష్ వాళ్లు వెళ్లిపోయిన సంవత్సరమే రద్దు చేశారు. 1949లో వారి ఓటు హక్కును రద్దు చేశారు. తమిళులు భారతదేశానికి చెందిన వాళ్లుగా సింహళీయులు భావిస్తారు. ఆ లెక్కన వాళ్లు కూడా భారతదేశానికి చెందిన వాళ్లే కానీ వాళ్లు సింహళ అనే ప్రత్యేక భాషను తయారు చేసుకొని ప్రత్యేక జాతిగా ఏర్పడ్డారు, కానీ తమిళులు తమిళనాడు ప్రజానీకం మాట్లాడే భాషే మాట్లాడుతున్నారు అనేది వాళ్ల వాదన. తమిళనాడుకు దగ్గరగా ఉండడం వల్ల శ్రీలంక తమిళులు సాంస్కృతిక పరంగా ఏ మార్పు చెందకపోవచ్చు. అయినంత మాత్రాన తమవలెనే కొన్ని వేల సంవత్సరాల క్రితం వలస వచ్చి ప్రత్యేక రాజ్యంగా ఏర్పడి స్థిరపడిపోయిన వాళ్లను పరాయి దేశస్తులనడం చాలా దుర్మార్గం. తమ మాతృభూమి తమదని తమిళులు న్యాయబద్ధంగా మాట్లాడుతుండగా, మొత్తం శ్రీలంక తమదని సింహళీయులు అహంకారంగా మాట్లాడుతున్నారు. 1956లో దీనికి పరాకాష్టగా సింహళ ఓన్లీ (సింహళ భాష ఒక్కటే) అనే చట్టాన్ని తెచ్చారు. మిగతా భాషలనూ, సంస్కృతులనూ అణచివేసే ఈ వైఖరిని తమిళులు సహజంగానే వ్యతిరేకించారు, శాంతియుతంగా తమ నిరసనను తెల్పారు. అయితే శాంతియుతంగా కూడా తమల్ని ప్రశ్నించడం సహించలేని సింహళీయులు తమిళులపై దాడులు చేశారు. పోలీసులు కూడా అణచివేతకు పూనుకున్నారు. ప్రతిగా 1958లో బట్టికలోవా ప్రాంతంలో కొందరు తమిళ యువకులు సింహళీయులపై, పోలీసులపై కాల్పులు జరిపారు, అలా హింస, ప్రతిహింసకు దారితీస్తుందని నిరూపించారు. 1961లో గాంధేయ మార్గాన్ని అనుసరించే ఫెడరల్ పార్టీకి చెందిన కొందరు పులిప్ పద్దై (పులుల సైన్యం) అనే సంస్థను ఏర్పాటు చేశారు. తమిళులకు మాతృభూమి తమ లక్ష్యమని వీరు ప్రకటించారు. ఫెడరల్ పార్టీ అధ్యక్షుడు చెల్వనాయకం 'తమిళ ఈలం' పిలుపు కూడా ఇచ్చాడు. అలా తమిళ జాతి అస్తిత్వ పోరు బలపడసాగింది. శాంతియుత పోరాటంలో హింసను ప్రేరేపించింది సింహళీయులే అని చెప్పుకున్నాం. అంతేకాదు హత్యలను ప్రారంభించింది కూడా సింహళీయులే. సింహళ భాషకు ప్రాధాన్యతను ఇస్తూ చేసిన చట్టాల వల్ల నిరసన తలెత్తడంతో, తమిళానికి కూడా సముచిత స్థానాన్ని ఇస్తామని ఒక చట్టాన్ని చేసినందుకు గాను, ప్రధాని బండారు నాయకేను ఒక సింహళీయుడు కాల్చి చంపాడు. శ్రీలంకలో ఇది మొదటి రాజకీయ హత్య కాగా రెండవ రాజకీయ హత్య జాఫ్నా మేయర్ దురియప్పన్‌ది. తమిళుడై వుండి సింహళీయులతో రాజీపడుతున్నాడని 1975లో ఇతన్ని ప్రభాకరన్ కాల్చి చంపాడు.

అలా ప్రభాకరన్ అంత వరకూ తమిళజాతి పోరాడుతున్న గాంధేయ మార్గానికి భిన్నంగా హింసకు ప్రతిహింసే సమాధానమని చాటుతూ రంగం మీదికి వచ్చాడు.

### అలలు అలుగా ఎగిసిన 'పులుల' పోరు

జాఫ్నా మేయర్‌ను హత్య చేసి అందరి దృష్టిని ఆకర్షించిన ప్రభాకరన్ 1976లో తమిళ ఈళం (తమిళ రాజ్యం) స్థాపనే లక్ష్యంతో ఎల్.టి.టి.ఇ. (లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ ఈలం)ని ఏర్పాటు చేశాడు. అంతవరకూ అంటే 28 ఏళ్లుగా శాంతియుతంగా జరుగుతున్న పోరాటాలకు భిన్నంగా ఎల్.టి.టి.ఇ. తమిళ ఈలం ఏర్పాటుకు సాయుధ పోరాటమే ఏకైక మార్గంగా ప్రకటించుకుంది. స్థాపించినప్పటి నుండి తన అమరత్వం వరకూ ప్రభాకరనే ఎల్.టి.టి.ఇ.కి చీఫ్‌గా వున్నాడు.

ఎల్.టి.టి.ఇ. ఏర్పడగానే ప్రజల్లోని జాతి విముక్తి ఆకాంక్షను ప్రజ్వలింపచేసి వారిని సంఘటితం చేయడం ప్రారంభించింది. తమిళ జాతి ప్రజాస్వామిక ఆకాంక్షలను సహించలేని సింహళ

దురహంకార శ్రీలంక ప్రభుత్వం 1983 నాటికి తమిళ ప్రజలపై విచక్షణారహిత దాడులను తీవ్రం చేసింది. ఈ దాడుల్లో 4 వేల మంది తమిళులు ప్రాణాలు కోల్పోయారు. ప్రభుత్వ పాశవిక దాడిని తిప్పికొట్టడానికి ఎల్.టి.టి.ఇ. పెద్ద ఎత్తున ప్రతిఘటించింది. దీన్ని మొదటి ఈలం యుద్ధం అని ఎల్.టి.టి.ఇ. అభివర్ణించింది. అద్భుతమైన యుద్ధ నైపుణ్యంతో, వీరోచితమైన త్యాగాలతో ప్రతిఘటించి ఎల్.టి.టి.ఇ. శ్రీలంక సైన్యానికి అనేక అపజయాలను చవిచూపించింది. శ్రీలంక సైన్యానికి అండగా భారత్ 1987లో దాదాపు లక్ష మంది సైనికులను పంపింది. భారత్ సేన కూడా ఎల్.టి.టి.ఇ. చేత గట్టి దెబ్బలు తిన్నది. 1987 అక్టోబర్ నుండి 1989 ఏప్రిల్ వరకూ భారత సైన్యంతో హోరా హోరీగా పోరాడిన తర్వాత ఎల్.టి.టి.ఇ. తన ఎత్తుగడలను మార్చుకొని అద్భుతమైన దౌత్యపరమైన సమర్థతలను ప్రదర్శించి శ్రీలంక ప్రభుత్వంతో చర్చలకు సిద్ధమైంది. భారత సైన్యాన్ని వెనక్కి పంపించాలని ఎల్.టి.టి.ఇ. పెట్టిన షరతును నాటి ప్రేమదాస ప్రభుత్వం ఒప్పుకోక తప్పలేదు. దానితో 1990లో భారత్ సేనలు ఇంటి ముఖం పట్టాయి. ఇరువర్గాలకు చర్చలు మొదలయ్యాయి కానీ ప్రేమదాస ప్రభుత్వం మౌలిక సమస్యల పరిష్కారం పట్ల చిత్తశుద్ధిని ప్రదర్శించలేదు. ఎల్.టి.టి.ఇ. వ్యతిరేక తమిళ గ్రూపులతో ఏకాభిప్రాయం సాధించాలనే పేరుతో ప్రభుత్వం చర్చల్ని నీరుగార్చింది. మరోవైపు శ్రీలంక సాయుధ సేనలు, తమిళ టైగర్లపట్ల దూకుడుగా ప్రవర్తించాయి. కొన్ని చోట్ల ఘర్షణలు కూడా జరిగాయి. ఫలితంగా 1990 జూన్‌లో మళ్లీ శ్రీలంక ప్రభుత్వానికీ, ఎల్.టి.టి.ఇ.కీ నడుమ యుద్ధం బద్దలయింది. దీన్ని రెండవ ఈలం యుద్ధంగా పిలిచారు.

ఈ కాలం నాటికి శ్రీలంక సైన్యం 70 వేల సంఖ్యకు పెరిగింది. ఆధునిక ఆయుధాలను సమకూర్చుకుంది. కౌంటర్ ఇన్‌సర్జన్సీ యుద్ధతంత్రంలో శిక్షణ పొందింది. దానితో అది తనను తాను అతిగా వూహించుకొని ఎల్.టి.టి.ఇ.ని ఓడించగలననుకుంది. కానీ భారత సైన్యాన్ని ముప్పుతిప్పలు పెట్టిన అనుభవంతో ఎల్.టి.టి.ఇ. మరింత ఆత్మవిశ్వాసంతో వుండింది.

ఈ కాలంలో ఇరువర్గాల మధ్య యుద్ధం అతి భీకరంగా జరిగింది. గెరిల్లా ఆంబుష్‌ల నుండి సంప్రదాయక యుద్ధ స్థాయికి ఎదిగింది. మెరుపు దాడులతో పాటు కొన్ని నెలల తరబడి కొనసాగిన యుద్ధాలు చోటు చేసుకున్నాయి. శ్రీలంక బలగాలు అత్యున్నత ఫైర్ పవర్‌ను ఉపయోగించుకొని వైమానిక, నావికా దళాలతో చేసే సంయుక్త ఆపరేషన్లపై ఆధారపడ్డాయి. విచక్షణా రహితంగా బాంబులు కురిపించి సాధారణ ప్రజలను పొట్టన పెట్టుకున్నాయి. ఎల్.టి.టి.ఇ. పరిస్థితులకు అనుగుణంగా తన ఎత్తుగడలను మార్చుకుంటూ చొరవను నిలుపుకుంది. ఈ కాలంలోనే జాఫ్నా వంటి ప్రాంతాన్ని తన స్వాధీనంలోకి తెచ్చుకుంది. అదే సమయంలో తాము ఆక్రమించుకున్న ప్రాంతాలను నిలబెట్టుకోవడానికి శ్రీలంక బలగాలకు శక్తికి మించిన పనైపోయింది.

ఇదే కాలంలో ఎల్.టి.టి.ఇ. ప్రభావవంతమైన రెండు రాజకీయ హత్యలకు పాల్పడి తన శక్తి సమర్థతలను చాటుకుంది. తమిళుల పైకి సైన్యాన్ని పంపి ఊచకోతకు కారకుడైన రాజీవ్‌గాంధీని 1991లో మానవబాంబు ద్వారా మట్టుబెట్టి తమిళ జాతి ప్రజల కసిని తీర్చింది. అదే విధంగా సింహళ జాతి ప్రతినిధియైన అధ్యక్షుడు ప్రేమదాస తమిళ జాతి ఆకాంక్షలను ఉక్కుపాదంతో అణచివేసినందుకుగాను 1993లో ప్రేమదాసను చంపి తన ప్రజల హృదయ జ్వాలలను ఉపశమింపజేసింది.

1995లో మరోసారి యుద్ధ విరమణ జరిగింది. అయితే కొద్ది కాలానికే మూడవ ఈలం యుద్ధం ప్రారంభమైంది. ఇదే సంవత్సరం ఎల్.టి.టి.ఇ. జాఫ్నాను కోల్పోయింది. 2002లో నార్వే మధ్యవర్తిత్వంతో చారిత్రాత్మక కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. చర్చలు మొదలయ్యాయి. 2003లో టైగర్లు శాంతి ప్రక్రియ నుండి విరమించుకోవడంతో యుద్ధం పునఃప్రారంభమైంది. ఈ యుద్ధంలో ఎల్.టి.టి.ఇ. చాలా ప్రాంతాల్లో పట్టు సాధించింది.

ఇలా సంవత్సరం క్రితం వరకూ ఎల్.టి.టి.ఇ. పోరాటం అప్రతిహతంగా కొనసాగుతూ వచ్చింది. సంఖ్యా పరంగానూ ఆయుధపరంగానూ తనకంటే ఎన్నోరెట్లు వున్న శ్రీలంక సైన్యాన్ని ఓడించి విజయాలను సాధించింది. శ్రీలంక సైన్యాన్నే కాదు ప్రపంచంలోని శక్తివంతమైన వాటిల్లో ఒకటైన భారత సైన్యాన్ని ముప్పుతిప్పలు పెట్టింది. సుదీర్ఘ కాలంపాటు జరిగిన ఈ పోరులో కిలినొచి, ముల్లయితీవు, మన్నార్, వావునియా, ఎలిఫెంట్‌పాస్, బట్టికలోవా మొదలైన పలు ప్రాంతాలను స్థావర ప్రాంతాలుగా అభివృద్ధి చేసింది. మధ్య మధ్యలో కొన్ని స్థావర ప్రాంతాలను చేజార్చుకున్నా మళ్లీ యుద్ధం చేసి గెలుచుకుంది.

అలా మొత్తంగా 2005 నవంబర్‌లో రాజపక్సే అధికారంలోకి వచ్చేనాటికి శ్రీలంకలోని మూడవ వంతు భాగం ఎల్.టి.టి.ఇ. స్వాధీనంలో వుండింది. అంటే అది సాధించదల్చుకున్న తమిళ ఈలంలోని మెజారిటీ ప్రాంతంలో స్థావర ప్రాంతాలను ఏర్పాటు చేసింది. ఈ విజయాలతో సమకాలీన జాతి విముక్తి పోరాటాల్లో అత్యున్నత స్థాయికి చేరింది.

అయితే ఈ విజయం వెనుక ఎల్.టి.టి.ఇ. చేసిన ఎన్నో త్యాగాలున్నాయి, ధారపోసిన నెత్తురుంది. అన్నింటినీ మించి సరైన యుద్ధతంత్రం వుంది. ఆ యుద్ధ తంత్రాన్ని సమర్థవంతంగా

అన్వయించిన ఆచరణ వుంది. అవసరమైన ఎత్తుగడలను చేపట్టడంలోనూ, పరిస్థితులకు అనుగుణంగా ఎత్తుగడలను వేగంగా మార్చుకోవడంలోనూ, చొరవను తమ చేతిలోనే అట్టిపెట్టుకోవడంలోనూ ఎల్.టి.టి.ఇ. విశేషమైన ప్రతిభా పాటవాలను చూపింది. జాఫ్నా పోరాటంలో అది చేపట్టిన దృఢమైన ఆత్మరక్షణా క్యాంపెయిన్, భారత సైన్యపు ఆక్రమణపూరితమైన దాడిని విఫలం చేయడానికి వారు ఉపయోగించిన ఎత్తుగడల పద్ధతులూ సమకాలీన గెరిల్లా యుద్ధ తంత్రంలోనే అమోఘమైన పరిణామంగా గుర్తిస్తున్నారు. ఆఖరికి భారత మిలటరీ విశ్లేషకులు కూడా దాన్ని అంగీకరిస్తున్నారు. చర్చలను కూడా ఎల్.టి.టి.ఇ. ఒక ఎత్తుగడగా సమర్థవంతంగా ఉపయోగించుకుంది. యుద్ధంలో వెసులుబాటు అవసరమైనప్పుడు చర్చలకు వెళ్లి, చొరవను తమ చేతిలోకి తీసుకొని తిరిగి యుద్ధాన్ని తీవ్రతరం చేసింది.

పటిష్టమైన యుద్ధ తంత్రాన్ని ఆచరణలోకి తీసికెళ్లడం కోసం ఎల్.టి.టి.ఇ. శక్తి వంతమైన సైనిక విభాగాన్ని ఏర్పాటు చేసుకుంది. ఇది పదాతి దళం (టైగర్స్) నావికాదళం (సీ టైగర్స్), వాయుసేన (ఎయిర్ టైగర్స్)లను కల్గి వుంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ మూడు సేనలను కల్గి వుండిన సంస్థ ఎల్.టి.టి.ఇ. ఒక్కటే. ప్రత్యేక మహిళా మిలటరీ విభాగాన్ని కల్గి వున్న ఏకైక సంస్థ కూడా ఎల్.టి.టి.ఇ.నే. మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి, వారు తమ శక్తిని చాటుకోగల్గే అన్ని అవకాశాలను కల్పించి, శత్రు బలగాలకు ధీటుగా వారిని తయారు చేయడంలో ఎల్.టి.టి.ఇ. తీవ్రమైన, శాస్త్రీయమైన కృషిని చేసి ఫలితాలు సాధించింది. 1987లో బ్లాక్ టైగర్స్ పేరుతో ఆత్మాహుతి దళాలను తయారు చేసింది. ఆత్మాహుతి దళాలను మొదటగా తయారు చేసిన సంస్థ కూడా ఎల్.టి.టి.ఇ.నే. శక్తివంతమైన ఇంటెలిజెన్స్ విభాగాన్ని ఏర్పాటు చేసుకుంది. దేశ విదేశాల్లో విస్తృతమైన సెక్షన్లతో సంబంధాలు ఏర్పరుచుకుంది, విస్తృత ప్రజానీకపు మద్దతును కూడగట్టింది.

ఎల్.టి.టి.ఇ. రాజకీయంగా పరిపక్వతనూ, దూర దృష్టినీ కల్గి వుండింది. అందుకే 1987 నాటి రాజీవ్-జయవర్ధనే ఒప్పందాన్ని వ్యతిరేకించింది. ఒప్పందంలోని ప్రధాన అంశమైన ఫెడరలిజం స్వతంత్ర రాజ్య భావనకు హాని చేకూర్చుతుందని భావించింది. ఈ ఒప్పందాన్ని ఆమోదించి సింహళ ప్రభుత్వంతో రాజీపడ్డ తమిళ సంస్థలను ఎల్.టి.టి.ఇ. ఎండగట్టింది, వాటిపై సాయుధ దాడులకు పూనుకుంది.

ఈ విజయాల్లో ప్రజల పాత్ర చాలా కీలకమైనది. ప్రజల చురుకైన భాగస్వామ్యమూ, మద్దతూ లేకుండా ఈ విజయాలను ఊహించలేం. తమిళ ప్రజల జాతి విముక్తి ఆకాంక్షల నుండే పుట్టిన ఎల్.టి.టి.ఇ. ఆ ఆకాంక్షలకు నిర్మాణాత్మకమైన సాయుధ పోరాట రూపాన్నిచ్చింది. ప్రజలంతా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో యుద్ధ రంగంలో పాల్గొనడం వల్లనే ఇన్ని స్థావర ప్రాంతాలు ఏర్పడగల్గాయి.

ఇలా శక్తివంతమైన సైన్యంతో, సరైన యుద్ధ తంత్రంతో ప్రజల చురుకైన భాగస్వామ్యంతో ఎల్.టి.టి.ఇ. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న జాతి విముక్తి పోరాట సంస్థలకే కాదు, వర్గ పోరాటం చేస్తోన్న విప్లవ సంస్థలకు కూడా ఆదర్శంగా, ప్రేరణగా, అనుసరణీయంగా మారింది. అదే సమయంలో దోపిడీవర్గాల కంట్లో నలుసైంది. అందుకే 30 దేశాలు ఎల్.టి.టి.ఇ.ని నిషేధించాయి.

ప్రపంచవ్యాప్తంగా ఇంతటి గుర్తింపును పొందిన ఒక ఉన్నత సంస్థగా ఎల్.టి.టి.ఇ.ని తీర్చిదిద్దడంలో ప్రభాకరన్ పాత్ర అద్భుతమైనది. అందుకే ఆయన పెద్ద పులిగా ప్రపంచ ప్రఖ్యాతి పొందాడు.

## ఈలం పోరులో చారిత్రక విషాదం

ప్రస్తుతం ఓటమికి గురైన ఈ యుద్ధం రెండేళ్ల క్రితం రాజపక్సే అధికారంలోకి వచ్చాక మొదలైంది. ఎల్.టి.టి.ఇ. చాలా దృఢంగా ప్రతిఘటించినప్పటికీ అది క్రమంగా ఒక్కో స్థావర ప్రాంతాన్నీ కోల్పోతూ వచ్చింది. ముఖ్యంగా ఈ సంవత్సరం జనవరి మొదటి వారంలో తమిళ ఈలపు రాజకీయ రాజధానిగా ప్రసిద్ధి పొందిన కిలినొచ్చి శ్రీలంక దళాలు ఆక్రమించడం ఎల్.టి.టి.ఇ.కి పెద్ద దెబ్బ. కిలినొచ్చిని ఎల్.టి.టి.ఇ. మొదట 1990లో స్వాధీనం చేసుకుంది. 95లో దానిని లంక దళాలు దురాక్రమించాయి. 98లో మళ్లీ ఎల్.టి.టి.ఇ. స్వాధీనం చేసుకున్న తర్వాత అది తమిళుల రాజధానిగా మారింది. కిలినొచ్చిని దురాక్రమించడానికి శ్రీలంక దళాలు ఒకటిన్నర నెలలు పోరాడాయి. చివరికి ఎల్.టి.టి.ఇ. దాన్ని ఖాళీ చేసి వెళ్లాక మాత్రమే లంక దళాలు ఆ పట్టణంలోకి అడుగుపెట్టగల్గాయి. లంక దళాలు అడుగుపెట్టేప్పటికి పట్టణంలో ఒక్క పురుగు కూడా లేదు. సైన్యమూ, ప్రజలూ ఖాళీ చేసి వెళ్తూ పూచిక పుల్లను కూడా వదిలిపెట్టలేదు. ఇళ్ల పైకప్పు రేకులూ, తలుపులూ, కిటికీలు సహా అన్నీ పట్టుకెళ్లిపోయారు. నగరంలో చిన్న కాగితపు ముక్కను కూడా వదిలిపెట్టలేదని శ్రీలంక మిలటరీ అధికారులు నివ్వెరపోతూ ప్రసార మాధ్యమాలకు చెప్పారు. కిలినొచ్చి పట్టణం చుట్టూ వున్న ఏడు, ఎనిమిది మీటర్ల ఎత్తయిన గోడ, ఎనిమిది అడుగుల లోతున్న నీళ్లతో నిండిన కందకాలూ... ఇవన్నీ ఎల్.టి.టి.ఇ. యుద్ధతంత్రాన్నీ, యుద్ధంలో ప్రజల పాత్రనూ తెలిపేవే. అంతేకాదు అక్కడ జరిగిన పోరాటంలో ఎల్.టి.టి.ఇ. నుండి ప్రాణ నష్టమూ తక్కువగానే వుంది. కిలినొచ్చిని

ఆక్రమించుకున్న తర్వాత సైన్యం ఎల్.టి.టి.ఇ.కి వ్యూహాత్మక ప్రాంతమైన ఎలిఫెంట్‌పాస్, సైనిక ప్రధాన కేంద్రమైన ముల్లయ్‌తీవుల వైపుకు సాగిపోయింది. అది విచక్షణా రహితంగా ప్రజల అవాసాల మీద, ఆస్పత్రుల మీద, గ్రామాల మీద విమానాల ద్వారా బాంబు దాడులు చేస్తూ క్రమంగా ఒక్కో గ్రామాన్నీ, పట్టణాన్నీ దురాక్రమించుకుంటూ పోయింది. ఈ విచక్షణా రహితమైన దాడులపట్ల ప్రపంచ వ్యాప్తంగా వ్యతిరేకత రావడంతో శ్రీలంక ప్రభుత్వం భారీ ఆయుధాలను ఉపయోగించనని ఒకవైపు మాట్లాడుతూనే మరోవైపు తన దాడులను ఎప్పటిలాగే కొనసాగించింది. ఈ పరిస్థితిలో ఓటమి అంచుకు చేరిన ఎల్.టి.టి.ఇ. మే 17న యుద్ధ విరమణను ప్రకటించింది. అయినప్పటికీ లక్ష్యపెట్టని లంక ప్రభుత్వం అంతర్జాతీయ యుద్ధ నియమాలకు విరుద్ధంగా యుద్ధాన్ని కొనసాగించింది. ఈ క్రమంలో మే 18న ప్రభాకరన్‌తోపాటు రాజకీయ విభాగపు నేత బాలసింగం, ఇంటలిజెన్స్ చీఫ్ పొట్టు అమ్మన్, బ్లాక్ టైగర్స్ చీఫ్ రమేష్, సీ టైగర్స్ చీఫ్ సుశీ, ఇంకా ప్రముఖ నాయకులు పులిదేవన్, సుందరం, రత్నం మాస్టర్, కపిల్ అమ్మన్, నటేషన్, ఇలంగోవన్ మొదలైన 18 మంది ముఖ్యమైన నాయకులు చనిపోయారని లంక ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో ప్రభాకరన్ పెద్ద కొడుకు చార్లెస్ ఆంటోనీ కూడా ఉన్నాడు. ఇతను వాయు సేనలో ముఖ్యమైన పాత్ర వహిస్తూండినాడు. ఈ తీవ్రమైన నష్టాలతో 24 ఏళ్ల పాటు ఎల్.టి.టి.ఇ. నేతృత్వంలో స్ఫూర్తిదాయకంగా జరిగిన తమిళ విముక్తి పోరుకు ఒక సుదీర్ఘ విరామం ఏర్పడినట్టయింది. ప్రస్తుత ఓటమి ప్రపంచ పోరాటాల చరిత్రలో ఒక విషాదకరమైన అధ్యాయంగా మారిపోయింది.

### ఓటమికి కారణాలేంటి?

ఈ ఓటమికి గురవడంలో ఎల్.టి.టి.ఇ. చేసిన పొరపాట్లేంటి? ఎత్తుగడల పరమైన వైఫల్యాలేంటి? అనేది మనకు అర్థం కావాల్సే వుంది. అయితే ఓటమికి దారితీసిన బాహిర కారణాలు మాత్రం స్పష్టంగానే తెలుస్తున్నాయి. భారత ప్రభుత్వ, అమెరికా సామ్రాజ్యవాదుల మద్దతు, సహాయ సహకారాలతో శ్రీలంక ప్రభుత్వం అత్యంత పాశవిక హింసను ప్రయోగించి ఎల్.టి.టి.ఇ.నీ, తమిళ ప్రజల ఆకాంక్షలను అణచివేసిందనేది స్పష్టాతి స్పష్టం. రాజపక్షే అధికారంలోకి వచ్చినప్పటి నుండీ చాలా స్పష్టంగా ఎల్.టి.టి.ఇ.తో సైనిక పరిష్కారం, తమిళులతో రాజకీయ పరిష్కారం అని చెప్తూ వచ్చాడు. నిజానికి తమిళులకు రాజకీయ పరిష్కారం అనేది బూటకపు మాట. ఎల్.టి.టి.ఇ.తో సైనిక పరిష్కారానికి నిరసన రాకుండా ఉండడానికి, తమిళులతో రాజకీయ పరిష్కారం అనేది ముసుగు. ఎల్.టి.టి.ఇ.నీ తమిళులనూ వేరు చేసే కుట్ర ఇది. తమిళుల సమస్యకు రాజకీయ పరిష్కారం కోసమే ఎల్.టి.టి.ఇ. సైనిక మార్గాన్ని స్వీకరించింది. తమిళులు కోరుకుంటున్న రాజకీయ పరిష్కారం లభిస్తే అసలు ఎల్.టి.టి.ఇ. ఇంత రక్తాన్ని ధారపొయ్యాల్సిన అవసరమే లేదు. అధికారంలోకి వచ్చినప్పటి నుండీ ఈ పాటే పాడుతున్న రాజపక్సే అంతర్జాతీయంగా వచ్చిన ఏ అభిప్రాయాన్ని లెక్కచెయ్యలేదు. ఎల్.టి.టి.ఇ.ని ఓడించడమే లక్ష్యంగా సైన్యాన్ని బలోపేతం చేశాడు. పదాతి, వాయు, నావికా దళాల సంఖ్యను రెండు లక్షలకు పెంచాడు. మొత్తం శ్రీలంక జనాభా రెండు కోట్ల లోపే. అందులో తమిళుల జనాభా 20 లక్షల లోపే. జనాభాతో పోల్చితే సైనిక నిష్పత్తి ఎక్కువగా ఉన్న దేశాలలో ఇది ఒకటి. ఎల్.టి.టి.ఇ. అవలంభించిన యుద్ధతంత్రం నుంచి కూడా ప్రభుత్వ సైన్యం పాఠాలు నేర్చుకుంది. ఈ రెండేళ్లలో రక్షణ ఖర్చును కూడా ఎక్కువగా పెంచింది. 2008లో 1660 కోట్లు వుంటే 2009కి గాను 1771 కోట్లు కేటాయించింది. ఎంత మంది ప్రజల ప్రాణాలను బలిపెట్టయినా విజయాన్ని సాధించాలనే దుష్ట లక్ష్యంతో విచక్షణారహితంగా గ్రామాలూ, పట్టణాలపై వైమానిక దాడులు చేసింది. ముల్లయ్‌తీవు జిల్లాలోని పుదుకుడియిరుప్పులో ఒక హాస్పిటల్‌లోని చిన్న పిల్లల వార్డుపై బాంబులు వేయగా చాలా మంది పిల్లలూ, పెద్దలూ చనిపోయారని 2009, ఫిబవరి 3న చాలా పేపర్లు మొదటి పేజీల్లో ప్రచురించాయి. ఈ దశలో 15 నుండి 20 వేల వైమానిక దాడులు చేసిందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఒక్క 2008లోనే నాలుగు వేలకు పైగా టైగర్లను పొట్టన పెట్టుకుంది. ఈ యుద్ధం చివరి రోజునే 20 వేల మందిని చంపివేసిందని ప్రసార మాధ్యమాలు చెప్తున్నాయంటే, ఇంకా మొత్తంగా ఎన్నివేల మందిని చంపివేసిందో ఊహించవచ్చు. ఇలా సైనిక సంఖ్యను పెంచుకొని, ఆయుధ సంపత్తినీ, ఆధునిక శిక్షణనూ సాధించి, సామ్రాజ్యవాదుల అండతో ప్రజల మీద విచక్షణారహిత దాడులకు పాల్పడి రక్తపుటేరులు పారించి శ్రీలంక ఎల్.టి.టి.ఇ.ని అణచివేసింది. దాని ఆకృత్యాలను కప్పిపుచ్చుకోవడానికి అది ప్రసారమాధ్యమాలను ఉత్తర ప్రాంతంలోకి అడుగుపెట్టనీయలేదు.

### భారత్, అమెరికాల పాత్ర

దక్షిణాసియాలో పెద్దన్న వలె వ్యవహరిస్తోన్న భారత్ మొదటి నుండీ శ్రీలంక వ్యవహారంలో జోక్యం చేసుకుంటూ వస్తోంది. మొదట్లో భారత్ ఎల్.టి.టి.ఇ.ని చేరదీసింది. దానికి భారత్‌లోనే శిక్షణను ఇచ్చింది. నిజానికి భారత్‌కు ఏనాడూ శ్రీలంక తమిళుల సమస్యపట్ల సానుభూతి లేదు. అది శ్రీలంకను ఒక వ్యూహాత్మక ప్రాంతంగానే చూస్తుంది. అందుకే అక్కడి పాలకులను చెప్పుచేతల్లో పెట్టుకోవడం కోసం ఎల్.టి.టి.ఇ.ని చేరదీసింది. శ్రీలంక అధ్యక్షుడు

జయవర్ధనే విధేయతను చూపడంతో ఆ తర్వాత ఎల్.టి.టి.ఇ.కి హాని చేయడానికి సిద్ధపడింది. అందులో భాగంగా 1987లో రాజీవ్-జయవర్ధనే ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం తమిళ ఈలం భావననే విస్మరించింది. ఫెడరల్ పాలనను బలపరిచింది. ఈ ఒప్పందాన్ని శ్రీలంక తమిళులపై బలవంతంగా రుద్దడానికి, శాంతిని పరిరక్షించాలనే సాకుతో 1987లో భారత శాంతి పరిరక్షక బలగం (ఐ.పి.కె.ఎఫ్) పేరుతో భారత్ సైన్యాన్ని పంపింది. కానీ దాని అసలు ఉద్దేశ్యం ఎల్.టి.టి.ఇ.ని అణచడమే. తనకు సమీపంలో వున్న శ్రీలంకలో జాతి విముక్తి పోరాటాలు కొనసాగాలని అది కోరుకోదు. ఎందుకంటే ఆ పోరాట ప్రభావం భారత్‌లో జరుగుతున్న జాతి విముక్తి పోరాటాలను ప్రేరేపిస్తుందని దాని భయం. కానీ ఎల్.టి.టి.ఇ. అనుసరించిన చురుకైన ఎత్తుగడల వల్ల తన సైన్యాన్ని వెనక్కి పిలిపించుకోలేక తప్పలేదు. అంతేకాదు ఎల్.టి.టి.ఇ.తో జరిగిన పోరాటంలో భారత్ దాదాపు 1,250 మంది సైనికులను కోల్పోయింది. తాజాగా జరిగిన యుద్ధంలోనూ భారత్ చురుగ్గా జోక్యం చేసుకుంది. శ్రీలంక సైన్యానికి ఆధునిక రాడార్ వ్యవస్థనూ, ఆధునిక ఆయుధాలనూ సప్లయి చేసింది. 2008 ఆఖరులో ప్రణబ్‌ముఖర్జీ పార్లమెంటులో 'శ్రీలంకకున్న వ్యూహాత్మక ప్రాధాన్యతను మరచిపోవద్దు, అది దాని భద్రతకు సంబంధించిన విషయమే కాదు మన భద్రతతోనూ సన్నిహిత సంబంధం వుంది' అన్నాడు. భారత జాతీయ భద్రతా సలహాదారు ఎం.కె. నారాయణన్ శ్రీలంక రక్షణ కార్యదర్శి శరత్ ఫోన్సెకాను ప్రపంచపు గొప్ప ఆర్మీ కమాండర్ అని మెచ్చుకున్నాడు. ఈ సంవత్సరం జనవరిలో ప్రణబ్‌ముఖర్జీ శ్రీలంక వెళ్లి ప్రత్యక్షంగా సలహాలు ఇచ్చి వచ్చాడు. ఒకవైపు ఇలా యుద్ధాన్ని ప్రేరేపిస్తూ ఇంకోవైపు ముఖ్యంగా తమిళనాడు ప్రజల నుండి వస్తున్న వత్తిడిని దృష్టిలో పెట్టుకొని ప్రజల మీద దాడులు చేయవద్దనీ, మిలటరీ పరిష్కారం సరైంది కాదనీ అప్పుడప్పుడూ భారత్ ప్రకటనలు ఇస్తూ వచ్చింది. ఇప్పుడు యుద్ధం ఆగిపోగానే నిర్వాసితుల గురించి జాలి కురిపిస్తోంది. వెంటనే 500 కోట్ల సహాయాన్ని కూడా ప్రకటించింది. ఇదంతా భారత్‌లోని తమిళ ప్రజలను ప్రసన్నం చేసుకోవడానికి, మరోవైపు శ్రీలంక ప్రభుత్వంపై అదుపును సాధించడానికి. ఐక్యరాజ్యసమితి అధ్యక్షుడు బాన్‌కీమూన్ ఇండియా చెప్పినట్టు వినమని శ్రీలంకకు సలహా ఇచ్చాడంటే శ్రీలంకపై భారత్ పట్టు అర్థమవుతోంది.

తమిళనాడు ప్రజానీకం యుద్ధ విరమణ కోరుతూ ఆందోళనలు చేపట్టింది. ప్రజల వత్తిడి నుండి తప్పించుకోవడానికి డి.ఎం.కె. యు.పి.ఎ.పై కొంచెం వత్తిడి చేసినట్టు నటించిందే కానీ ఈ సమస్యపై దానికి చిత్తశుద్ధిలేదు. ఇక ఎ.ఐ.డి.ఎం.కె. మొదటి నుండీ ఎల్.టి.టి.ఇ.కి వ్యతిరేకమైన పార్టీనే కాబట్టి అది ఎల్.టి.టి.ఇ. ఓటమిని బహిరంగంగానే కోరుకుంది. అయితే ఎన్నికల ముందు, జయలలిత కూడా దాడులు నిలిపివేయాలని శ్రీలంక ప్రభుత్వాన్ని కోరింది, ఒకరోజు నిరాహారదీక్ష కూడా చేసింది. ఎల్.టి.టి.ఇ. పోరాటం వల్ల తమిళనాడు ప్రజల్లో ఉన్న అభిమానాన్ని ఓట్లుగా మల్చుకోవడానికి ఇదొక ఎత్తు. అమెరికా తన టెర్రరిస్టు వ్యతిరేక పోరాటంలో భాగంగా ఎల్.టి.టి.ఇ. మీద కూడా కక్ష కట్టింది. అందులో భాగంగా ఎల్.టి.టి.ఇ. అణచివేతకు అది అన్ని రకాల సహకారాన్ని అందించింది. అది ప్రత్యక్షంగానూ, భారత్ ద్వారా పరోక్షంగానూ శ్రీలంక ప్రభుత్వానికి సహాయం చేసింది.

## కరుణా అమ్మన్ జాతి విద్రోహం

ఎల్.టి.టి.ఇ. ఓటమికి ఆ సంస్థకు కరుణా అమ్మన్ చేసిన విద్రోహాన్ని కూడా ఒక కారణంగా చెప్పుకోవాలి. ఎల్.టి.టి.ఇ.ని బలహీనపర్చడానికి, సంస్థలోనూ, తమిళ ప్రజల్లోనూ చీలిక తేవడానికి ఎల్.టి.టి.ఇ.లో ఓ ముఖ్యమైన నాయకుడిగా పని చేసిన కరుణను ప్రభుత్వం కోవర్టుగా మార్చుకుంది. కోవర్టుగా మారిన కరుణ సంస్థను చీల్చి ఒకమేరకు బలహీనపరిచి, శత్రువు పంచనచేరి సంస్థ ఆనుపానులను అందించి తమిళ జాతికి తీరని ద్రోహం చేశాడు.

## ప్రశ్నార్థకమైన తమిళ ప్రజల భవిష్యత్తు

ప్రభాకరన్ చనిపోయాడు. ఇంకా ఎందరో చనిపోయారు. ఈ 24 ఏళ్లలో 70 వేల మంది చనిపోయారని అధికారిక లెక్కలు చెప్తుంటే ఈ సంఖ్య దాదాపు రెట్టింపు వుంటుందని అనధికార లెక్కలు చెప్తున్నాయి. చనిపోయిన వారిలో తమిళులే అధికంగా వుంటారనేది నిర్వివాదాంశం. మరి యుద్ధంలో చనిపోకుండా మిగిలిన వాళ్ల పరిస్థితేంటి? స్వతంత్ర రాజ్యమనే వాళ్ల కల వాస్తవ రూపం దాల్చుతూ కుప్పకూలిపోయింది. కుప్ప కూలిన ఆ శిధిలాల ముందు, తమ కలను సాకారం చెయ్యడానికి రక్తాన్ని ధారపోసిన తమ బిడ్డలనో, కొడుకులనో, తల్లులనో, తండ్రులనో, అక్కలనో, చెల్లెళ్లనో, అన్నలనో తమ్ముళ్లనో తలుచుకుంటూ దుఃఖంతోనో, కోపంతోనో, నిస్పృహతోనో వాళ్లంతా నిలబడి వున్నారు. ప్రభుత్వం దాదాపు మూడు లక్షల మంది తమిళ ప్రజలను శిబిరాల్లో బంధించిందని వార్తలు వస్తున్నాయి. శ్రీలంకలోనే కాదు తమిళనాడులోనూ ప్రస్తుతం లక్ష మందికిపైగా శరణార్థులు వున్నారు. ఇప్పుడు వాళ్ల గురించి చాలా మంది మాట్లాడుతున్నారు. తమ ఔదార్యాన్ని ప్రదర్శించుకోవడానికి అందరికీ ఇప్పుడు మంచి అవకాశం వచ్చింది. వాళ్లకు బట్టలిస్తాం అంటున్నారు. మందులు ఇస్తాం అంటున్నారు. తిండి పెడతాం అంటున్నారు. పునరావాసం కల్పిస్తాం అంటున్నారు. వాళ్ల ఇళ్లను కూల్చి, వాళ్లను ఊళ్ల నుండి తరిమేసి, వాళ్ల సర్వస్వాన్ని లాగేసుకొని, వాళ్ల పునరావాసం గురించి మాట్లాడుతూ తమ

దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. ఇన్నాళ్లుగా ఏ హక్కుల కోసం వాళ్లు పోరాడుతున్నారో ఆ హక్కుల ప్రస్తావనే లేకుండా కొంచెం కనికరాన్ని మాత్రం చూపిద్దామంటున్నారు. రాజపక్సే 'ఎల్.టి.టి.ఇ.కి మిలటరీ పరిష్కారం తమిళులకు రాజకీయ పరిష్కారం' అన్నాడు. కానీ అంత బలమైన సంస్థ అండగా ఉన్నప్పుడే తమిళులను పట్టించుకోని వాడు, ఇప్పుడు అండ కోల్పోయిన తమిళుల సమస్యలను పరిష్కరిస్తాడా? అసలు వాళ్ల సమస్యను రాజకీయపరంగా పరిష్కరించడానికి సిద్ధపడకపోవడం వల్లనే కదా మిలటరీ పరిష్కారంతో వాళ్ల గొంతులను నొక్కాలని చూసింది. తమిళజాతి అస్తిత్వానికి హానికరమైన తమిళజాతి వ్యతిరేకించిన రాజీవ్-జయవర్ధనే ఒప్పందాన్ని ఇప్పుడు అమలుచేస్తామని అంటున్నాడు. అంటే తమిళ సమస్యకు రాజపక్సే ఎటువంటి రాజకీయ పరిష్కారం ఇవ్వదల్చుకున్నాడో అర్థం అవుతోంది. సింహళ జాత్యాహంకారానికి ప్రతినిధి అయిన రాజపక్సేగానీ మరెవ్వరయినాగానీ తమిళ జాతి సమస్యను పరిష్కరిస్తారని ఆశించడం అమాయకత్వం. తమ సమస్యను పరిష్కరించుకోడానికి ప్రస్తుతం తమిళజాతి ముందు పోరాటం తప్ప మరే మార్గమూ లేదు. అయితే ప్రస్తుతం ఉద్యమం పూర్తిగా దెబ్బతిని వున్న పరిస్థితి, ముఖ్యమైన నాయకత్వంలోని అత్యధికులను కోల్పోయిన పరిస్థితి. మిగిలి వున్న కొద్ది మంది నాయకత్వానికి వెంటనే ఉద్యమాన్ని పునర్ నిర్మించడం సాధారణ విషయం కాదు. అయితే సమస్యలున్నాయి. సమస్యలతో రగిలిపోయే ప్రజలున్నారు. ఆ సమస్యలే ప్రజల నుండి నూతన నాయకులను సృష్టిస్తాయి. ఎంత సుదీర్ఘకాలమైనా పట్టొచ్చు కానీ ఉద్యమం తిరిగి తలెత్తుతుంది. ఎల్.టి.టి.ఇ. అంతర్జాతీయ ప్రతినిధి పద్మనాభన్ వేరే రూపాల్లో ఉద్యమాన్ని కొనసాగిస్తామని చేసిన ప్రకటన ప్రపంచ పీడిత ప్రజల్లో నూతన ఆశలను చిగురింపజేస్తుంది.

## నిరంతరం రగిలే స్ఫూర్తి జ్వాల

ప్రస్తుతం ఎల్.టి.టి.ఇ. సెట్‌బ్యాక్‌కు గురయింది. అయినప్పటికీ రెండున్నర దశాబ్దాల ఉత్తేజకరమైన పోరాటం ద్వారా ప్రపంచ పీడిత ప్రజల యుద్ధ చరిత్రలో అది విలువైన అధ్యాయంగా నిలిచిపోయింది. ప్రపంచ వ్యాప్తంగా యుద్ధ రంగంలో వున్న పీడిత వర్గాల, జాతుల ప్రజలు ఎల్.టి.టి.ఇ. అనుసరించిన యుద్ధతంత్రం నుంచి అధ్యయనం చేయాల్సిన, నేర్చుకోవాల్సిన పాఠాలు ఎన్నో వున్నాయి. ఎల్.టి.టి.ఇ. సాధించిన విజయాల నుంచే కాదు, ప్రస్తుతం దాని ఓటమికి దారితీసిన కారణాలు కూడా గుణపాఠాలుగానే ఉంటాయి. పీడిత ప్రజల పోరాటాలను అణచడానికి దోపిడీ వర్గాలు ఎంత పకడ్బందీగా, ఎంత కల్సి కట్టుగా పనిచేస్తాయో కూడా ఎల్.టి.టి.ఇ. చరిత్ర నుండి తెల్సుకోవచ్చు. పీడిత వర్గాలు, జాతులు ఏకమై అన్ని వైపుల నుంచీ ఉమ్మడి శత్రువును చుట్టుముట్టడం ద్వారానే ప్రపంచవ్యాప్తంగా పీడిత ప్రజలు విజయం సాధించగలరు. ఆ దిశగా ఉద్యమాలను ఉధృతం చేయడమే మనముందున్న కర్తవ్యం. ★

---

*(...21వ పేజీ తరువాయి)*

ఆగిపోయింది. ఎన్నికల అనంతరం బీహార్‌లోని మహదేవ్‌పూర్ వద్ద చేసిన ఆంబుష్‌లో ఇద్దరు పోలీసులు చనిపోయారు. ఈ ప్రాంతంలోనే కారుపై చేసిన మరో దాడిలో ఒక పోలీసు, ఒక ఎన్నికల అధికారి చనిపోయారు.

మొత్తంగా మునుపెన్నటికంటే ఈ ఎన్నికల సందర్భంగా ప్రతిఘటన బాగా జరిగింది. మొత్తం 36 మంది పోలీసులు మావోయిస్టుల దాడులలో చనిపోయినట్లు ప్రభుత్వం ప్రకటించింది.

మే నెలలో దక్షిణ బస్తర్ జిల్లాలోని బెజ్జి ప్రాంతంలో పి.ఎల్.జి.ఎ. చేసిన ఒక ఆంబుష్‌లో ఆరుగురు పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. ఇదే డివిజన్‌లోని కిష్టారం ఏరియాలో హెలికాప్టర్‌పై కాల్పులు జరిపితే ఒక పోలీసు చనిపోగా మరో పోలీసు గాయపడ్డాడు. పశ్చిమ బస్తర్‌లోని నేషనల్ పార్క్ ఏరియా సాగుమెట్ట వద్ద చేసిన ఆంబుష్‌లో ఇద్దరు ఎస్.పి.ఒ.లు చనిపోయి, ఇద్దరు పోలీసులూ, ఒక ఎస్.పి.ఒ. గాయపడ్డారు. మే 11న ఉత్తర బస్తర్‌లోని కాంకేర్ జిల్లా సరిహద్దులో పి.ఎల్.జి.ఎ. చేసిన భారీ ఆంబుష్‌లో 12 మంది పోలీసులు మట్టికరిచారు. రాజకీయ ఖైదీల విడుదలకై, సామూహిక హత్యాకాండకు వ్యతిరేకంగా మే 15 నుండి వారం రోజుల పాటు నిరసన వారంగా పాటించాలనే పార్టీ పిలుపులో భాగంగా పశ్చిమ బస్తర్ డివిజన్‌లోని దంతెవాడ బైలాడిల్లాల నడుమ వున్న వంతెనను పి.ఎల్.జి.ఎ. పేల్చివేసింది. అలాగే గడిచిరోలిలో మరొక చారిత్రాత్మక ఆంబుష్ జరిగింది. మే 21న విదర్భలోని ధనూరా పోలీస్ స్టేషన్ సమీపంలో జరిగిన ఆంబుష్‌లో ఒక సి.ఐ., ఒక ఎస్.ఐ. సహా 16 మంది పోలీసులు చనిపోయారు. ఇందులో ఐదుగురు మహిళా పోలీసులు వున్నారు.

పైన చెప్పుకున్న చర్యల్లో మన నుంచి కూడా నష్టాలు తీవ్రంగా జరిగినట్టూ, పలువురు కామ్రేడ్స్ అమరులయినట్టూ తెలుస్తోంది. నష్టాలను తగ్గించుకుంటూ ప్రతిఘటనను మరింత ముందుకు తీసుకుపోవడానికి కృషి చేద్దాం. ★

# తమిళజాతి విముక్తికై ప్రభాకరన్ తదితరుల వీరోచిత రక్త తర్పణం

## మాతృభూమి స్వతంత్ర కాంక్షను ఉక్కుపాదంతో అణచివేసిన సింహళ దురహంకారం, భారత విస్తరణవాదం, అమెరికా సామ్రాజ్యవాదం



ప్రభాకరన్




తమిళ ఈలం ప్రాంతం

2009, మే 18న ప్రపంచ పీడిత ప్రజలను ఒక పెను విషాదం తాకింది. దాదాపు మూడు దశాబ్దాలపాటు తమిళ జాతి విముక్తి కాంక్షను నిరంతరం జ్వలింపజేసి, ఆ విముక్తి పోరుకు నేతృత్వం వహించిన వేలు పిళ్లై ప్రభాకరన్ ఇక లేడన్నదే ఆ విషాదం. ఇప్పటికే ఎల్.టి.టి.ఇ. పోరాటం దెబ్బమీద దెబ్బతింటూ ఒక్కో స్థావర ప్రాంతాన్ని కోల్పోతున్న పరిస్థితిలో ఉద్యమ భవిష్యత్ గురించి ఆందోళన పడుతున్న ప్రపంచ పీడిత ప్రజానీకాన్ని ప్రభాకరన్ మృతి వార్త దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ వార్తను విని పీడిత ప్రజలు వేదనలో మునిగిపోతే, దోపిడీ వర్గాలు మాత్రం వేడుకలు చేసుకున్నాయి.

పెద్ద పులిగా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ప్రభాకరన్, ఒక బుల్లి దేశమైన, అందులోనూ ఓ ద్వీపకల్పమైన శ్రీలంకలోని, మైనారిటీ తమిళ జాతికి ప్రతినిధి. ఓ బుల్లి దేశంలోని, అందులోనూ ఓ మైనారిటీ జాతికి ప్రతినిధి అయిన ప్రభాకరన్, ప్రపంచ ప్రఖ్యాతిని ఎలా పొందాడు అని ప్రశ్నిస్తే ఆ ద్వీపకల్పంలో అతను రగిలించిన పోరు జ్వాలలే సమాధానం అవుతాయి. ఆ పోరు జ్వాలలు ప్రపంచ వ్యాప్తంగా పీడిత వర్గాలనూ, జాతులనూ ఉత్తేజపరిస్తే, దోపిడీ వర్గాలకు సెగను పుట్టించాయి. పీడిత వర్గ, జాతుల పోరాట కారులకూ, యుద్ధ నిపుణులకూ ప్రేరణను కల్గిస్తే, దోపిడీ వర్గ యుద్ధ నిపుణులను కలవరపరిచినయి.

ఇంతలా ప్రపంచాన్ని ఆకర్షించిన జాతి విముక్తి పోరు నేతగా అతను ఎదగడం వెనుక అతని జాతి పొందిన అణచివేత వుంది. కోల్పోయిన స్వాతంత్ర్యం వుంది, వెల్లగక్కిన క్రోధం వుంది, సంధించిన ప్రశ్నలున్నాయి.

### తమిళజాతిపై సింహళ దురహంకారం

తమ సొంతగడ్డ మీదనే తమిళజాతి గురవుతున్న పరాయికరణ అర్థం కాకుంటే ప్రభాకరన్ అర్థం కాడు. అతను నడిపిన పోరాటమూ అర్థం కాదు. ఈ పరాయీకరణ అర్థం కావాలంటే చరిత్రలోకి తొంగి చూడాలి.

*(మిగితాది 38వ పేజీలో...)*